TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204020
UNIVERSAL LIBRARY

OUP—901—26-3-70—5,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T922.945 V4G S   Accession No. P.3. T1399

Author వేంకటశాస్త్రులు బులుసు.

Title శ్రీమహర్షి జీవితకథామృతము

This book should be returned on or before the date last marked below.

మా. భా. 1953.

తొలికూర్పు : 1953.

వెల రూపాయి.

సర్వస్వామ్యసంకలితము,

బి. వి. అండు సన్సు.

శ్రీ సత్యనారాయణ ముద్రణాలయము,
కాకినాడ.

# విషయసూచిక.


| | | | | | |
|---|---|---|---|---|---|
| i | తొలిపలుకు | | 4. | కణ్వుఁడు | 58 |
| i | అంకితము | | 5. | కర్దముఁడు | 68 |
| 1. | అంగిరసుఁడు | 1 | 6. | గర్గుఁడు | 77 |
| 2. | ఔర్వుఁడు | 37 | 7. | గౌరముఖుఁడు | 88 |
| 3. | కండుఁడు | 50 | 8. | జాబాలి | 98 |


---

# తొలిపలుకు

శ్రీమహర్షిజీవితకథామృత మనుపేర నిదివఱకు అగస్త్యుఁడు, అత్రి, అష్టావక్రుఁడు, ఋశ్యశృంగుఁడు, కపిలుఁడు, కశ్యపుఁడు, గౌతముఁడు, చ్యవనుఁడు, జమదగ్ని, దత్తాత్రేయుఁడు, దధీచి, దుర్వాసుఁడు అనుమహర్షులజీవితచరిత్రలు ప్రథమభాగముగాను; నారదుఁడు, పరాశరుఁడు, భరద్వాజుఁడు, భృగుఁడు, మార్కండేయుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, వసిష్ఠుఁడు, విశ్వామిత్రుఁడు, వ్యాసుఁడు, శ్రీశుకుఁడు అను మహర్షులజీవితచరిత్రలు రెండవభాగముగను రచించి ప్రకటించితి.

ఇపు డీయెనమండుగురుమహర్షులజీవితచరిత్రలు మూఁడవభాగముగ రచించి ప్రకటించితిని. ఇటులే యింకను జైమిని దేవలుఁడు, పిప్పలాదుఁడు, బకదాల్భ్యుఁడు, మరీచి, మాండవ్యుఁడు, ముద్గలుఁడు, మైత్రేయుఁడు, రైభ్యుఁడు, వామ

దేవుఁడు, వాల్మీకి, వైశంపాయనుఁడు, శాండిల్యుఁడు, శాకల్యుఁడు, శౌనకుఁడు, సనత్సుజాతుఁడు, సారస్వతుఁడు, హారీతుఁడు మున్నగుమహర్షులజీవితచరిత్రలు మఱికొన్ని భాగములుగ రచించితిని. దైవదయ గలచో వానిని త్వరలోఁ బ్రకటింపఁగలను.

ప్రాచీనభారతవర్ష మహర్షుల పవిత్రచరిత్రలు వ్రాయుట కంతటిమహర్షులే యర్హులు. నా యీసాహసమును మన్నించి సహృదయులు నాయుద్యమమందలి గుణలేశమునే గ్రహించి యాశీర్వదింతురుగాక !

నందన మాఘ బ ౫. బు. వేం.

# అంకితము

శ్రీమద్భారతవర్షపూర్వఋషిస
చ్ఛీలంబు మాహాత్మ్యమున్
నీమంబున్ దమమున్ శమంబు సుగుణా
నీకంబుఁ గైకొన్న ని
ష్కామిశ్రేష్ఠ ! గురూత్తమా ! పరమవి
జ్ఞానప్రదీపా ! కృపా
శ్రీమాన్యా ! కయికొమ్ము మత్కృతి మహా
శీర్వర్షివై హర్షివై.

# అంగిరసుఁడు

## జననము

శ్రీవిష్ణుమూర్తినాభికమలమునుండి జన్మించిన బ్రహ్మదేవుఁడు సృష్టికార్యమునఁ దనకు సహాయులుగా నుండు రనునుద్దేశముతోఁ గొందఱుమానసపుత్త్రులను గాంచెను. తనముఖమునుండి యాతఁ డిచ్ఛామాత్రమున నొకసుపుత్త్రుని గాంచి యాతనికి 'అంగిరసుఁ' డనునామకరణము చేసెను. పిమ్మటఁ బరమేష్ఠి తనబహుకాల తపోమహిమముచేఁ దనపుత్త్రుఁ డగునంగిరసుఁడు ముల్లోకములను ప్రకాశింపఁజేయు దివ్యతేజస్వి యగున ట్లనుగ్రహించి, "వత్సా! నీవు లోకసంగ్రహార్థము మహాతప మొనరింపుము. నీవు నామానసపుత్త్రులలో మూఁడవవాఁడవు. నీవు నాదయకుఁ బాత్రుఁడవై నేఁ గోరినపుడు వచ్చి నేను జెప్పినపను లెల్ల నిర్వహించుచు లోకసంరక్షణ మొనరింపుము. నీవు సుగుణాఖని యగు నొకసుందరిని బరిగ్రహించి వంశవర్ధన మొనరింపఁగలవు. మఱియు నీ వగ్నికల్పుఁడవై విశ్వవిఖ్యాతి నార్జించి వెలుఁగొందుదు" వని తెలిపెను. అంగిరసుఁడు బ్రహ్మకు నమస్కరించి "తండ్రీ! సమస్తలోకములకు సృష్టికారకుఁడ వగు నీపం పొనరింప నేను సంసిద్ధుఁడను. లీలామాత్రముగా నీవు మ మ్మిట్టులు సృజించి మాచేఁ బనులుగొనునట్లు కాననగుదువు కాని, కమలాసనుఁడ వగునీ వొనర్పఁజాలనిది కలదే? నీనిర్హేతుకవాత్సల్యలక్ష్మికిఁ

దావల మైనా యీజన్మము పరమధన్యముగదా!" యని యాతని మదికెక్కఁ బలికె. యతని యానతిఁ గొని తపోగమనుఁ డయ్యెను.*

## తపోనిరతి

అంగిరసుఁ డిట్లు తండ్రిచే నియోజితుఁడై పరబ్రహ్మ స్వరూపమును గుర్తెఱుంగుటకుఁ, బాంచభౌతిక మైనదేహమునం దగులుమమకారపరంపరల మటుమాయ మొనరించుటకు, నింద్రియాశ్వముల విచ్చలవిడిఁ బోనీయక యుత్తమశిక్షణ మొసంగి యదుపాజ్ఞలలో నుంచుకొనుటకు సర్వోత్తమ మైనమహాతపో నిష్ఠలోఁ బెక్కేండ్లుండి సర్వశక్తిమయుఁడు సర్వేంద్రియనిర్జ

---

* ఇది భారతమునఁ గలకథ. ఈతనిజన్మకథ ఐతరేయబ్రాహ్మణమున నిట్లు కలదు: ప్రజాపతి యగుబ్రహ్మ సరస్వతిని సృజించి యామెసౌందర్యమున కచ్చెరు వంది యామెనే తనయాలిగాఁ బరిగ్రహించి యామెతోడి సంభోగ సుఖ మనుభవించెను. ఆనూతన మగు నాసంభోగసమయమున నాతనివీర్యము నేలపైఁ బడెను. ఇది తెలిసి దేవతలు పరుగున వచ్చి యగ్నిదేవునిసాయమున నాబీజప్రదేశమును గాపాడుచుండ నగ్నిదేవుఁ డానందాతిశయమునఁ బ్రజ్వలిల్లెను. ఆయగ్నిదేవునియంగారములనుండి యాబీజము పెంపారి బాలాకృతిని ధరించెను. ఇతఁడే అంగిరసుఁడు. (ఐతరేయబ్రాహ్మణము 3_34.) ఈకథయే స్వల్పభేదముతో శతపథబ్రాహ్మణమునను గలదు. 4_5_1_8.)

గోపథబ్రాహ్మణమున, అంగిరసునిజన్మవృత్తాంత మిట్లు కలదు: వరుణదేవుఁ డొకప్పుడు దేవతలకోరిక ననుసరించి మహాతపస్సు చేయఁదొడఁగెను. ఆతనితీవ్రతపస్సువలనఁ గలిగినశ్రమ కారణముగా నాతనిశరీరమునుండి దివ్యరస ముద్భవించెను. ఈవిధముగా వరుణుని యంగము_దేహము_నుండి యుద్భవించిన రసమే మానవాకృతిఁ గాంచి యంగిరసుఁ డయ్యెను. ఈయంగిరసుఁడు మహాతపశ్శాలియై 'అంగిరసవేదము'నకు ద్రష్ట యయ్యెను.

(గోపథబ్రాహ్మణము 1. 1. 7_8.)

తుఁడు నై యాతఁడు సర్వేశ్వరసదృశుఁ డన వెలుఁగొందు చుండెను.

తండ్రి యగుబ్రహ్మదేవునికృపచేతనే యంగిరసునకు దివ్య తేజము పుట్టుకతోడనే లభించెను. నిష్ఠాగరిష్ఠుఁడై యాతఁ డొనరించుచున్నమహాతపస్సువలన నాతఁ డింకను దేదీప్యమానముగా వెలుఁగొందుచుండెను. ఆతనితపశ్శక్తివలన నాతనికి సర్వశక్తులు లభించుచున్నను నాతఁ డిసుమంతయైన గర్వము నందఁ డయ్యెను. సర్వలోకప్రకాశమాన మగునాతని తేజోవిశేషమునను నతనికిఁ దపోనిరమణదృష్టి పొడమదాయెను. నిరంతరతపోధ్యానామృతమునఁ జుబ్బుచూఱ లాడునాతనికిఁ దపోవ్రతవిరమణము నిచ్చ పుట్ట దయ్యె నన్న నచ్చెరు వేమున్నది ? లుబ్ధదృష్టితో సర్వ మార్జించుటవలనఁ గలుగుసంతోషముకన్న సర్వత్యాగమువలని సంతోష మెంతయుత్కృష్టము ! దేహబంధుమమకారములకును దానిని దగ్ధ మొనర్చు నచంచలతపోనిష్ఠకును నెంతదవ్వు !

## వి వా హ ము

ఈప్రకార మంగిరసుఁడు తపోమూలమగు మహర్షిత్వ మందఁ గని విజ్ఞాననిధియు వివేకఖనియు నై యనేకము లగు వేదమంత్రములకు ద్రష్టయు బహుముఖము లగుధర్మములకు శాసకుఁడు నై విలసిల్లుచుండెను.

అంతకుమున్నే విశ్వసృష్టికై బ్రహ్మచే నియోగింపఁబడి కర్దమప్రజాపతి సరస్వతీనదీతీరమునఁ బదివేలసంవత్సరములు దివ్య తప మొనరించి విష్ణుమూర్తికటాక్షముచే కళ, అనసూయ, శ్రద్ధ,

హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి యనుతొమ్మండ్రు కూఁతుండ్రను, కపిలాచార్యుఁడనుపుత్త్రుని నిజసతియగు దేవహూతి యందుఁ గాంచెను. కాలక్రమమున నీతనికూఁతులు త్రిలోకసుందరులు, సర్వలోకసద్గుణసంపన్నలు, మహాశక్తిప్రభావాన్వితలు నయి యుక్తవయస్సుఁ గాంచి వివాహయోగ్యలై కమలాకరమున విలసిల్లుపద్మములవలెఁ గర్దమప్రజాపతిగృహమున కత్యంత శోభాయమానలు కాఁజొచ్చిరి.

అంతఁ గర్దమప్రజాపతి సుతలకుఁ దగినపతుల నన్వేషింపఁ దలంచి, తనదివ్యదృష్టిచే మరీచి, అత్రి, అంగిరసుఁడు మున్నగు బ్రహ్మర్షులే తన కల్లుండ్రగుట బ్రహ్మలిఖితముగాఁ గని, తానొసర్చుకన్యాదానమును స్వీకరించి తన్ను ధన్యు నొనర్పఁ దని తగినవారని మరీచి, అత్రి, అంగిరసుఁడు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, భృగుఁడు, వసిష్ఠుఁడు, అధర్వుఁడు నను నవ బ్రహ్మలను బిలువ నంపెను. కర్దమునియాహ్వానమును మన్నించి యాఋషులు విచ్చేసిరి. అంగిరసోమహర్షి కూడ నీతరుణముఁ నే కర్దమగృహమునకు విచ్చేసి యాతనికన్యను బరిగ్రహించుట కంగీకరించెను. అంతఁ గర్దముఁ డమితానందమున దేవహూతీసహితుఁడై మరీచికిఁ గళను, అత్రి కనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠున కరుంధతిని, అధర్వునకు శాంతిని నొసఁగి నిజకులాచారానుసారముగ నిరుపమవైభవముతో నిఖిలదేవర్షిసంఘములు నిర్మలవేదమంత్రనినాదములు నింగిముట్టింప వివాహము లొనరించెను. సర్వలోక

సంప్రాజ్యను లగువీరివివాహములకు విచ్చేసినసర్వ ఋషిసర్వదేవ సంఘములు వీరి నాశీర్వదించి వెడలిరి. దేవహూతీకర్దములు కూఁతుల నల్లురతో సంభావనాసంభావితులఁ జేసి, యనశ్వర మగునాత్మానందసింహాసనముల నధిష్ఠించి యజరామరత్వము నందను, అత్యంతపవిత్రజీవనమున నఖిలలోకముల కాదర్శ ప్రాయులు కాఁగను, అఖిలలోకప్రతిభాశాలు రగు పుత్త్రిలను అత్యుత్తమపతివ్రతాశిరోమణు లగుపుత్త్రికలను గాంచి వంశాభి వృద్ధి నందింపను, ఆశీర్వదించి వారివారియిండ్లకుఁ బంపివేసిరి.

ఈవిధముగా నంగిరోమహర్షి శ్రద్ధను ధర్మపత్నిఁగా గ్రహించి యుత్తమాముల యమోఘాశీస్సులతోఁ దనయాశ్రమ మునకు విచ్చేసి గృహస్థజీవనము నద్భుతముగా నిర్వహింపఁ జొడంగెను.

## సంతానము

బ్రహ్మజ్ఞాని యగునంగిరసుఁడు విద్యావినయవివేకసౌశీల్య యగుశ్రద్ధయుఁ బరమపవిత్రదంపతులై చేసినసంసారయాత్ర మోక్షలక్ష్మిని జేరుటకుఁ జేసినసమ్యగ్యాత్రయే కాని నలసారము వంటిసంసారము కాదు. కాలకర్మములకు నింద్రియవాంఛా ప్రవృత్తులకు వారతీతులై నియమధనమును, నిగ్రహసంపదను, నిరుపమతపోనిధులను వారు సంసారయాత్రలో సంపాదించుకొనిరి. ఈశ్వరప్రియములు సర్వేశ్వరోద్దిష్టములు నగుపవిత్రకార్యములలో నిమగ్నులై, జగమంతయు నీశ్వరమయముగాఁ గనుచు, మనో వాక్కాయకర్మములు పరమేశ్వరపాదాంబుజములయందే నిశ్చల ముగా నిలుపఁగలిగి, నిత్యానందాబ్ధిలో వారోలలాడుచుండిరి.

ఇట్లు గృహస్థజీవనమును సైతము తపోమయజీవితముగా నిర్వహించుచు అంగిరసుఁడు పరమేష్ఠియగు తన తండ్రియాదేశమును శిరసావహించి తనధర్మపత్ని పతివ్రతాతిలకము నగు శ్రద్ధయందు బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుఁడు, బృహన్మంత్రుఁడు, బృహద్భానుఁడు, బృహస్పతి యను నేడ్వురుపుత్రులను; భానుమతి, రాక, సినీవాలి, ఏకానేక, అర్చిష్మతి, హవిష్మతి, మహామతి యనునేడ్వురుపుత్త్రికలను గాంచెను.* వీరిలో బృహత్కీర్తియే యుతథ్యుఁ డను నామాంతరమునను బృహజ్జ్యోతియే సంవర్తుఁ డనుమఱియొకపేరుతోడను గూడఁబిలువఁబడుచుండెడివారు. కాలక్రమమున నంగిరసుని పుత్త్రికలకు బహుపుత్రులు వారిపుత్త్రికలకుఁ బుత్రులు నెందఱో జనించుటచే నాతనివంశము తామరతంపరయై విశ్వమంతయు నలముకొనెను. అంగిరసునిపుత్త్రికలను పౌత్రులను బ్రపౌత్త్రులను గూడ అంగిరసు లనియు, అంగిరులనియు, ఆంగిరసు లనియు శ్రుతిస్మృతిపురాణములు పేర్కొనియున్నవి.

వీరిలో అయాస్యుఁ డనువాఁడొకమహర్షియై యనేకవేదమంత్రములకు ద్రష్టయయ్యెను. ఆతనినే అయాస్యాంగిరసుఁ డని పిలుతురు. ఆతనిసంతతివారే ఆయాస్యులు. ప్రస్తుతము గౌతమసగోత్రులు అంగిరస,అయాస్య, గౌతము లన్త్రయార్షేయులు. ఈవంశమునకు మూలపురుఁ డైనబ్రహ్మర్షి చంద్రముఁడే అంగిరసుఁడు.

---

* కాని, అంగిరసునకు ఉతథ్యుఁడు, బృహస్పతి, సంవర్తుఁడు అను మువ్వురుకొడుకులు, గుణాశ్రయ యోగసిద్ధి, యనుకూఁతురుమాత్రమే పుట్టినట్లు భారతము ఆదిపర్వము (3 ఆ. ౬౬) నఁ గలదు.

## అంగిరసుఁ డగ్నియగుట

పూర్వ మొకప్పు డగ్నిహోత్రుఁడు దేవతలపైఁ గోపించి తనవిధ్యుక్తకర్మములు నిర్వర్తింప మాని రహస్యముగ నేకాంతవాసమున నొకయడవిలోఁ దపస్సుచేయుచు నుండఁదొడఁగెను. అప్పుడు దేవత లీవిషయము బ్రహ్మకుఁ దెలిపి నిత్యకృత్యముల కాటంకము కలుగకుండుటకై ప్రతివిధాన మేదైనఁ గావింపుమని కోరిరి. అంత, బ్రహ్మదేవుఁ డాలోచించి యగ్ని దేవునికన్నఁ దేజస్వియు నుత్తమవ్రతసంపన్నుఁడు నగుఅంగిరసుఁడే యగ్ని కృత్యములునిర్వర్తింపఁగలఁ డని యూహించి యామహర్షియాశ్రమమున కేతెంచెను. శ్రద్ధాంగిరసు లాతని నతిశ్రద్ధాభక్తులతో బూజింప నాతఁడు వచ్చినపనిఁ దెలిపి యనంతతపోబలముచే మహాతేజస్వియై యెల్లలోకములను బ్రకాశింపఁజేయునంగిరసు నగ్నిపదమున నిలిపి యగ్నివిధు లెల్ల నిర్వర్తింప నియమించెను. అంగిరసుఁడు వినయమున నంగీకరించి యాతనిని వీడ్కొలిపెను.

అప్పటినుండి యంగిరసుఁడే యగ్నియై దేవతలకు సర్వలోకములందును జరగుయజ్ఞములనుండి హవ్యభాగములను మోసికొనిపోయి వారియాదరగౌరవముల కెంతయో పాత్రుఁడై యగ్ని లేనిలోపమును జక్కఁగాఁ బూరించి యాతనికన్న మిన్నగా నగ్నిపనులు నిర్వర్తించుచుండెను. ఇట్లుండ నంగిరసునిప్రభావసంపన్నతచేఁ దనపేరును జనులు విస్మరించుచుండుట నెఱింగి యగ్నిహోత్రుఁడు తనయవివేకమునకు వగచి యిఁక నేమఱినచోఁ దననామరూపములే నశించిపోఁగల వని భయపడి మరల నిజ

స్థానమును గైకొన నరణ్యమునుండి దేవలోకమునకు విచ్చేసెను. కాని, యంగిరసుఁ డత్యద్భుతముగాఁ దనపనులను నిర్వర్తించుచు దేవతలకుఁ బ్రీతిపాత్రుఁడు నత్యంత తేజోవిలసితుఁడునై యుండుటఁ గాంచి మిక్కిలి వెఱఁగంది యాతనిముందు నిలువనైన నిలువలేక తేజోవిహీనుఁడై తిరిగి వనభూములకేఁగ మఱలెను. ఆతనిని గాంచినయంగిరసుఁడు సగౌరవముగాఁ బిల్చి "మహాత్మా! చరాచరప్రపంచమున కంతకును భుక్తిముక్తిప్రదాతవు నీవు. నీవు లేనిచోఁ బ్రపంచ మొక్కక్షణమైన నిలువఁగలదా? మహాతేజస్వివైననీవు నీకార్యము లొనర్చుచు లోకసంగ్రహ మొనరింపుము. నీవు లేనికారణమున బ్రహ్మచే నియోజితుఁడనై యీకార్యములు నేను చేయుచున్నాను. కాని, నీతో నే నణుమాత్రము సరిపోలను. నీయగ్నిపదవిని నీవే స్వీకరించి నన్నును లోకములను గటాక్షింపు" మని వేఁడుకొనెను.

సర్వశక్తిసంపన్నుఁడైనను నంతవినయగరిమ వివేకబుద్ధి కనఁబఱచినయంగిరసునకు భయభక్తులతోఁ బ్రణామము లొనరించి యగ్నిదేవుఁడు "మహర్షీంద్రా! నీతేజోగరిమవలన నా యూరుఁబేరులన్నియు నశించినవి. ముల్లోకములందు నీప్రభావ మనంతముగా నలముకొన్నది. అగ్నిస్థానమున సర్వశక్తిసంపన్నుఁడ వగునీవే యుండవలయునుగాని తేజోవిహీనుఁడ నగు నేనుండ నర్హుఁడనుగాను. మఱి నీవు కాదుకూడ దందువేని నీవు ప్రథమాగ్నివై యుండి నాకు రెండవ యగ్నిస్థానము నొసంగుము. అంతియే కాని నిజముగా నీకంటె నెన్నఁడును మిన్నఁ గాఁజాలని నన్ను

నీ వట్లు కోరుట ధర్మము కా''దని పలికెను. అందుల కంగిరసుఁడు ''దేవా! కాలకర్మవశమున నొక్కొక్కప్పు డెంతవారైనఁ దేజో విహీను లగుచుందురు. కాని, యచిరకాలముననే వారు మరల నిజప్రభావము నందఁగలరు. క్రోధకారణమున నీ విట్లు కొంత కాలము తేజోహీనుఁడ వైన నై యుండవచ్చును. అంతమాత్ర మున నీనైజప్రభావము శాశ్వతముగాఁ గొఅవశముకదా! కావున, నీవే ప్రథమాగ్నివై యథాపూర్వముగా నీవిధుల నిర్వర్తించి లోకహితము చేయుము. మఱి యిఁకఁ గాను కూడ దండువా నన్నుఁ బుత్త్రవాత్సల్యమున రెండవయగ్నిస్థానమున నిలుపుము. నీకు విధేయుఁడనై నీయాజ్ఞలను శిరసావహింతు'' నని చెప్పెను. అందుల కగ్నిదేవుఁడు వల్లె యని తాను బ్రథమాగ్నిస్థానమున నిలిచి యంగిరోమహర్షిని ద్వితీయాగ్నిస్థానమున నుంచి యాతని మహానుభావత కనురూపముగా నాతనిపుత్త్రుఁ డగుబృహస్పతికి సంభావనపూర్వకముగాఁ దృతీయాగ్నిస్థానము నొసంగి వారిరువు రను దనతోడివారి నొనర్చుకొనెను.

ఇట్లు సర్వోత్కృష్ట మగుతపోధ్యానలబ్ధతేజోబలమున నంగిరసుఁడు సకలజగత్పావన మగునగ్నిదేవతాస్థానము నంది వెలుఁగొందుటయే కాక తనపుత్త్రుఁ డగుబృహస్పతికి నట్టిస్థాన మును సంపాదించి యది వంశక్రమాగత మగునట్లు చేసికొనెను.

## అంగిరసుఁడు చిత్రకేతు ననుగ్రహించుట

తొల్లి శూరసేనదేశమును చిత్రకేతుఁ డనురాజు పరిపాలిం చుచుండెను. ఆతఁ డైశ్వర్యమున దేవేంద్రునిఁ బోలి, క్షమాది

సద్గుణంబులు కొటపట్టయి, ప్రజారంజకముగ రాజ్యమేలుచుండెను. గుణమండనుఁడు, అంచితకీర్తికాముఁడు నగునాతనికిఁ దారుణ్యమదనతురంగులు, కందర్పవిజయఖడ్గలతలు, మదనమోహనమంత్రదేవతలు, పంచశిలీముఖునిబాఁదెకత్తెలు ననఁ జెలువొందుకోటిమంది నళినాక్షులు భార్య లుండిరి. ఆతఁ డమితకీర్తివైభవములతోఁ జెలువారుచుండియుఁ గోటిమందిభార్యలను గలిగియుండియు సంతానమునుమాత్రము కనఁజాలఁడయ్యెను. రూపము, ప్రతాపము, భోగము, యౌవనము, యోగ్యవర్తనము, దిగ్విజయము, సత్యము, కీర్తి, సతులు మున్నగునైశ్వర్యము లెన్నియున్నను నాతనికి సంతతిలేనిదుఃఖమును మాప్పఁజాలవయ్యెను. ఇట్లు నిరంతరదుఃఖమానసుఁడైన చిత్రకేతునిపై దయగొని యొకనాఁ డంగిరసుఁ డీతనియింటికి విచ్చేసెను.

చిత్రకేతుఁ డంగిరోముని కెదురేఁగి యాతని కతిథిసత్కారము లనేకము లొనరించి యుచితాసీను నొనర్చి భార్యాసహితుఁడై యాతని నెంతయో సేవించెను. అంగిరసుఁడు నాతని కుశల మడిగి “రాజా! రాజ్యచక్ర మంతయు నీయధీనమే కదా? పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము, మహత్తు, అహంకారము—అను నీయేడింటిచేతను సంరక్షితుఁ డగుజీవునివలె అమాత్యజనము, జానపదులు, దుర్గములు, ద్రవిణము, సంచయము, దండము, మిత్త్రము అనుసప్తవిధప్రకృతులచేతను సురక్షితుఁడవై ప్రకృతిపురుషులపై సమస్తభారమును విడిచి నిర్మమత్వమున నిరుపమరాజ్యసుఖము లనుభవింతువుగదా? మఱియు

భార్యలు, ప్రజలు, మంత్రులు, భృత్యులు, పౌరులు, జానపదులు నీకు వశవర్తులై యున్నారా? ఏమిది! సర్వమును గలిగినసార్వభౌముఁడ వయ్యు నీముఖమున దుఃఖచిహ్నములు తాండవమాడుచున్న వేల?" యని యడిగెను. చిత్రకేతుఁడు "మహర్షీంద్రా! మీతపోబలమున మీ కెఱుఁగరాని దేమున్నది?" యని తలవాల్చి యూరకున్నఁ జూచి యంగిరోమహర్షి సర్వముఁ దెలిసి దయాళువై యారాజుచేఁ బుత్రకామేష్టిఁ జేయించి యజ్ఞశేషము నాతనిప్రథమభార్య పట్టమహిషి యగుకృతద్యుతి యను నామె కొసంగి "దేవీ! నీకు పుత్త్రుఁడు కలుగును. అతనివలన నీవు సుఖదుఃఖము లనుభవింతు" వని చెప్పి వెడలిపోయెను.

తరువాత, కృతద్యుతి గర్భమును ధరించి నవమాసములు నిండినంత నొకకుమారునిఁ గాంచెను. చిత్రకేతుఁ డపరిమితానందము నంది కృతస్నాతుఁడు సకలభూషణభూషితుఁడునై సుతునకు జాతకర్మాదు లొనరించి సర్వవర్ణములవారిని మహాదానముల రంజింపఁజేసి సుఖముండెను. ఆకుమారుఁడును దినదిన ప్రవర్ధమానుఁ డగుచుండ రాజు సుతుని గన్న కృతద్యుతియందే బద్ధానురాగుఁడై యుండెను. ఇది గని మిగిలినభార్య లసూయ చెంది రాజునకుఁ గృతద్యుతియం దిట్టిమహానురాగమునకుఁ గారణ మాపుత్త్రుఁడే యని గ్రహించి దారుణచిత్తలై యాతనికి విష మిడిరి. ఆ బాలుఁడు సుఖనిద్రితునివలె వెంటనే మరణించెను. రాజును రాణియు నీదుఃఖవార్తను విని యాతనిపైఁ బడి తలమొల మెఱుంగక పెద్దపెట్టున విలపించుచుండిరి.

ఈసంగతియంతయు నెఱింగి కరుణాళుఁడై యంగిరసుఁడు నారదునితోఁ గూడి యట కేతెంచి దుఃఖమూర్ఛితుఁడైన చిత్రకేతుని గనుంగొని "రాజా! ఏ మిట్లుమతిదొరఁగి విలపింతువు? నీకు నీఁ డెవఁడు? నీ వెవ్వనివాఁడవు? ఈనీపుత్రమిత్రాదులు పూర్వజన్మమున నెవరెపుత్రమిత్రాదులో నీ వెఱుఁగఁగలవా? నదీవేగమునఁ జేరి తొలఁగుచున్నయిసుకరేణువులవలెఁ బ్రాణులు పుట్టుచుఁ జేరుచుఁ జచ్చుచుండును. విష్ణుమాయవలన భూతములకు భూతములు పుట్టి నశించును. దీని కింత విచారించుట ప్రాజ్ఞలక్షణము కాదు. నీవు, మేము, తక్కినవారు కూడ ఈకాలమున జన్మించితిమి. మఱి మృత్యువువలన విరామ మందుదుము; అచిరముననే చచ్చినవార మగుదుము. చావుపుట్టుకలు సత్యములు కావు. ఈశ్వరుఁడు లీలాలోలుఁడై భూతములచే భూతములఁ బుట్టించు. వానిచే వానిని బెంచు. వానిచే వానిని నశింపఁజేయు. ఆతనిచే సృజింపఁబడిన దేనికిని స్వాతంత్రత లేదు. ఆతఁడు బాలునివలె నిరపేక్షుఁడు. దేహియైనపితృదేహముచేత దేహియైనపుత్రదేహము మాతృదేహమువలనఁ గలుగుచుండును. ఈరీతినే బీజమువలన బీజము పుట్టుచుండుట దేహికి శాశ్వతముగా జరుగుచుండును. సామాన్యవిశేషములు సన్మాత్రవస్తువునకుఁ గల్పింపఁబడినట్లే దేహమునకు జీవునకు నన్యోన్యవిభాగమజ్ఞానమునఁ గల్పింపఁబడెను. దహనక్రియల నగ్ని యొక్కఁడయ్యుఁ బెక్కురూపంబులఁ గానఁబడునట్లు ఒక్కఁడైనజీవుఁడు పెక్కుభంగులఁ గాననగుచుండును. ఆత్మజ్ఞానరహితులు దీని

నెఱుంగలేరు. దేహి దేహసంయోగము కలలో భయమునుగొలుపు ప్రయోజనమును నడపి మేలుకని యాకలలో జరిగినది తనకుఁ గాదని యెఱుంగురీతిని జీవుఁడే తా నని జ్ఞానగోచరుఁ డెఱుంగును. కావున, అన్నియు మనోమాత్రములే యని మోహాతమమును విడిచిపెట్టి భగవంతుఁ డైన వాసుదేవునిపైఁ జిత్తము నిలిపి నిర్మలాత్మకుఁడ వగు" మని బోధించెను.

చిత్రకేతుఁ డీయుపదేశామృతమునఁ దెలివందియు దుఃఖ భారమున వారిని గుర్తింపఁజాలక మీ రెవ్వరని యడిగెను. అందులకు అంగిరసుఁ డిట్లనియె. "ఓరాజా! పుత్త్రకాముఁ వైన నీకుఁ బుత్త్రి నను గ్రహించినయంగిరసుఁడను నేను. ఈతఁడు నారదమహాముని. దుస్తరపుత్త్రశోకమున మునిఁగిననిన్నుఁ గరుణించి పరమజ్ఞాన ముపదేశింప వచ్చితిమి. నీదుఃఖమును మాన్పఁ బుత్త్రిని బ్రదికించితిమేని పుత్త్రవంతు లగువా రనుభ వింపవలసినమహాతాపము నీ వనుభవింపవలసి వచ్చును. లోక మున సతీసుతులు, సర్వసంపదలు, భోగభాగ్యములు, అతిచంచ లములు. రాజ్యము, భూమి, బలము, ధనము మొదలగున వెల్ల శోకము, మోహము, భయము, బాధ వీని నెడతెగక కలి గించుచుండును గాని సుఖముల నీయఁజాలవు. మఱియు నివి గంధర్వనగరమువలెఁ గలలోఁ గననైన సంపదఁబోలి కానఁబడు చుండునే కాని మనోభవము లగునర్థములఁ గూడి స్వార్థంబులై కానఁబడవు. కర్మములచే ధ్యానము చేయుమనములు నానాకర్మ ములు గలిగించుచుండును. ఈదేహి దేహము ద్రవ్యము, జ్ఞానము

క్రియ అనుమూఁడింటితోఁ గూడుకొని దేహికి అనంతము లగు దుఃఖములను గలిగించుచుండును. కావున, నీవు నిర్మల మగుమనస్సుతో నాత్మగతిని వెదకికొని శాశ్వతపదవి నందుము.” అని బోధించెను. చిత్రకేతుఁ డీయుపదేశమునఁ దెలివందియుండ నారదుఁడు తనప్రభావమునఁ జచ్చినపుత్త్రుని బ్రదికించి యాతని చేతనే యాతనికిని జిత్రకేతునకు లవమాత్రము సంబంధము లేదనియు:

“సతు లెవ్వరు సుతు లెవ్వరు
పతు లెవ్వరు మిత్త్రశత్రుబంధుప్రియసం
గతు లెవ్వరు సర్వాత్మక
గతుఁడై గుణసాక్షి యైనఘనుఁ డొక్కనికిన్.”

అనునాత్మజ్ఞానమును బోధింపఁజేసెను. అపుడు చిత్రకేతుఁడు వగ లుడిగి సర్వసంపదలు త్యజించి నారదోక్తమార్గమున మోక్షపద మందె వెలుఁగొందెను. ఇట్లు అంగిరోమహర్షి భక్తితత్పరులు సంసారార్ణవములోఁ మునిఁగి వివేకహీను లైనపుడఖండజ్ఞానబోధామృతమున నెందఱనో తరింపఁజేయుచుండెడివాఁడు. అనంతరము నారదాంగిరసులు సరససల్లాపములతో నాత్మజ్ఞానరహస్యములను బెక్కు వక్కాణించుకొనుచు యదృచ్ఛాగమనమున బ్రహ్మలోకమున కేఁగిరి.

అంగిరసుని తీర్థయాత్ర

అంగిరసుఁ డొకానొకప్పుడు కశ్యపమహర్షి వలన సమస్తతీర్థములప్రభావము నెఱిఁగి యెల్లతీర్థముల నోలలాడి విచ్చేసెను.

అపిమ్మట గొంతకాలమునకు గౌతమమహర్షి యంగిరసునిపాలికి విచ్చేసి "మహాత్మా! పరమార్థసారము కడముట్ట నెఱింగిన పుణ్యపురుషుఁడవు నీవు. నీమానసము నిష్కల్మషము. శాంత్యానందములు నీపాలికాఁపులు. నీవు నాయందు దయయుంచి సర్వతీర్థరహస్యములను దేటతెల్ల మొనరింపవే" యని ప్రార్థించెను. అంగిరసుఁ డానందియై యాతనితో "గౌతమా! నీ వడిగినవిషయము మహోన్నత మైనది. శ్రద్ధాభక్తులతో దీనిని విన్నవారిమర్త్యత్వముఁ గిన్నవారే. కావున, వినుము:

'చంద్రభాగ' యనుతీర్థమున వరుసగా నేఁడుదినములు స్నానము చేయువారు సర్వపాపములు పోఁగొట్టుకొని పరమపుణ్యు లగుదురు. అందలిజలములు తరంగపరంపరలచే నృత్యము సలుపుచుండును. నరుఁ డందు సుస్నాతుఁడై యుపవసించి యేఁడుదినము లాజలములఁ గ్రుంకు లిడినచో నాతనిసద్గతిని వర్ణింప శేషునికైన నలవి కాదు.

కాశ్మీరదేశమున నెన్నియో నదులు జనించి సింధునదిలోఁ గలియుచున్నవి. ఈతీర్థముల నోలలాడిననరులు సప్తర్షిసన్నిధానము కలిగి ఈలోకమున సమస్తైశ్వర్యములు గని తుదకు ముక్తి నందుదురు.

పుష్కరతీర్థమునను, ప్రభాసతీర్థమునను, నైమిషతీర్థమునను, దేవిక, ఇంద్రమార్గ, స్వర్ణబిందు అనుతీర్థములందును నోలలాడినవారు స్వర్లోకము నంది యప్సరోవనితలనృత్యగానముల నానందింతురు.

'హిరణ్యబిందు' వనుతీర్థమునఁ బ్రశాంతచిత్తముతో స్నానము చేసినను, దానిని బహుముఖములఁ గొనియాడినను, 'కుశేశయ' 'దేవాంతము' లనుతీర్థముల నోలలాడినను మానవుఁడు సమస్తపాపరాసులను క్షాళన మొనర్చుకొనఁగల్గును.

గంధమాదనపర్వతప్రాంతమునఁ గల 'ఇంద్రతోయ' మనుతీర్థమున మునక లిడినచో ముక్తి కలుగును. మఱియుఁ గురంగదేశమునఁ గల 'కరతోయ' తీర్థమున స్నానము చేసిన నరుఁడు మూఁడుదినము లుపవసించి మఱల స్నానము చేసినచో అశ్వమేధయాగఫలము నందఁ గాంచును.

గంగాద్వారమునను, నీలభూధరణమునను, కుశావర్తమునను, కనఖలమునను, బిల్వకతీర్థమునను స్నాన మాచరించిన నరుఁడు పాపదూరుఁడై పుణ్యగతి నందును.

బ్రహ్మచర్యవ్రతపాలనము, ఇంద్రియనిగ్రహము, క్రోధవిజయము, సత్యదీక్ష కలిగినమానవుఁడు 'అపాంహ్రదము'నఁ గ్రుంకు లిడుచో నశ్వమేధయాగఫల మందఁగనును. గంగానదియుత్తరమున శివప్రస్థానమునుండి చనుచోట స్నానము చేసినవారమృతాశను లగుదురు. మఱియు 'మహాశ్రమ' మనుతీర్థముల కడ నరుఁ డాహారము మాని యొకనెల యున్నచో సకలసిద్ధులు గాంచును. 'భృగుతుంగ' మనుమహాహ్రదముదగ్గఱ మూఁడు దినము లుపవసించిన బ్రహ్మహత్యాదోషము తొలఁగును. 'కన్యాకూప' మనుతీర్థమున నగ్నిహోత్రముతోఁ గూడ నున్నవాఁడు, భూలోకమునను, స్వర్లోకమునను గూడఁ గీర్తి గాంచును.

'సుందరికాహ్రద' మనుతీర్థమున స్నానము చేసినచో నరుఁడు సుందరుఁడై జన్మించును. 'వైమానిక' మనుతీర్థమున మునిఁగిన స్వర్గము లభించును. 'విపాశ' తీర్థమున మునక లాడినవారికి సమస్త పాపములును బోవును. మూఁడుదినములు 'కాళికాశ్రమము'న బ్రహ్మచర్యదీక్షతో నున్న నరుఁడు జన్మరాహిత్యమును గాంచును. 'కృత్తికాశ్రమమున' స్నానము చేసి పితృతర్పణ మిచ్చిననరుఁడు శివలోక మందు నని మునీశ్వరులు తెలిపిరి. 'ద్రోణశర్మపదము', 'శరస్తంబము', 'దేవదారువనము' అను తీర్థములు తమ్ము సేవించినవారికి స్వర్గసుఖము లొసఁగును. 'చిత్రకూటము', 'జనస్థానము' సనుతీర్థసేవవలన రాజ్యలక్ష్మి లభించును. 'శ్యామాశ్రమ' మనుతీర్థమున శుచియై పక్షముదినము లుపవసించిననరుఁడు ధ్యానయోగఫలమును గాంచును. 'కౌశికవాల' మనుతీర్థమున నుపవాసము చేసి మౌనముతో నిరువది యొక్కదినము లున్ననరుఁడు పరమగతి నందును. 'మతంగవాపిక' యనుతీర్థమున నొక్కనాఁడు నిలిచినవాఁడు సిద్ధుఁడగును. నెల యున్నచో 'నైమిశము' మహాయజ్ఞఫలము నిచ్చును. 'ఉత్పలావనమున' నున్నవాఁ డశ్వమేధఫలము, నైశ్వర్యము గడించును.

గంగాయమునాసంగమమున నరుఁడు స్నానము చేసి కాలాంజన మనుశైలమున నియతితో నిలచినచో ముక్తి గాంచును. "వైవస్వతి" యనుతీర్థమును సేవించినచో మానవుఁడు తీర్థభూతత్వముఁ గాంచును.

మఱియు, ప్రయాగ కెన్నియో తీర్థములు వచ్చి చేరుచుండును. అందు నెలదినము లున్న నరుఁడు ముక్తిలక్ష్మిని సునాయాసముగా సంపాదింపఁగలఁడు.

అష్టావక్రము, కలవింకము, దేవహ్రదము, మున్నగు తీర్థములసంసేవ నరునకు బ్రహ్మభావనము నొసంగును. ఊర్వశీకృత్తికాయోగసిద్ధకీర్తి యైన "లౌహిత్య" మనుతీర్థమును సేవించి మానవుఁడు పుండరీక మనుయాగమును జేసినఫలము నందును. "రామహ్రదమునఁ బండ్రెండుదినములు నిరాహారియై యున్న నరుఁడు సకలపాపములను బోఁగొట్టుకొనును. "మహాహ్రద" మనుతీర్థమున నెలదినము లుపవసించినవాఁడు జమదగ్ని మహర్షి కన్న పుణ్యలోకమును గాంచును.

వింధ్యమున నెలదినము లేకాగ్రతతోఁ దపముచేసిన మహాత్ముఁడు ధర్మజ్ఞుఁడై విలసిల్లును. "నర్మద"లో స్నానము చేసి చక్రవర్తిత్వమును, "జంబూనది" మార్గమున సంయతచిత్తముతో మూఁడుమాసములయొక్క దిన ముండి సర్వసిద్ధులను మానవుఁడు పొందఁగనును.

"కోకాముఖ" మనుతీర్థమున మునిఁగి "తండులికాశ్రమమున" కేగి యట వల్కలములు ధరించి శాకాహారియై ప్రశాంతమనస్కుఁడై యున్న నరుఁ డట నున్న దశకన్యకామణుల కధిపతియై యజరామరత్వము నందును.

"కుల్య" యనుతీర్థమున మూఁడురాత్రు లుపవసించి శౌచియై యఘమర్షణజపము చేసినమానవుఁడు మహాశ్వమేధ

యాగఫలము నందును. "అరిష్టసేనాశ్రమమున" నున్న మనుజుఁడు సర్వపాపములను బోఁగొట్టుకొనును. "పిండారకమున నొకరాత్రి నిలిచిననరుఁ డగ్నిష్టోమయాగఫలముఁ గాంచును. "ధర్మారణ్యము"నఁ గల "బ్రహ్మసరస్సు"న నోలలాడినవాఁడు పౌండరీక మహాయజ్ఞఫలమును గడించును. పార్వతికిఁ దండ్రియుఁ బరమేశ్వరునకు మామయు, సర్వరత్ననికరవిశ్వపుణ్యస్థానము నైన హిమాలయపర్వతమున శాంతచిత్తుఁడై మునిసేవ తపము చేయఁగలిగిన నరుఁడు సిద్ధపురుషుఁడై బ్రహ్మలోకమును గాంచి చెలువొందును.

ఓ గౌతమా! కామక్రోధలోభమోహమదమాత్సర్యములను విడిచిననిర్మలచిత్తముతోఁ జేసినతీర్థసేవయే పురుషునకు ఫలసిద్ధి నొసంగును. కాని, యొండువిధమున నేప్రయోజనమును గలుగదు. పుణ్యతీర్థసంసేవవలన నరునకు దమము, తపము, అహింస, శమము, శౌచాతిశయము నలవడును గాని వ్యర్థజలములవలన శుచిత్వము కలుగదు.

కాని, గౌతమా! ఒక్క రహస్యము కలదు. అలభ్యపదార్థములయం దావంతయును గోరిక లేక, లభించినపదార్థములు స్వల్పము లైనను వానియెడ నసంతృప్తి కాని మమత్వము కాని లేక నిస్పృహు లగునీవంటివారు నిత్యశుచులు. వారికి నేఁ జెప్పినతీర్థసేవలతోఁ బనియే లేదు. మఱియు నింకొక రహస్యము చెప్పుచున్నాను. వినుము, దుర్గమములు అతివిషమ

ములు నగుతీర్థములను బోయి సేవింప లేకున్నను వాని నధికభక్తి యుక్తులతో నాత్మఁ దలంచినఁ జాలును. మానవునకుఁ గలసర్వ పాపములు నశించిపోవును.

సర్వతీర్థమహిమాశంసన మను ఈవాక్యరత్నములు మహా పవిత్రములు, అనుపములు, మాననీయములు, స్వర్గదములు, పరమరహస్యములు. శ్రద్ధాభక్తివిధేయుఁ డగుశిష్యునకు, నిజ సుతునకు, ఆప్తమిత్రునకు, ఉత్తములకు దయతో నీవిషయములు తెలుపఁదగినవి. ఈతీర్థయాత్రాకథనము నిర్మలచిత్తముతో బఠించినను, శ్రద్ధతో విన్నను నరునకు జాతిస్మరణము తోడిజన్మమును, అతిపుణ్యపురుషసంతతియును గలుగును.”ఁ

ఈమాటలు గౌతము నానందవార్ధిని ముంపఁగా నాతఁ డంగిరసు నెంతయు స్తుతించి నిజాశ్రమమున కేఁగెను. అంగిర సుఁడు బోధించినయీతీర్థసేవాప్రసంగమే మహాపుణ్యప్రదమై విలసిల్లెను.

అంగిరసుఁ డగ్నిని ఋషిపత్నులను శపించుట.

తొల్లి యొకప్పుడు స్తవనీయరూపసౌందర్యయుతలు, భువనమోహినులు, మంగళగుణాఢ్యలు, శృంగారవతులు, నవ యౌవనాంగలు నగుసప్తర్షిపత్నులు వహ్నిమందిరమున వర్తిల్లుచుండిరి. అపు డగ్ని వారలఁ గనుంగొని కామమోహితుఁడై రతికాంక్ష కలుగ వారియంగములు ముట్టి భయపడి వారిసౌందర్యమున కచ్చెరు వందుచు వారిని గాంచుచుండెను. ఆయతివలు పతిపదసరోజసమర్పితస్వాంత లగుటచే అగ్నిసంపర్కము నెఱుంగఁ జాలరైరి. కాని, పరస్త్రీవాంఛాకల్మషుఁ డగుఅగ్నియంతరంగము

నాతనికాంతివిహీనతచే వెంటనే కనిపెట్టఁగలిగిన యంగిరసుఁడు కోపించి సర్వభక్షకుఁడవు కమ్మని యగ్నిని శపించెను. అగ్ని సచేతనుఁడై భయముచేతను లజ్జచేతను భక్తిచేతను అంగిరసుని స్తుతించి యథాపూర్వము వెలుఁగుచుండెను.

కాముకుఁ డగుపరపురుషునిస్పర్శవలన నపవిత్ర లైన ఋషిపత్నులఁ గనుంగొని యంగిరసుఁడు "ఓ కాంతలారా! మీదోషము లేకపోయినను, కాముకుఁ డగుఅగ్నిస్పర్శవలన మీకును బరపురుషస్పర్శదోషము కలిగినది. ఆదోషమునకు మీరు ఫల మందనినాఁడు మీసంపర్కమున మాకు మహాదోషము కలుగును కావున,మీరు విప్రకులమున సుందరులై జన్మించి విప్రులభార్యలు కండు" డని శపించెను.

అంత ఋషికాంతలు సంతాపస్వాంతలై రోదనము చేయుచు "మునికులతిలకా! మేమెన్నఁడును బరపురుషస్పర్శ మెఱుంగనివారము. పాప మెఱుంగనిపరమసతులము. అనఘమతులు, బ్రహ్మనిష్ఠులు, భూరితపఃప్రభావయుతులు, మహనీయ చరితులు నగుమాపతులను విడిచి భూలోకమున కేఁగి యెట్లు జన్మముఁ గాంచి మనఁగలము?" అని పలికిరి. అంగిరసుఁ డాప లుకు లాదరించి దయార్ద్రుఁడై వారిముఖపద్మములఁ గాంచి తాను సర్వజ్ఞుఁడు వేదవేదాంగపారగుఁడు జ్ఞానయోగసంపన్నుఁ డయ్యు శోకపరవశత మూర్ఛిలి కొంతవడికిఁ దెలివంది సోదరఋషులతో నాలోచించి యాపడఁతుల కిట్లనియెను.

"కాంతలారా! పుడమిలో నిజకర్మభోగులభోగము ఆకర్మాంత మని శ్రుతులు పలుకును. మాతోడిభోగము మీకు

గతమయ్యెను. గతభోగము మరలఁ గలుగఁబోదు. ఎవరికైనను శుభాశుభకర్మఫలము కుడువకపోరాదు. మీకు నా శాపము శుభప్రతిపాదకమే కాఁగలదు. మీరు భూలోకమున కరిగి విప్రభార్యలై వెలయుచు రాధారమణుని గాంచి గోలోకమునకుఁ బోఁగలరు. ఆపై శ్రీకృష్ణయోగమాయానిర్మితము లైనమీ ఛాయలు మూర్తిమంతములై విప్రమందిరములకుఁ జని యచటఁ గొన్నిదినము లుండి మామాగృహములకుఁ జనుదెంచును. మీరు నిజాంశములచే మరల మాకుఁ బత్నులగుదురు" అని పలికెను.

ఆప్రకారము మునిపత్నులు భూతలమునఁ బుట్టి విప్రభార్యలై భక్తిచే శ్రీహరికి భోజనమిడి యత్యుత్తమ మైనహరి మందిరమునకుఁ జనిరి. వారిసిరి పూర్వమున కంటె నధికతర మయ్యెను. నీచలబ్ధసంపత్తికంటె ఘనలబ్ధవిపత్తి చాల మేలుకదా! నిజముగా సత్పురుషులకోపము మిక్కిలియుపకారమే యగును. పతిపరిత్యాగ మనువిపత్తు ఋషిపత్నులకుఁ గలిగినను మోక్షసంపద కలిగినకారణమున నాఋషిపత్నులచరిత్రము మహిమాస్పద మయ్యెను. ఆత్మపత్నులమెడ నల్పాల్పదోషమైనను మహర్షులు క్షమించి మనువరుకదా!

### అంగిరసుని బ్రహ్మవిద్యాబోధ

తొల్లి యొకప్పుడు శౌనకమహర్షి అంగిరసునికడ కరుదెంచి తనకు బ్రహ్మజ్ఞానము నుపదేశింపు మని శ్రద్ధాభయభక్తులతోఁ బ్రార్థించెను. అపు డంగిరసుఁడు శ్రద్ధ లేనివారికి బ్రహ్మ

విద్య బోధించు టెంతదోషమో శ్రద్ధగలవారికి అడిగినప్పుడైనను బోధింపకుండుట అంతదోష మని యిట్లు బోధించెను:

"పరవిద్య యనియు, అపరవిద్య యనియు విద్య రెండు విధములు. ఋగ్యజుస్సామాథర్వవేదములు, శిక్ష, వ్యాకరణము, కల్పము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు అనువేదాంగములు— ఇవన్నియు అపరవిద్యలోఁ జేరును. అక్షరస్వరూపుఁ డైన పరమాత్మను గూర్చినజ్ఞానమే పరవిద్య. పరమాత్మ కంటికిఁ గానరానివాఁడు, ఇంద్రియములచే గ్రహింప ననువు కానివాఁడు, నిత్యుఁడు, సర్వవ్యాపకుఁడు, సర్వాంతర్యామి, అతీంద్రియుఁడు, నాశనరహితుఁడు. ఈపరమాత్మవలననే చైతన్యజడవిశిష్ట మైన ప్రపంచము సృజింపఁబడినది. అతనియాజ్ఞచే బ్రహ్మ తపస్సంపన్నుఁడై అన్నమును సృజించెను; అందుండి ప్రాణములను సృజించెను.

ముక్తి నందుటకుఁ గర్మమార్గము, జ్ఞానమార్గము, నని రెండుమార్గములు కలవు. కర్మమార్గము త్రేతాయుగమున నెక్కువ ఫలప్రదముగా నుండెను. బహునియమనిష్ఠాపరులై యీశ్వరార్పణబుద్ధితో నిష్కామముగ సద్రూపపరమాత్మజ్ఞానమునకై కర్మము లాచరించి చిత్తశుద్ధివలన మోక్షమునార్జించినవారిమార్గ మిది. యజ్ఞమూలమున జరుపురోడాశాదిద్రవ్యములను శ్రద్ధాభక్తులతో మంత్రపూతముగ నగ్నియందు హోమము చేయుట, అమావాస్య పౌర్ణములయందు ఇష్టులు చేయుట, చాతుర్మాస్యవ్రతములు చేయుట, నూతనముగా ధాన్యము వచ్చినపుడు 'ఆగ్రాయణము' చేయుట, అతిథ్యభ్యాగతపూజ చేయుట.

వైశ్వదేవాదుల నొనరించుట, సకాలమున కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి యను సప్తజిహ్వాలు గలయగ్నిని ఉపాసించుచుండుట—ఇవి కర్మమార్గ క్రియలు. దీనివలన నింద్రలోకము బ్రహ్మలోకము సంప్రాప్తము లయి నరునకు ముక్తి కలుగును.

శ్రద్ధాభక్తియుతముగా మహాతపస్సు చేయుచు, విరక్తులై అమనస్క-యోగము, అస్పర్శయోగముల నభ్యసించుచు, శమదమాదిషట్క-సంపత్తి కలిగి, గురుసేవామూలమున జ్ఞాన మార్జించి సూర్యద్వారమున బ్రహ్మలోకము నట సమ్యగ్దర్శనమున మోక్షము నందుట జ్ఞానమార్గము.

పాంచభౌతికప్రపంచ మంతయు పరమాత్మచేతనే సృజింపఁబడి ఆయనయందే లయ మగును. ఆపరమాత్మ ప్రకాశము రూపుదాల్చినవాఁడు, అంతట వ్యాపించినవాఁడు, సమస్తజీవరాసులందు, బయటలోపల నుండువాఁడు, జన్మజరాదిషడ్భావవికారములు లేనివాఁడు, క్షరాక్షరముల కతీతుఁడు*, స్థూలసూక్ష్మకారణశరీరరహితుఁడైనయుత్తముఁడు.

ఈపరమాత్మునినుండియే ప్రాణము, మనస్సు, ఇంద్రియములు, పంచభూతములు జనించుచున్నవి. అగ్ని యాతనిశిరస్సు. సూర్యచంద్రు లీతనినేత్రములు. దిశలే చెవులు. వాగ్వ్యాపారమే

* కదలుచున్న జలములో కదలుచున్నట్లు కనఁబడుచంద్రుఁడు క్షరుఁడనఁబడును. స్తిమితమైననీటిలో నిశ్చలముగా నున్నచంద్రుఁడు అక్షరుఁడనఁబడును.

వేదము. వాయువు ప్రాణము. ప్రపంచము హృదయము. పృథివి పాదములు. అనఁగా నీతఁడు సర్వవ్యాపి. ఇతని నెఱుఁగువారే ముక్తులు.

ఈపరమాత్మజ్ఞానము నందుటకై ఉపనిషత్తులను ధనుస్సుగాఁ జేసి, అంతఃకరణవృత్తిని బాణముగాఁ జేసి, ఉపాసన యనుపదును పెట్టి, పరమాత్మయందే కాగ్రత కలమనస్సును బ్రహ్మముగా భావించి దాని నేయవలయును. అపుడు పరమాత్మయొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అదియే మోక్షము.

దీనివలన సమస్తసంశయములు నశించును. అవ్యయానందము కలుగును. అజ్ఞానము దూర పడఁగును. ప్రారబ్ధము, ఆగామి, సంచితము అనురూపములు గలకర్మము లన్నియు ఈ జ్ఞానమువలన నశించును.

శరీర మనునది వృక్షము. దీనిపై రెండుపక్షులు గలవు. అవి జీవేశ్వరులు. జీవుఁడు వేఱు శరీరము వేఱు అనునట్లు కనఁబడును గాని యది సత్యము కాదు. కదలుచున్ననీటిలోఁ గదలుచున్నట్లు కనఁబడినను, కదలనినీటిలో నిశ్చలముగాఁ గనఁబడినను, ఆకాశమునందలిచంద్రుఁ డొక్కఁడే యైనట్లు, ఉపాధిదోషముచేఁ బరమాత్మ జీవేశ్వరభేదమునఁ దోఁచినను నిజమున కొక్కఁడే.

పరమాత్మ యాకాశముకంటె నధికపరిమాణము కలవాఁడై, ప్రకాశస్వరూపుఁడై, అవాఙ్మానసగోచరుఁడై అజ్ఞానుల కతిదూరుఁడు జ్ఞానుల కతిసన్నిహితుఁడు నగుచున్నాఁడు. హృదయాకాశ మాతని కుపలబ్ధిస్థానము.

ఈశరీర మందలిహృదయాకాశ ముపలబ్ధిస్థానముగాఁ గల పరమాత్మ నెఱింగినవారు జన్మరాహిత్యము నందుదురు. ఈ యెఱుక కోరికలు గలవారికి లభింపదు. నిత్యతృప్తుఁ డగువానికే అపరోక్షజ్ఞానము కలుగును. అతఁడు శుద్ధసత్త్వసంపన్నుఁడై దేహపతనకాలమందు సూర్యమండలముఁ జేరి యటనుండి బ్రహ్మలోకముఁ జేరి పునరావృత్తిరహిత మగు కైవల్యము నందును."

ఇట్లు బోధింప శౌనకుఁ డానందభరితహృదయుఁడై యంగిరసు నెంతయుఁ గొనియాడి యాతనికడ సెలవు గైకొని నిజాశ్రమమున కరిగెను. అంగిరసుఁ డిట్లు శౌనకునకు బోధించినవిషయములే ముండకోపనిషత్తునఁ బ్రతిపాదితము లయియున్నవి.

అంగిరస్స్మృతి.

అంగిరసుఁడు మహాతపశ్శాలి, మహాభక్తుఁడు, మహావిజ్ఞాని, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడుగనే కాక మహాధర్మప్రవక్తగఁ గూడఁ బ్రఖ్యాతి గాంచెను. అతఁడు బోధించినధర్మశాస్త్రరహస్యములే "అంగిరస్స్మృతి" యనుపేర విలసిల్లినవి. నేఁ డాస్మృతి పూర్తిగా లభ్యము కాలేదు. కాని, విశ్వరూపుఁడు మున్నగుధర్మశాస్త్రవ్యాఖ్యాతలు దీనినుండి పెక్కుదాహరణము లిచ్చియుండుటచే అంగిరస్స్మృతియొక్కస్వరూపస్వభావములు మనకుఁ జాలవఱకుఁ దెలియుచున్నవి.

"ఉత్తము లగు నూటయిఱువదియొక్కమందిబ్రాహ్మణులు కూడినసభయే పరిషత్తు. మానవుఁడు శాస్త్రములు విధించినకర్మములు కాక యథేచ్ఛముగాఁ దనబుద్ధి ననుసరించి చేసిన

కర్మములు బాలుని క్రీడాకర్మలవలె నిరుపయోగములు.* బ్రాహ్మణుఁడై మహాదోషము లొనరించినవ్యక్తి క్షంతవ్యుఁడు కాఁడు. కాన, ఆదోషపరిహారమున కతికఠోర మైన 'వజ్రవ్రతము' నాతఁ డనుష్ఠింపవలయును. పశుపక్షిసంతతిలో వేనిని జంపినను ప్రాయశ్చిత్తము చేసికొనవలయును. పతితో సహగమనము చేసినసతి చిరకాలము భర్తతోఁ గూడి స్వర్గసుఖ మనుభవింపఁగలదు.‡ కాని, బ్రాహ్మణస్త్రీ సహగమనము చేయరాదు. మనుధర్మశాస్త్రమే సర్వోత్తమ మైనది. అంతకుఁ బూర్వపుధర్మశాస్త్రములనుత్తమములు. దీని నతిక్రమించినవచనము లాత్మహితములు కావు.§ ఇట్టి వనేకము లగువాక్యార్థములు 'అంగిరస్స్మృతి'లోని వని పలుతావుల నుదాహరింపఁబడి యున్నవి. 'బృహదంగిరస్స్మృతి' 'మధ్యమాంగిరస్స్మృతి' 'అంగిరస్స్మృతి' యనిమూఁడు విధముల నీస్మృతి వ్యవహారమునఁ గలదు. మొదటిదానికి రెండు మూళ్ళు సంక్షేపగ్రంథములుగాఁ దోఁచుచున్నవి.

అంగిరసుఁ డిట్లు ధర్మశాస్త్రప్రవక్తగాఁ బేరందెను. మహాతపోధనుఁడు, విజ్ఞాననిధి, జ్ఞానవిరాగఖని, గృహస్థరత్నము, ఋషిసత్తముఁడు నగు నంగిరోమహర్షి పుణ్యస్మరణము భారతీయుని భాగ్యవిశేష మనుటలో సందేహము లేదు.

---

* శ్లో. స్వాభిప్రాయకృతం కర్మ యత్తు ధర్మవివర్జితమ్
క్రీడాకర్మేవ బాలానాం తత్సర్వే నిష్ప్రయోజనమ్.

‡ శ్లో. తిస్రః కోట్యోర్ధకోటీచ యానిలోమానిమానుషే
తావత్కాలం వసే త్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి.

§ శ్లో. యత్పూర్వం మనునా ప్రోక్తం ధర్మశాస్త్ర మనుత్తమమ్
నహి తత్ప్రమతిక్రమ్య వచనం హిత మాత్మనః.

## అంగిరసుల మహాత్మ్యము

అంగిరోమహర్షిని వేదఋషులు మహామహుఁడుగ మహావైభవముగాఁ గీర్తించిరి. అంగిరసుఁడును, నతనిసంతతివారును ఆంగిరసు లనుపేరఁ బెక్కుసారులు ప్రబలగౌరవపురస్సరముగా వేదవాఙ్మయమునఁ బ్రశంసింపఁబడియున్నారు. వసిష్ఠుఁడు, భరద్వాజుఁడు, అత్రి, వామదేవుఁడు, విశ్వామిత్రుఁడు, గృత్సమదుఁడు మున్నగుమహర్షు లెల్లరు అంగిరసులను స్తుతించిరి. అంగిరసులు అథర్వవేదద్రష్టలు. యజ్ఞయాగాదిసమస్తకర్మలకు అంగిరసులవాక్యములే పరమప్రమాణములు.

ఋగ్వేదము అంగిరసు ననేకదేవతలతో నందు ముఖ్యముగా నింద్రాగ్నులతోఁ దుల్యునిగాఁ బేర్కొన్నది. కొన్నిచోట్ల అగ్ని యంగిరసుఁ డని, మఱికొన్నిచోట్ల అంగిరసుఁ డగ్ని యని కలదు.* దీనినిబట్టి అగ్నిదేవుని కంగిరసు లన్న మిక్కిలి గౌరవమనియు, నంగిరసుఁడే మొదట నగ్నిని ఆవాహనము చేసి మథించి గౌరవించినట్లును స్పష్టము. ఇందుచేతనే యజ్ఞయాగాదులలో అంగిరసులచేఁ బ్రోక్తమైనపద్ధతి నావాహనము చేసిననే అగ్ని తృప్తుఁ డగు నని ప్రతీతి.

పరాశరమహర్షి అంగిరసులు తనపితృదేవత లని పేర్కొనెను. అగ్ని, ఉషస్సు, సోముఁడు, సావిత్రి, మరుత్తులు, యముఁడు

---

* అగ్ని కొండొకకారణమున నరణ్యముల కేఁగి చెట్లనడుమ దాఁగుకొనె ననియు, నాతనిని అంగిరసుఁడే పట్టుకొని మథించి తీసుకొనివచ్చె ననియు, నందుచే నాతని నంగిరసుఁ డందు రని కలదు. (ఋగ్వే 5. 11-6.)

మున్నగువారెల్లరు అంగిరసుల స్తుతించిరి. ఆంగిరసులు దేవతలను స్తుతింపఁగా వారు సంతోషించి అంగిరసుల యజ్ఞావసరముల కొకకామధేనువు నిచ్చిరి. దానిని అంగిరసులకై అర్యముఁడు పిదికెను. (ఋగ్వేదము 1. 139_7.) ఇంద్రుఁ డంగిరసులు చేసినస్తుతికి, వారు తనకుఁ జేసినసాయమునకు వారికె ఋణపడియుండెను. వారిస్నేహము నాతఁడు కోరెను.

అంగిరసులు మొదట నగ్ని నారాధించినవారు. వారు పుణ్యమూర్తులు. వారి గొప్పతనమును మహాతపస్సుచే వృద్ధి చేసికొనిరి. వారి తపశ్శక్తివలన ననేకము లగుగోవులను వారు సృష్టించిరి. (10. 169_2.)

ఆంగిరసులు పూజనీయులైనపితృదేవు లనియు, వారు న్యాయపథవర్తు లనియు, మహాఋషు లనియు, యజ్ఞయాగాది కర్మకాండను సృష్టించినమహనీయు లనియు, అయాస్యాంగిరసుఁడు పేర్కొనెను. (ఋగ్వే. 10. 67_2.) బృహస్పతి, అయాస్యుఁడు, ఘోరాంగిరసుఁడు, కుత్సాంగిరసుఁడు, విరూపాంగిరసుఁడు మున్నగుమహనీయు లంగిరసులలో శ్రేష్ఠులు.

యజుర్వేదసామవేదములలోఁ గూడ ఆంగిరసులప్రస్తావన, ప్రశంస, పలుతావులఁ గలదు. ఆంగిరసులే యజ్ఞకర్మవిధాయకు లనియు, వారివచనములే తరువాతివారి కెల్లరకు నాదర్శప్రాయములు ననుసరణీయములు ననియు, తైత్తిరీయసంహితయందుఁ గలదు. ఇంతే కాదు. ఆతరువాతివారు "అంగిరసులు తమ యజ్ఞములలో నిట్లు చేసినారు. కావున, మనము నిట్లు చేయ

వలయును, అంగిరసు లిట్లు చేయలేదు కావున మనము నిట్లు చేయరా" దను భావముతో అంగిరసులను వరవడులుగా నుంచుకొనువారు.

అంగిరసు లాదిత్యునితోఁ గూడి దర్శపూర్ణమాసయజ్ఞమును జేసి స్వర్గము నందిరి. మఱియు వారు సత్రయాగము, అహీనయాగము, దశరాత్రయాగము చేసి స్వర్గమున కేఁగి వారి యజ్ఞ ఫలమును భూలోకవాసు లగుఋషులకు ధారవోసిరి.* నాఁటినుండి స్వర్గకాము లెల్లరు నాంగిరసులవరవడినే యజ్ఞయాగములు చేసి స్వర్గమును జూఱగొనిరి.‡

అథర్వవేదములో అంగిరసులు.

అంగిరసు లథర్వవేదములో దైవములుగను, పితృదేవతలుగను, మహర్షులుగను మూఁడువిధములుఁ బేర్కొనఁబడిరి. ఆదిత్యులతోపాటు అంగిరసులకును మధుఘృతము లెల్లరు నర్పించెడివారు.♦ వసురుద్రాదులతో సమానముగా వీరిని బేర్కొనుచు, వీరిని స్వర్గలోకదేవత లనియు, కష్టపరంపరలను నిర్మూలము చేయుశక్తియుక్తు లనియు ఋషులు కీర్తించువారు.

సోమమును స్వీకరించుట కర్హులైనపితృదేవతలుగా వీరిందుఁ బరిగణింపఁబడిరి. దుర్మార్గులను శాపమూలమున నాశనముచేయుటకై వీరిని ప్రార్థించెడివారు. (ii. 12-5). ఆదిత్య వసువులతోడను, ఇష్టాపూర్తముమూలమునను, అంగిరసులు తమయాశ్రితులకష్టపరంపరలను బాఱద్రోలువారు. (ii. 12-4).

---

*( తైత్తిరీయసంహిత V 4.2_3) ‡ (V 7. 2_2) ♦ అథర్వవేదము (xii. 3_4)

వారు స్వర్గలోకప్రభువులై పితృపాదులతోఁ గలిసి తమ కిష్టులగుమానవులు చనిపోయినపుడు వచ్చి వారిని దమమార్గమున స్వర్గమునకుఁ దీసికొనిపోవుదురు.*

మహర్షులుగా నంగిరసులు యజ్ఞకర్మవిధాతలుగను, మంత్రతంత్రప్రవీణులుగను, తాంత్రికయజ్ఞనిర్వాహకులుగ నిందు స్తుతింపఁబడియున్నారు. అంగిరసులు భవరోగవైద్యులే కాక సర్వరోగనివారకులుగఁ జేరొందిరి. వారు కనుఁగొన్న "కుష్ఠ" మనునోషధివలన నెట్టిరోగమైనఁ గుదిరిపోయెడిది.‡ అంగిరసులు ప్రయోగించినకృత్యలు శత్రునిర్మూలనము క్షణములోఁ జేసి వెడెడివి. ఈకృత్యలమూలముననే అంగిరసులు దస్యుల బలదుర్గములను భేదించి విజయము నందఁగనిరి.♦ అగ్నివైశ్వానరుఁడు వీరియెడ మిక్కిలి ప్రీతుఁడై వారివేదమంత్రములకు విశేషఫలశక్తు లనుగ్రహించువాఁడు.† వీ రన్న నెక్కువ మక్కువ కలిగి మిత్రావరుణు లెప్పుడును వీరిని గాపాడువారు.§ అంగిరసులకు ఆదిత్యులకు చాలస్నేహము. అథర్వవేదద్రష్ట లంగిరసులే యగుట నందుఁ బలుతావుల వారిప్రశంస కలదు.

### బ్రాహ్మణములలో నంగిరసులు

ఐతరేయబ్రాహ్మణమున నంగిరసులప్రశంస కలదు. అంగిరసుని జన్మవృత్తాంత మందుఁ గలదు. ఇంద్రునికిఁ బట్టాభిషేకమైనపుడు సర్వశక్తిసంపన్ను లగు అంగిరసులే మరుత్తులతోపాటు

* (అ వే. XIX. 1-10). ‡ (అథర్వవేదము XIX. 39-5). ♦ (10.6-2).
† (VI. 35-3). § (IV. 29-3.)

దివ్యసింహాసనమును బంపిరి.* వీరు దేవతాతుల్యులు. అంగిరసులయు ఆదిత్యులయు సంబంధ మీబ్రాహ్మణమునఁ గలదు. ఆదిత్యు లొకప్పుడు యజ్ఞము చేయుచుండఁగా వారిపక్షమున అంగిరసులు యజ్ఞకృత్యములు నిర్వర్తించిరి. అందుకు మెచ్చి ఆదిత్యు లంగిరసులకు భూమిని దానము చేసిరి. అంగిరసులు గ్రహించిరి. కాని, ఆభూమి తప్త మగుచుండుటచే వారు దానిని విడిచివేసిరి. అపుడు భూమిస్వరూపము వారు మార్చివేసిరి. తప్త మగుటయు నుడిగెను. నాఁటినుండి భూమి యిప్పు డున్నట్లుండుటకు అంగిరసులే కారకులు.‡ ఋగ్వేదమునఁ గొన్ని మంత్రములకు ద్రష్ట యైనశునశ్శేపుఁ డీబ్రాహ్మణమున అంగిరసుని వంశీయుఁడుగాఁ బేర్కొనఁబడెను.

తైత్తిరీయబ్రాహ్మణమున అంగిరసులనుగుఱించి యొక కథ కలదు. అంగిరసు లొకప్పుడు సత్రయాగము చేయుచుండిరి. వారి కొక తెల్లనియావు గలదు. దానిపాలు వా రాయాగమున నుపయోగింపఁదలఁచిరి. కాని, వానలు లేనికారణమున ఆయావు తినుటకు గడ్డి లేకపోయెను. వెంటనే అంగిరసులు 'కరీరి'యాగము నారంభించిరి. వెనువెంటనే దివ్యవర్షము కురిసి భూమిపై గడ్డి విస్తారము మొలచెను. కాని, వీరిపై నీర్ష్య వహించిపితృ లా గడ్డిని విషపూరితము గావించిరి. అది తెలిసికొని యాంగిరసులు పితృలఁ బిలిచి యట్లు చేయఁ గారణ మడిగిరి. "మీరు చేయు నగ్నికర్మములలో మాకును బాలుఁగొన నవకాశ మిండు. అంత

* (ఐతరేయబ్రాహ్మణము 8_12).) ‡ (తైత్తిరీయబ్రాహ్మణము II.-11.)

కన్న మా కేమియు వల" దనిరి. అది యాంగిరసు లాదరమున నంగీకరించి వారి కధ్వరకర్మములందు లేపమార్జనక్రియాకలాపముల నిర్వర్తింప ననుజ్ఞ యిచ్చి సంతోషపెట్టిరి. ఆపితృలును సంతోషించి గడ్డినుండి విషమును దీసి వైచిరి.* ఆగడ్డి తిని యావు పా లిచ్చెను. దానివలన యజ్ఞకర్మము నిర్విఘ్నసమాప్తిం గాంచెను.

అంగిరసులు సామమంత్రప్రవీణులు. వారు స్వర్గమున కేగునపుడు వారితోం గూడం గొందఱు రాక్షసులు పోంజూచిరి. కాని, అంగిరసులు హరివర్ణసామమంత్రములు చదువంగా నా రాక్షసులు పరాజయమంది పాఱిపోయిరి.‡ ఇట్లెన్నియో విశేషములు చెప్పుసామవేదము అంగిరసులగొప్పతనము నంగీకరించి వారి నాదర్శప్రాయులనుగాం జెప్పినది.

శతపథబ్రాహ్మణము అంగిరసులే ప్రథమమున అగ్నిని మథించి జ్వలింపంజేసి రని తెలుపుచున్నది. (1. 4. 1-25). అంగిరసులు మహామహు లని వారి నీబ్రాహ్మణ మెంతయు స్తుతించును. వారు యజ్ఞకర్మవిధాతలనియు, యజ్ఞకర్మములలో నూతనవిధానములను సృష్టించి రనియు నిందుం గలదు. అగ్నిష్టోమయాగమున యజ్ఞ మేఖల ధరించుటకుం గారణ మిం దొక కథ కలదు. అంగిరసు లొకయజ్ఞమున 'వ్రతాశను' లై (స్వల్పమాత్ర మగుక్షీరపానము తప్ప నిం కేమియుం దినంగూడ దను వ్రతము కలవారై) యున్నపుడు వారికి నీరసము వచ్చెను.

---

* తైత్తిరీయబ్రా. (II. 1. 1.) ‡ తాండ్యమహాబ్రాహ్మణము (II. 2.3.5.7)

వారు వ్రతభంగము కాకుండ బలమును సంపాదించుటకై మేఖల ధరించి బలవంతులై నిర్విఘ్నయాగసమాప్తిం గాంచిరి. మేఖల అంగిరసులకు బలకారణ మగుటచే నంతనుండి యెల్లరు యజ్ఞసమయములలో దానిని ధరింప మొదలిడిరి.*

ఈబ్రాహ్మణముననే అంగిరసులఁగూర్చి యింకొకచిత్రమైనకథ కలదు. బ్రహ్మసృష్టిలో మొట్టమొదటివారు అంగిరసులు. తరువాతివారు ఆదిత్యులు. మొట్టమొదట యజ్ఞము చేసినవారు అంగిరసులు. అంగిరసులు సోమయాగము చేయఁబూని అగ్ని పిలిచి ఆదిత్యులను దమపక్షమున నాహ్వానింపు మని కోరిరి. అదేసమయమున ఆదిత్యులుకూడ సోమయాగము చేయఁబూని అంగిరసులను ఆధ్వర్యులనుగాఁ బిలువు మని వారును అగ్నిని గోరిరి. అగ్ని వారియాహ్వాన మంగీకరించి అంగిరసులను వారియాగమున నధ్వర్యులుగా నుండుఁ డని కోరెను. అగ్నికోరికనుబట్టి అంగిరసు లంగీకరించి యట్లొనరించిరి. యాగమైన వెనుక వారికి దక్షిణగా ఆదిత్యులు 'వాగ్దేవత' నీయఁబోఁగా వా రామెను గ్రహింపక సూర్యుని బరిగ్రహించి తమయున్నతిని జాఁటిరి.

అశ్వమేధయాగమున అధర్వవేదమును అంగిరసులు పఠించెడివారు. అందుచే ఆవేదభాగమునకు అంగిరోవేద మని పేరు వచ్చెను. ఈబ్రాహ్మణమున భృగువంశము, అంగిరసునివంశము నొక్కటే యని చ్యవనుఁ డాంగిరసుఁ డని కలదు.

---

* శతపథ బ్రాహ్మణము. III. 2-1-10; III. 2-1-14.

గోపథబ్రాహ్మణమున వరుణదేవునివీర్యమున నంగిరసుఁడు జనించె నని కలదు. ఈయంగిరసునివలనఁ బదిమంది యంగిరసులు జనించి రనియు వీరే యంగిరోవేదమునకు ద్రష్ట లనియుఁ గలదు. (1. 1. 7-8). అంగిరోవేదమే ప్రపంచ మాక్రమించిన దనియు నందుచే నంగిరోవేదమును జదువువిద్యార్థి శిరము నెత్తియుంచుకొనవలె ననియుఁ బరిపాటి యయ్యెను. మహాతపోజాతమగు అంగిరోవేదమే అన్నివేదములలో నధిక మనియు నిదియే బ్రాహ్మణయాతువుల నశింపఁజేయు ననియు ఈబ్రాహ్మణము పేర్కొనెను. అథర్వవేదము జదివినవాఁ డన్నివేదములను జదివినవాఁడే. సోమయాగములు, పాకయాగములు, హావిర్యజ్ఞములు, తదితరవిధయజ్ఞము లన్నియు అంగిరసులచేఁ బ్రతిపాదితములైనవే. భృగువు, అథర్వణుఁడు, అంగిరుఁడు ఏకవంశీయులే. కాని, అంగిరసుఁడు పైయిరువురికంటెఁ బెద్దయగుటచే మిగిలినవారు అథర్వాంగిరసుఁడు, భృగ్వాంగిరసుఁ డను పేళ్లతో వ్యవహరింపబడిరి. వీరు ద్రష్టలైనవేద మగుటచేతనే భృగ్వాంగిరోవేద మని, అథర్వవేద మని, అంగిరోవేద మని ఈయొక్కవేదమే త్రివిధములఁ బిలువఁబడుచున్నది. కాని, అథర్వాంగిరులు భృగుమహర్షి నేత్రము లని (గో. బ్రా. 1. 2-22.) కలదు. అథర్వవేద మందలి శౌనకశాఖ, పిప్పలాదశాఖ అను రెండుశాఖలకుఁ గూడఁ దొలుత అంగిరోమహర్షి ద్రష్ట యనియుఁ దరువాత అథర్వుఁడు ద్రష్ట యనియుఁ జెప్పవచ్చును.

### ఉపనిషత్తులలో అంగిరసులు.

వేదవేదాంగవేదులు, బ్రహ్మవిద్యాబోధకులుగా ఆంగిరసులు ఉపనిషత్తులలో విఖ్యాతి గాంచియున్నారు. అంగిర

సుఁడు శౌనకునకు బోధించినబ్రహ్మవిద్యాదికము ముండకోపని షత్తునఁ గలదు. వేదపురుషునకు అథర్వవేదము పాదాదినాభి పర్యంత మగుప్రధానభాగ మని పేర్కొనఁబడినది. సామవేదోప నిషత్తులలో అంగిరసుఁడు ప్రాణవాయువును ఉద్గీథరూపమున నుపాసించె ననియు అందుచే అంగిరసుఁడే ఉద్గీథ యని పిలువఁ బడె నని కలదు. ఘోరాంగిరసుఁడు శ్రీకృష్ణునకు ఆత్మ యవినాశ మని తెలిపెను. బృహదారణ్యకోపనిషత్తునందుఁ దెలుపఁబడిన మధువిద్యాబోధకులలో గౌతముఁడు, అగ్నివేశ్యుఁడు, భరద్వాజుఁడు, అయాస్యుఁడు మున్నగుఆంగిరసులు కలరు. ప్రశ్నోపనిషత్తులో అంగిరసుఁడే ప్రాణముగా నిరూపింపఁబడెను. మఱియు, నిందు పిప్పలాదాంగిరసుఁడు బ్రహ్మవేత్తగాఁ బేర్కొనఁబడెను. పిప్పలాదాంగిరసునిమోక్షవిద్యామహోపదేశము గర్భోపనిషత్తునఁ గలదు. పరబ్రహ్మోపనిషత్తులో పిప్పలాదుఁడే యోగమును గూర్చి ఓంకారమును గూర్చి చెప్పియున్నాఁడు.

పురాణములలోఁ గలఅంగిరసునివృత్తాంతమును మనము తొలుతనే పరికించియున్నాము. కాలక్రమమున, మహారాజులకుఁ బురోహితులుగా బ్రహ్మవిద్యాబోధకులుగా ఆంగిరసులు విఖ్యాతి గడించిరి. కొందఱుక్షత్రియులు తమకుఁబుంబనామములుగా అంగిరసులను గైకొనిరి. * గౌతమబుద్ధుని తండ్రి యగుశుద్ధోదనుఁడు తనకొడుకునకు సిద్ధార్థుఁ డనియు అంగిరసుఁ డనియుఁ బేరిడి యుండె నని క్రిందఁబేర్కొన్నగ్రంథమునఁ గలదు. ఇట్లు అంగిర సులు జగదంతర్యాము లైరి.

---

* Life and legends of the Buddha by Thames, page 22-23.

# ఔర్వుఁడు

## జననము

భృగుమహర్షి పులోమ యనుభార్యయందు చ్యవనుని గాంచెను. చ్యవనమహర్షి సుకన్య యనుసాధ్వియందు దధీచి, ప్రమతి, అప్రవానుఁడు, అనుపుత్త్రులను గాంచెను. అప్రవానుఁడు ఋచి యనుకన్యకను భార్యగాఁ గైకొని గృహస్థధర్మమును నిర్వహించుచుండెను.

ఇట్లుండగ హైహయవంశీయుఁడును, కార్తవీర్యార్జునుని తండ్రియు, నగుకృతవీర్యుఁ డనుమహారాజు భార్గవవంశజు లగు మహాబ్రాహ్మణులను బిలిచి వారియాధ్వర్యవమున ననేకయజ్ఞము లొనరించి గురుదక్షిణగా వారికిఁ దనసర్వస్వమును ధారవోసి కాలక్రమమున స్వర్గమున కేఁగెను.

తరువాతఁ గృతవీర్యునిపుత్త్రులు తమతండ్రిని మోసగించి భార్గవవంశీయు లగుబ్రాహ్మణులు తమసర్వధనములు నపహరించి రని భార్గవుల నెల్లరను దూలనాడ మొదలిడిరి. అంతేకాక, తమకుఁ గోపమువచ్చినపుడెల్ల భృగువంశపుత్త్రులగృహములు చొచ్చి కొల్లగొట్టి వారిని బాధింపఁ దొడఁగిరి. అంతతో నూఱకుండక రాజధనాపహారు లని భృగువంశజులఁ బసిపిల్లలను సైతము రాజకుమారులు మూర్ఖులై వెదకి వెదకి చంపఁదొడంగిరి.

ఈసంగతి విని భృగువంశ్యు లగువిప్రస్త్రీలు తమపతు లిండ్ల లేనిసమయమున బిడ్డలనుగూడఁ జంపుటకు రాజాధములు

వచ్చుచున్నా రని తెలిసి భయసంజాతులై హిమవత్ప్రదేశమునకుఁ బాఱిపోఁజొచ్చిరి. వారిలో గర్భవతి యగుఋచికూడ నుండెను. పశుతుల్యు లగునారాజకుమారు లాస్త్రీలవెంట నంటిరి. దారిలో ఋచి ప్రసవవేదన మారంభము కాఁగా నిఁకఁ బరుగిడలేక యొకచోఁ గూరుచుండె. తనయూరువున గర్భమును ధరించి యుండెను.

రాక్షసు లనందగు నారాజకుమారు లామెగర్భమును భేదింప దగ్గఱఁ జేరిరి. ఆసమయమునఁ బ్రళయకాలసూర్యుని తేజమును మించినతేజముతో ఋచి కొకకుమారుఁ డుదయించెను. అతని యుదయముతో దిశ లెల్లఁ దేజోభరితములై యా మూర్ఖరాజశ్రేణికన్నుఁగవలు గప్పివేయ వారెల్ల రంధులై దారి తెన్ను గానక దీనులై యుండిరి. ఋచి యూరువు మఱుఁగునఁ బుట్టినబిడ్డఁ డగుటచే ఆబాలునికి ఔర్వుఁ డనునామము కలిగెను.

పశ్చాత్తాపమును నొంది తెలిఁగి యారాజకుమారులు తడ వ్రాలుచు ఋచిని సమీపించి “తల్లీ! పరమమూర్ఖుల మగు మాతప్పు సైరింపుము. మహాశక్తిసంపన్ను లగుభృగువంశవిప్రుల ఘనత యెఱుఁగనిమాతండ్రి తనసర్వస్వము వారికి ధారపోసి తాను బుణ్యగతు లందఁగనెను. భృగువంశవిప్రుల కలిగి వారియెడఁ గీడుచేసిన మే మిట్టిదుర్గతిఁ గాంచితిమి. అమ్మా! అధర్మవర్తుల కెప్పుడును దుర్గతులు ప్రాపించుననుట సత్యమే కదా! మాకు బుద్ధి వచ్చినది. ఇఁక, భృగువంశజు లగుమీబిడ్డలు సైతము మావంశజు లెల్లరికి నారాధనీయులే యగుదురు. కావున, దయదలఁచి యార్తు

లము నర్థులము నగుమాకు దృష్టిదానముఁ బ్రసాదింపుము. నిన్ను మాకన్నతల్లిగాఁ బూజింతుము. క్షమింపు" మని చెంపలు వేసి కొని దండప్రణామములతోఁ బ్రార్థించిరి.

అంత ఋచి "రాజకుమారులారా! మిమ్ము నిగ్రహించుటకుఁ గాని యనుగ్రహించుటకుఁ గాని నేను శక్తురాలను గాను. భార్గవవంశదీపకుఁ డగునీబాలుఁడే మీ కోరిక విధించియుండును. కావున మీ రాతనినే శరణుచొచ్చి ప్రార్థింపుఁ" డని పలికెను. వారు నంతటఁ "దల్లీ! ఇప్పుడు పుట్టినబాలున కంతశక్తి యెక్కడిది? ఇది యంతయు నీమహత్త్వమే యని మాకు స్పష్టముగఁ దోఁచుచున్నది. కావున, మాతప్పు సైరించి రక్షింపు" మని కోరిరి.

ఋచి వారితో "కుమారులారా! అట్లు కాదు. ఈతఁడు నూఱుసంవత్సరములు నాయూరుగర్భమున నుండి సకలవేదవేదాంగములు నేర్చినవాఁడు. మహాతపోనిధి. సర్వశక్తిసంపన్నుఁడు. కావున నాలసింపక యాతనినే వేఁడికొనుఁ" డని ఔర్వునితో "వత్సా! పశ్చాత్తప్తు లగునీరాజకుమారులు తమ్ము క్షమింప నిన్నుఁ గోరుకొనుచున్నారు. దుర్మార్గులను శిక్షించుటయుఁ బశ్చాత్తాపమొంది క్షమాభిక్షను గోరువా రెంతయధము లైనను క్షమించుటయు భృగుకులధర్మము. కావున వీరికి దృష్టిదానముఁ బ్రసాదింపు" మని పుత్త్రునితోఁ జెప్పెను. హైహయులు నాతని పాదములఁ దడవితడవి కనుల కద్దుకొని తమ్ము రక్షింపఁ గోరుకొనిరి. ఔర్వుఁ డప్పటికి శాంతచిత్తుఁడై మాతృవచనములను మన్నించి యారాజకుమారు లెల్లరికి దృష్టిదానము చేసెను. వా

రెల్ల రాతనికి మరలమరల నమస్కరించి యింక బుద్ధికలిగి యుండుమని యాతని సెలవుగైకొని తమతమగృహముల కరిగిరి.

### ఔర్వుని ప్రళయతపము.

ఔర్వుని దల్లి యాశ్రమమునకుఁ దీసికొనిపోయి యట నల్లారుముద్దుగాఁ బెంచుకొనుచుండెను. ఆతఁడు బాల్యముననే తనపితృబంధుజను లెందఱో దుష్టరాజులమూలమునఁ బరలోకగతు లైరన్న సంగతి విని దుఃఖించి సకలలోకప్రళయము సంకల్పించి మహాతపస్సు చేయఁదొడఁగెను.

తదేకనిష్ఠతో నిద్రాహారములు మాని పంచాగ్నిమధ్యమున నాతఁడు చేయుమహాతపస్సువలన ముల్లోకములు నల్లాడఁజొచ్చెను. చరాచరప్రపంచ మంతయుఁ జలించిపోఁదొడఁగెను. ప్రాణిసంతతులు భయవిహ్వలము లయ్యెను. ఇది పితృలోకనివాసు లైనయౌర్వుని పితృదేవతలు బంధుజనములు విని భూలోకమునకు విచ్చేసి మహాతేజశ్శాలియై వెలుఁగుచున్న ఔర్వుని సమీపించి శాంతచిత్తులై యాతనికిఁ దమ్మెఱుకపఱచుకొని యిట్లు పలికిరి. 'వత్సా! నీతపోబలమహత్త్వమున లోకములు భయవిహ్వలము లయ్యెను. నీవు కోపము విడువుము. మేము సమర్థులమై క్షత్రియులచే నిహతులము కాలేదు. మేము ధనలుబ్ధులమై వారిధనములు గ్రహించినవారము గాము. మాకు ధనమే వలసినచోఁ గుబేరుఁడే వచ్చి మాయడుగులకు మడుఁగులొత్తి యెంత ధనమైన నిచ్చిపోయెడివాఁడు. తపోమహత్త్వమున మాకపరిమితమగునాయుష్యము కలిగెను. కాన, మాకు మనుష్యలోకమున

నుండుట కష్టము లేదు. మరణించినపిదపఁ గాని స్వర్గమున కేఁగ నవకాశము లేదు. ఆత్మహత్య చేసికొంటిమా యది మహాదోషము. దానివలనఁ బుణ్యలోకప్రాప్తి లేదు. అందుచే హైహయవంశ క్షత్రియులతో వైరము కల్పించుకొని వారిమూలమున మరణించితిమి. అంతేకాని భార్గవుల తేజ మొరు లెన్నఁడును బరిహరింపఁజాలరు. కావున దానికై నీ విట్లు లోకోపద్రవము కలుగఁ జేయుట మా కిష్టము లేదు! నీవు శాంతచిత్తుఁడవై మాకోరికఁ దీర్పుము."

అపు డౌర్వుఁడు వారికి సాష్టాంగ మెరఁగి "మహాత్ములారా! మీ దర్శనమున నా జన్మము ధన్య మైనది. మీ చెప్పినది సమంజసమే కాని నా తపస్సునఁ ద్రిలోకపరాభవము కావింపఁగాఁ బ్రతిజ్ఞ పూనితిని. నా ప్రతిన యమోఘము. మఱియు, నా కోపము నుపసంహరించితినేని యది నా దేహమునే దహించివైచును. తగిన నిమిత్తమునఁ గలిగిన యలుకను విడచి శాంతుఁ డగు నాతనివలన ధర్మార్థకామములు సమరక్షితములు కావు. పాపు లగు క్షత్రియులు భార్గవుల హింస చేయుచుండ వారి యార్తనాదము మాతృగర్భస్థితుఁడ నగు నాకు వినిపించినప్పుడే నాకు వారిపైఁ గోపము కలిగెను. అది యిపు డసహ్యమై యీపనికి దింపినది. ఇంతకుఁ దెలిసి శక్తియుతుఁ డయి యొకరొకరికి హింస గావింపఁ జూచి యూరకున్నవాఁడు హింసాత్మకుఁ డేఁగుదుర్గతికిఁ బోవును. అందుచే నే నలిగితిని. కాని మీరు హితులరు. మీమాట కాదననోప. నాకును లోకములకు సర్వహితమగునట్లు మీరు చెప్పిన చొప్పున నొనరింతు" నని పలికెను.

అంత నా రానందించి "వత్సా! జలములలో సర్వలోకములు నుండును. కాన, నీకోపవహ్ని యందు విడిచి సత్యప్రతిజ్ఞుఁడ వగుము. అది జలధిజలముల దహించు" నని పలికిరి. ఔర్వుఁ డిట్లే యని తనకోపానలమును సముద్రమున విడువ నది యౌర్వానల మనుపేర నశ్వముఖమున నబ్ధిజలములు ద్రాగుచుండెను. పితృదేవతలు సంతసించి ఔర్వు నాశీర్వదించి వెడలిరి. ఇట్లు ఔర్వుఁడు ధర్మవేదుఁడు, పితృదేవతానిధేయుఁడు, మహాతపశ్శక్తిసంపన్నుఁడు, అతిలోకతేజస్వి, నిగ్రహానుగ్రహసమర్థుఁడు నని పేరుగాంచెను.

ఔర్వుని బ్రహ్మచర్యవ్రతము.

పిదప, ఔర్వుఁడు బ్రహ్మచర్యవ్రతపరిపాలనము నతినిష్ఠాగరిష్ఠుఁడై యొనరించుచు మహాతపోనిమగ్నుఁడై యుండెను. ఆతపమువలన మరల సకలలోకములు సంచలింపఁగా మహర్షులను బురస్కరించుకొని దేవతాధిపులు, హిరణ్యకశిపుని బురస్కరించుకొని రాక్షసాధిపులు ఔర్వమహర్షి కడకు విచ్చేసి యిట్లు పలికిరి. "ఓ ఋషివర్యా! నీ విచిత్రతపమున నితరదీక్షఁ బూని బ్రహ్మచర్యవ్రతుండవై యుండ నూర్ధ్వరేతోగతుండ వగుటవలన సంతతి విచ్ఛిన్నమై భార్గవకులము నశించును. కావున, నీవు ధర్మమూలమగు గృహస్థాశ్రమమును స్వీకరించి సుపుత్రులను గనుము. సిద్ధమును లెల్లరు పత్నీసమేతులై పుత్త్రిలను గాంచిరికదా! కావున నీవును మామాట విని వెంటనే వివాహమై సంతతిఁ గనుము." ఆమాటలు విని ఔర్వుఁడు మందహాసము చేసి;

"బ్రహ్మయోని సంజాతుండై బ్రహ్మవిద్య
నలవరించుచు బ్రహ్మంబు నాత్మఁ జూచు
బ్రాహ్మణుండను బ్రహ్మచారియై పరగవలదె?
బ్రహ్మమైపోఁ జాలునె యట్టిభవ్యుఁ గలఁడ?

(హరివంశము, పూర్వభాగము, ౮ ఆ. ౧౦౭.)

అదికాక, వేదాధ్యయనము, యజనము, పుత్త్రోత్పాదనము నీమూఁడును ఋణత్రయమును బాయుటకు గృహస్థునకు విధింపఁబడినవి. మేము వనస్థులము. నిరాహారులు, పవనజలాదిభోజులు, అశ్మకుట్టాకులు, దంతోలూఖలికులు, పంచతప్తులు నగుట వానప్రస్థధర్మము మేము బ్రహ్మచర్యమును మున్నిడుకొని బ్రహ్మగతిఁ బ్రాపింతుము. బ్రహ్మచర్యము లేనివాని కేదియు లభింపదు. అజితేంద్రియుఁ డగుదుశ్చరితుని యోగము దంభసంజ్ఞమే కాని సిద్ధికరము కాదు. మఱియు బ్రహ్మదేవుఁడు బ్రహ్మచారియై మానసపుత్త్రులను గాంచెను. బ్రహ్మచర్యము నే విడ నేరఁగాదు. నన్ను సంతతిఁ బడయుమని మీరన్నట్లే చేసెద" నని తపోబలమున నపాయ నిరూఢ మగుశరీరముతో నగ్నిహోత్రమునందుఁ దనతొడ యొకటి యిడి కుశకాండములతో మథించెను. అంత నాతనితొడనుండి యగ్నిహోత్రుండను తనయుండై జనించి ప్రజ్వరిల్లి యాకసముఁ బ్రాకుచు వినుమిక్కిలి పెరుఁగుచు నౌర్వునియెదుట నిలిచి;

"కడుఁ బెల్లగునాఁకలి నా
యొడలెరియింపఁగఁ దొడఁగె నొక్కట జగముల్

పాడిపాడిగా దరికొనియెద
నెడపక యించుక యనుజ్ఞ నిమ్ము మహాత్మా!"
(హరివంశము. ౪ఆ. ౧౦౪)

అని పలికెను. అంతలో బ్రహ్మ తత్క్షణ మటకుఁ బరుగున వచ్చి యౌర్వునిచే నభివాదనము లంది 'ఔర్వ్యఋషీ! నీపుత్త్రున కాహారము విహారస్థానము నే నొసంగెద. నీవు దయదలఁచి జగద్దాహము నారంభింపనీయ కీతని నాఁపుము" అని కోరెను. ఔర్వుఁ డంగీకరించెను. అంత బ్రహ్మ "ఈమహాగ్ని ప్రస్తుతము సముద్రమున నున్ననీకోపానల మగుచౌర్వాగ్నిఁ బేరుగాంచు. పిదప, ప్రళయసమయమున నారౌద్రతేజము దీనిఁ గూడి మహోద్ధతితో నిది సర్వలోకములను నీఱుచేయుఁగాక!" యని పలికెను. ఔర్వుఁ డజునిపైఁ గలయాదరమున నట్లే జరుగుఁగాక యని పలికెను. అంత నాయగ్నియుఁ దనతేజము లోకబాధకము కాకుండునట్లుపసంహరించుకొని సాగరమున కేఁగెను. బ్రహ్మాదు లౌర్వుని గీర్తించి తమతమ నెలవుల కరిగిరి.

### ఔర్వుఁడు హిరణ్యకశిపు ననుగ్రహించుట.

అపుడు హిరణ్యకశిపుఁ డాఁగిపోయి ఔర్వునికి సాష్టాంగ నమస్కారము లొనర్చి యతిభక్తివిధేయతలతో నౌర్వునిమనసున కెక్క నాతనిం గొనియాడి

"అజుఁడు చనుదెంచి ప్రార్థించునట్టితపము
లోకమున నెవ్వరికిఁ జెల్లు నీకె కాక!

ఏను భవదీయ శిష్యుఁడ నెడరు వొందు
నప్పటికి రక్ష యగువిద్య యానతిమ్ము"
(౪ ఆ. ౧౧౫.)

అని ప్రార్థించెను.

ఔర్వుఁడు సంతోషించి "రాక్షసేశ్వరా! నీవు సర్వభువనములను జయించినవాఁడవు. మిత్త్రుఁడవై నీవు నన్నాశ్రయించితివి. ఆశ్రితులు కోరినకోరిక లీఁజాలని యీ మునివాఁడు దుర్గతిఁ బొందును. అందుచే నాకుఁ బుత్త్రిరూపమున నిర్మితమైనయనింధనాగ్నిరూపయగువిద్య మాయ నీ కిచ్చితిని. చంద్రసప్తర్కచేఁ దక్కఁ దక్కిన దేనిచేతను దీనికిఁ దిరుగులేదు. నీవంశమున జన్మించినవారి కెల్లరకు శత్రువులచే నోడిపోయినప్పటికి నీవిద్యమాయ వశగతయై యుండును." అని కనికరమున వర మొసంగెను. హిరణ్యకశిపుఁడు కోరినకోరిక తీరినవాఁడై ఔర్వుని సంస్తుతించి నిజస్థానమున కరిగెను.

ఈమాయ పెంపుననే హిరణ్యకశిపుఁడు, మయుఁడు మున్నగువారు శత్రువులకు భయంకరమై వారిని దహించుప్రళయకాలాగ్నిజ్వాలలఁ బేర్చి యేర్చుచుండెడివారు.

ఔర్వుఁడు పుత్త్రిఁ గని వివాహము చేయుట.

ఔర్వుఁడు మఱియొకప్పుడు బ్రహ్మచర్యవ్రతమున నుండియే యొకపుత్త్రిఁ గన సంకల్పించెను. అతఁడు తపోబలమున నాతనిమోఁకాలినుండి యయోనిజ యగునొకకూఁతుం బుట్టించి యామెకు 'కందని' (కందళి) యనునామకరణము చేసి పెంచెను.

కాలక్రమమున నామె చక్కనిచుక్కయై తండ్రిహృదయమున కమితానంద మొసంగెను. కాని, యామె యెంతసౌందర్యవతియో యంత మితభాషిణి యయ్యెను. ఆమె యెంత సుగుణఖనియో యంత కలహప్రియ యయ్యెను. బ్రహ్మదేవుఁడు అమృతము నుంచినయబ్ధిగర్భముననే కాలకూటవిషము నుంచినాఁడు. విషజ్వాలలు గ్రక్కు పాముతలపై మణి నుంచినాఁడు. విధి విధానము లత్యాశ్చర్యకరములు.

కందని పెరిగి యౌవనవిలాసము లందినసమయమున నామె యత్రినేత్రసంభవుఁ డగుదుర్వాసోమహర్షి ప్రజ్ఞాప్రాభవముల విని యాతనినే పెండ్లాడఁ దలఁచి తండ్రికిఁ దనహృదయము నెఱిఁగించెను.

వయసు వచ్చినపడుచు సర్వలోకారాధ్యుఁ డగుమహర్షిని వలచియుండుట కానందించి యౌర్వుఁ డామెను దీసికొని దుర్వాసుని యాశ్రమమునకుఁ బోయి యాతని కామె నర్పించి రాఁ బయనమయ్యెను. బ్రహ్మతేజోవిరాజితుఁ డగుసౌర్వమహర్షియుఁ బలు గడిగినముత్తెమువలె బహుళసౌందర్యశోభిత యగుకందలియు నట్లు బయలుదేఱి పోవుచుండ దశదిశలు తేజోమయము లయ్యెను. వా రట్లు పోయి పోయి గంధమాదనపర్వతకంధరమును జేరునరి కచట వారికి దుర్వాసుఁ డెదురయ్యెను. దుర్వాసుఁడు బ్రహ్మనిష్ఠుఁ డగుసౌర్వమహర్షి కెదురేఁగి సముచితనమస్కారములతో నాతనిఁ బూజించెను. ఔర్వుఁ డాతని నాశీర్వదించి యిట్లు పలికెను. "మునివర్యా! కందని యనుసీమె

నాపుత్త్రిక. నీగుణగణముల నెల్ల విని యీయామె నిన్నే పరిణయమాడఁ గృతనిశ్చయయై యున్నది. ఈమె లోకాతీతసౌందర్యవతి, గుణవతి. కాని, ఈమెకోపినియై కలహముఁ గోరుచుఁ గటువచనములు పలుకును. ఐనను, ఏకదోషముచేత వివిధగుణవస్తువు విడువరాదు కదా! కావున, నీ వీమెను బరిగ్రహించి నన్ను ధన్యునొనర్పు" మని కోరుకొనెను.

అంత దుర్వాసుఁడు నవయౌవనాంగి, మహాసుందరి యగుకందనిం గని యామె తన్నే ఱెప్పవాల్పక కనుటయుం గని యాచార్యునితో నిట్లనెను. "మహాత్మా! స్త్రీ సందర్శనము రుద్రాదులకైనను ముక్తినిరోధకము, తపస్సాభంగకరము, మోహశోకనిధానము, పుణ్యనాశనము, రాగద్వేషమూలకము, జ్ఞానవిద్వేషకము ననుటలో సందియము లేదు. సంయమీశ్వరా! సంజ్ఞ, ఛాయ, భోగము, ఇంద్రియము, దేహము, విద్య, మతి, జగమున దేహికిఁ గల్గును. ఇందు సంజ్ఞయు, ఛాయయు, దేహపతనకాలమున దేహిని విడుచును. భోగ మనుభవించినంతనే పోవును. దేహేంద్రియములు జీవత్వవిముక్తితోఁ బోవును. విద్య, జ్ఞానోదయముతోఁ బోవు. కాని మతి జన్మజన్మమునందును గూడవచ్చును. స్త్రీనిగూడి దేహి యెంతకాలము వర్తించునో యంతకాలము దేహికి జన్మనాశనము లేదు. అంతకాలము శుభాశుభములు కలుగుచునే యుండును. కాని, నే నిపుడే త్రిలోత్తమా సాహసికుల రహఃక్రీడఁ గాంచి కామసంతప్తుఁడ నై యున్నాను. దానిఫలముగా విధాత యీనీకన్నియను సమకూ

ర్చెను. కావున, నే నీమె కటూక్తుల సహించి యీమెను బరిగ్రహించెదను.” అని తనయంగీకృతిఁ దెలిపెను.

ఔర్వుఁడు **దుర్వాసు**నివచనములకు సంతసించి తన కూఁతు నమ్మునిపతి కిచ్చి విధ్యుక్తప్రకారమున వివాహముఁ గావించి యాశీర్వచనమే యరణముగా నొసంగి తిరిగి తనయాశ్రమమునకు వెడలిపో నున్నతఱి విరహదుఃఖమున మూర్ఛిల్లిన నిజపుత్త్రి ననునయించి యిట్లు పలికెను. “తల్లీ! నిగమసూక్తము నీతిసారము నగునామాట వినుము. కులసతికి పతికంటె నెక్కుడు దైవము, బంధువు, గురువు లేఁడు. పతిసేవ చేయుపరమసాధ్వి పుణ్యముతో నేపుణ్యమును సాటిరాదు;

“పతిసేవకంటె ధర్మము
సతులకు శ్రుతులందు లేదు సతతము పతి శ్రీ
పతిగా మదిలోఁ దలఁచుచు
నతిభక్తి భజింపు తత్పదాంబుజయుగళిన్.

బ్రమసియైనఁ జాన పరిహాసముననైన
మంచియైనఁ గోపగించియైన
సరగ నెదుటనైనఁ జాటుమాటుననైన
వల్లభునిఁ గటూక్తి పలుకరాదు.

ఎన్నినోములు నోచిన నేమిఫలము
పతిని గోపించి పరుషోక్తిఁ బలికెనేని
దానిశతజన్మకృతసుకృతంబు తత్క్ష
ణంబ నశియించు నింత నిక్కంబు పుత్త్రి!”

(బ్రహ్మవైవర్త పురాణము)

ఇట్లు హితవచనము లనేకములు పలికి యౌర్వమహర్షి కూఁతు నల్లున కొప్పగించి నిజాశ్రమమునకు వెడలిపోయెను.

## ఔర్వుఁడు దుర్వాసుని శపించుట.

దుర్వాసుఁడు భార్యాసహితుఁడై యాశ్రమమున కరిగి శుభముహూర్తమున నేకాంతస్థలమున మృదుతల్పమున నయ్యంగనం గూడి కామినీరసం బెఱుంగనివాఁడయ్యుఁ దపోమహిమమునఁ గామశాస్త్రవిశారదుఁడై యిష్టోపభోగము లనుభవించుచు భార్యం దనుపుచుఁ దాను దనియుచు బహుకాలము గడపెను. ఆతరువాత, కందలి కోపస్వభావమును గటువాక్యములను బహుకాలము సైఁచియు నొక్కనాఁ డామెపైఁ గోపించి తీక్ష్ణముగాఁ జూచెను.

వెంటనే యాతనితపోగ్నిచేఁ గందలి భస్మమై పోయెను. ఈసంగతి విని యౌర్వుఁడు వచ్చి దుర్వాసుని నిందించి త్వరలో ఘోరపరాభవానలదందహ్యమాన మానసుఁడవు గమ్మని శపించి నిజాశ్రమమున కేఁగి విరాగసంపన్నుఁ డయ్యెను.

ఇట్లౌర్వమహర్షి నిగ్రహానుగ్రహసమర్థుఁడు, అస్ఖలితబ్రహ్మచర్యుఁడు, మహాతపోనిధియై యాచంద్రార్కఖ్యాతి నందెను.

# కండుముని

కండుముని తపోనిరతి.

పూర్వకాలమున కండుఁడను మునిముఖ్యుఁడు బాల్యమునుండియు మహాతపశ్శాలియై గోమతీతీరమున నొకయాశ్రమమును నిర్మించుకొని నివసించుచుండెను. జనశూన్యమైన యాయాశ్రమవనమునఁ గందమూలఫలాదులు, పుష్పలతాగుల్మములు, సువాసనలఁ గొనిపోవుమందపవనములనువాయువులు, కుశకాశతృణాదులు మిక్కుటములై చాల మనోహరముగా నుండెను. అనేకమృగములు సేవచేయుచు మైత్రినాచరించుచుండ, శుకపికాదులు కలస్వనములచే మనస్సున కానందము కలిగించుచుండెఁ బ్రశాంతమనస్కుఁడై కండుముని తపముచేసికొనుచుండెఁగా నట నిత్యము వసంత శోభయే చెలువారుచుండెను.

కండుమహాముని కఠినవ్రతము లవలంబించియు, మహోపవాసము లుండియు, స్నానసర్వనియమము లూనియు, గ్రీష్మకాలమునన్నైత్రము, పంచాగ్నిమధ్యమునఁదపించియు, శీతకాలమున మంచువలె గడ్డకట్టినజలరాసులమధ్యమున నుండియు, నుగ్రతపస్సు చేసెను. ఆతనితపోనిరతికి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మున్నగువారు పరమాశ్చర్యభయముల నందిరి. క్రమముగా ముల్లోకములందు నీతనితపోగ్రతఁ గూర్చి జనులు చెప్పుకొనుచు నచ్చెరువందుచుండిరి. ఇంతధైర్యము, ఇంత నియమపరత, ఇంతనిష్ఠాగరిష్ఠత, ఇంతసాధుతపము నెక్కడను

గనియున్నవారము కాముకదా యని యెల్లరు నాతని నినుతింపఁ దొడఁగిరి.

## తపోభంగమునకై ఇంద్రుఁడు ప్రమ్లోచనను బంపుట

ఇట్లుండఁగా నింద్రుఁడు దేవతలతో నాలోచించి కండు మహాముని తపస్సునకు విఘ్నము కలిగింప నెంచెను. వెంటనే యాతఁడు సౌందర్యాంగియు దేవవేశ్యయు నగు ప్రమ్లోచన యను దానిఁ బిలిపించి యామెతోఁ గండుముని తపోగ్రతఁ దెలిపి, యాతనికిఁ గామరాగముఁ బుట్టించి తపోవిఘ్నముఁ గలిగింపు మని కోరెను.*

అంత నామె "దేవా! బ్రహ్మచర్యనిష్ఠుఁడు మహోగ్ర తేజస్వి యగు కండుముని వశపఱుచుకొన నా కలవి యగునే? ఊర్వశి, మేనక, రంభ, ఘృతాచి, పుంజికస్థల, విశ్వాచి, సహ జన్య, పూర్వచిత్తి, తిలోత్తమ, అలంబుస, మిశ్రకేశి, శశిలేఖ, వామన మున్నగు త్రిదశవేశ్యలు రూపయౌవనగర్వమున నలరుచు సుందరవదనారవిందలు, సుమధ్యలు, సుస్తనోన్నతలు, కామ ప్రచారకుశలలు నైయున్నారు. వారలలో నొకతెఁ బంపు" మని పలికెను. "కాంతా! వారెవ్వరు నీపనిలో నీకుఁ జాలరు. కామవసంతమలయానిలముల నీకుఁ దోడుగా నిచ్చెదను. నీ వేగి యీకార్యము నిర్వర్తింపక తప్పదు. పోయిరమ్మని యింద్రుఁ డామెను శాసించెను.

ఇఁక మాఱుమాటాడనేరక ప్రమ్లోచన మన్మథవసంత మలయానిలులు తోడురాఁగా భూతలమునకు బ్రయాణ మయ్యెను. అపుడు

* కండుఁడని బ్రహ్మపురాణము. కంధుఁడని విష్ణుపురాణము.

"పసిఁడి బింకపుగుబ్బపాలిండ్లు కంతుని
గిరిదుర్గములతోడఁ గ్రీడసేయ
కమలాక్షి నిడువాలుఁగన్నులు కుసుమాస్త్రు
క్రొవ్వాఁడి తూపులఁ గొఱఁతపఱుప
అలివేణినూఁగారుచెలువు శంబరవైరి
నిడువాలు వాలుతో సెయ్యమాడ
చిగురాకుబోఁడిభ్రూయుగ మంగజాతుని
చెఱకుసింగిణివింటి కోఱపు గఱప
సరసిజాయతలోచనజఘనయుగము
మరునిరథచక్రములతోడ మాఱుమలయ
మేఘమండలిలో నుండి మెఱుఁగుఁడీఁగె
వెడలివచ్చిన కైవడిఁ బుడమికి డిగి" (విష్ణుపురాణము. ఆ ౨౦౪)

ప్రమ్లోచన కండుముని యాశ్రమముఁ జేరెను. అచట నాశ్రమము పరమశాంతముగా నుండెను. కాని, యీమె యట నడుగుపెట్టఁగనే గండుఁగోయిలలు మనోహరముగాఁ గూయఁదొడఁగెను. వసంతుఁడుకూడ వెంటనే విజృంభించెను. ప్రమ్లోచన సఖీసహితయై పూలుకోయఁ జొచ్చెను. అంత

"మలయక్ష్మాధరకూటపాండురశిలామార్గంబులన్ డస్సి తే
ద్వ్యాలసన్నిర్ఘరవారిదీర్ఘికలలో విశ్రాంతిఁ గావించి పు
ష్పలతామంజులకుంజపుంజముల నిచ్ఛావృత్తిఁ వర్తించుచున్
బొలసెన్ దక్షిణవాతపోతములు సంపూర్ణప్రమోదంబునన్."

(వి. పు. ౨. ౨౧౨)

ఆగాలికి వనలతలనుండి పుష్పము లెల్ల భూమిపైఁ బడి పుష్పశయ్యలుగా నేర్పడెను. మన్మథుఁడు నిదే సమయమని కండుమునిపై సుమబాణము లేసి యాతని ధైర్యగంచుకమును జెండాడి

నై చెను. ముని కన్నులు తెఱచి ప్రమ్లోచనఁ గని మోహపర వశుఁడయ్యెను.

ప్రమ్లోచన కండుమహర్షిని చేఁజిక్కించుకొనుట

అంత

"తనశరీరము కమ్మతావిమూర్కొన నట్లు
గా వినోదమునఁ బైగాలిఁ బొలయు
తన మోహనాకృతిఁ గనుఁగొనునట్లుగాఁ
ముందర బింబోకముగ నటించు
తనకంఠరవములు వినవచ్చునట్లుగాఁ
బరవాదినులు మ్రోసి పాడుచుండు
తన మోవిరుచికిఁ బైకొనివచ్చునట్లుగాఁ
దివ్యాని ఫలములు తెచ్చి యిచ్చు
తనకరాలింగనమునకుఁ దగులునట్లు
గా శరీరంబు మోవంగఁ గదిసి మ్రొక్కు-
ని తెఱంగున నమ్ముని చిత్తవృత్తిఁ
గలఁచి మదనాతురునిఁ జేసె కమలనయన. (వి.పు. ౨. ౨౦౪.)

వెంటనే కండుమునీశ్వరుఁడు సమస్తనిష్ఠలు తన్ను విడిచిపోఁగా నామెఁ జేరి యిట్లని ప్రార్థించెను.

"తరుణి! నీ చేత మదనతంత్రంబు లెఱుఁగఁ
గోరియున్నాఁడ నా యాస కొంచెపడక
యుండ సురతసుఖాంబుధి నోలలార్చి
యింపుసొంపార నన్ను మన్నింపవలయు" (౨. ౨౦౫.)

వెదకఁ బోయినతీఁగ వ్రేలికిఁ దగిలిన ట్లామె యానందించి యాతనిఁ జెట్టపట్టెను. కండుమునీశ్వరుఁడును దనయపారతపో బలమున నవయౌవనుఁడు, నవమన్మథసదృశుఁడు, నవ్యభూషణ

భూషితుండు, సకలశాస్త్రవయస్కుఁడు, వృషవీర్యుఁడు, నై ప్రమ్లోచ పరమానురాగమునకుఁ గొనిపోయి యానందాంబుధి నోలలాడఁ జేసెను.

తరువాత నాతఁడు తనవలపుకత్తెతోఁగూడి మందరగిరి కందరంబులయందు దివారాత్రము లెఱుంగక యయ్యామెవలన తోడికిం బర్వితప్రియానందంబుల నూఱుసంవత్సరంబులు వినోదించెను. ఆపిదప నామె యన్నియహోరాత్రములు తాను త్రిదశసేవ్య సనియు నన్నానాఁకఁగఁ దెల్లాకిరయుండింగా ననియుఁ దనకు స్వర్గమునకుఁ బోవ ననుమతి యిమ్మనియు నాఋషిఁ గోరెను. కాని, యాతఁడు వలపుతమి చేనవలకె యంగీకరింపఁ డాయెను. ఆతని యానతిఁగొనక యామె యరిగినచోఁ దనకు శాప మొసంగునని వెఱచి యామె యన్నియేండ్లాతనితో నుండెను.

ఒకనాఁడు కండుముని యొడలెఱింగి హోమప్రవృత్తిని జూచి తాను చిరకాలమునుండి వనితావిహారులకుఁ జిక్కి తపోమహాత్మ్యముఁ గోలుపోవుచుంటఁ గనిపెట్టి ప్రమ్లోచం బిలిచి "ఓసీ! నీ పాపకాలము నన్ను నమ్మించెనని కాన నిన్ను శపింపను. నీవు వెనువెంటనే నీయిచ్చవచ్చినచోటికిఁ బొమ్ము. పోకుందువేని క్షణములో భస్మ మగుదు"వని హుంకరించెను. ప్రమ్లోచన గడగడ లాడుచు నాఋషిపాదపంకజముల కెఱఁగి సెలవు గైకొని గగనమున కెగసి వెడలిపోవునప్పు డామె లేఁతచూలు గలగర్భము స్రవింప నామెశరీరావయవములనుండి యాఋషివీర్యము చెమట రూపమున బయలువెడల నామె చంచలించి శాలతరుపల్లవములఁ

ముడుచుకొనుచు దేవలోకమున కరిగెను. ఆలేఁతయాకులనుండి యామునివీర్యము వాయువశమునఁ జంద్రకిరణములఁబరివృతమై క్రమముగ నొకస్త్రీరూపమున జన్మముఁ గాంచెను. ఈస్త్రీయే మారిష. ఈమెను ప్రచేతసులు భార్యగాఁగైకొనిరి. ఈమెకే దక్షప్రజాపతి జన్మించెను.

### కండుఁడు పశ్చాత్తప్తుఁడై మఱల తప మొనరించుట

కండుమహర్షి యింద్రుని కపటమునకుఁ జాలి తపోమహత్త్వమును గోల్పోవుటకు విచారించి యటనుండి బయలుదేఱి పురుషోత్తమక్షేత్రమునకుఁ బోయెను. మునిపతు లగుభృగ్వాదులకు, మోక్షమార్గప్రతిష్ఠితులకు, గంధర్వయక్షాదులకు, తపోమహిమాన్వితులు నగువారికి నివాసస్థాన మగునాప్రదేశమునకుఁ గండుఁడు. మహర్షి యూర్ధ్వబాహుండై, మహాయోగనిరతుండునై బ్రహ్మపారజపపరాయణుండై * తపోనిరతి నుండెను.

---

* ఈబ్రహ్మపారజపభావ మిది: పరమాత్మరూపుఁ డగువాఁడు పరాత్పరుఁడు. అపారుపారుఁడు, బ్రహ్మపారుఁడు, పరపారభూతుఁడు, బ్రహ్మయోగులే యందురు. పరమేశ్వరులకుఁ బరమేశ్వరుం డగుట పారపారుఁ డని యాతని మునులు కీర్తింతురు. కారణాంశ్రితుఁ డగునాతఁడే కారణము. ఆతఁడే పరహేతుహేతువు. సర్వకార్యములయందు నాతఁడే కర్తృకర్మరూపములచే సర్వముఁ బాలించుచుండును. ఆబ్రహ్మమే ప్రభు వని పిత యని సర్వభూతుఁ డని, అవ్యయము, నిత్యము, అజము ననుసర్గములకుఁ బాత్రుఁడై అసంగుఁడై వెలుఁగును. బ్రహ్మము, అక్షరము, అజరము, నిత్యము నగువాఁడే పురుషోత్తముఁడు. ఆతనిదయచే రాగాదు లగు నాసర్వదోషములు నశించుఁ గాక యని చేయుప్రార్థనముతోఁ గూడినజపమే బ్రహ్మపారజపము. ఇది విష్ణుప్రీతికరము. (బ్రహ్మపురాణము.)

ఆతనిభక్తి మెచ్చి పురుషోత్తముఁడు ప్రత్యక్షమై మధురముగ "మునివరా! నీతపమునకు మెచ్చి వచ్చితిని. వరమేదైనఁ గోరుకొనుము. ఇచ్చెద" ననెను. అంత, కండుమహర్షి యాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి భయభక్తిశ్రద్ధలతో నాతని నిట్లు స్తుతించెను. "నారాయణా! సర్వలోకప్రభూ! నీకు నమస్కారములు. నీవు విశ్వకర్మవు, శంభుఁడవు, వృషాకృతివి, శంకరుఁడవు, ఉశనసుఁడవు, సత్యస్వరూపుఁడవు, జపస్వరూపుఁడవు, తపస్స్వరూపివి, ఆదిత్యుఁడవు, ఓంకారుఁడవు, ప్రాణరూపుఁడవు, పర్జన్యప్రభృతివేధోసురేశ్వరనామధరుండవు, ఋగ్యజుస్సామసమ్మతుఁడవు, పరమాత్మవు.

దేవదేవా! నీవు దశాంగుళమాత్రరూపుఁడవు, మృతామృతశబ్దములు నీవు. నీవలన జగము లుదయించు. మహీయాంసుఁడవు, దశధాస్థితిం గాంచి నీవు నవభాగంబులుగ దివియందును, నవభాగములుగ సంతతేశుంబునందు నివసింతువు. భాగద్వయంబున భూమి నుందువు. చతుర్భాగంబులఁ బురుషోత్తమక్షేత్రమున నుందువు. మహాభాగా! నీకు నమస్కారములు" అని పెక్కువిధంబులఁ గండుమహర్షి చేసినస్తుతి కానందించి విష్ణుమూర్తి వరము కోరుకొమ్మని మరల నడిగెను. అంత, కండుఁడు "దేవా! అతిదుస్తరము, నతివిస్తరము, భయావహము, శ్రేయోరహితము నగుసంసారసాగరమును దరింపఁజేసి పరమపదమును గ్రహించి రక్షింపు" మని ప్రార్థించెను. విష్ణువట్లే యగు నని వరమిచ్చి యంతర్హితుఁ డయ్యెను.

అనంతరము కందుమహర్షి రాగద్వేషాదులనెల్ల వర్జించి కామక్రోధాదులు తన్ను విడిచి పారిపోఁగా శమసత్త్వసంపన్నుఁడై యహంకారమును విడిచి, ఇంద్రియముల నిర్జించి, యేకాగ్రత శ్రీహరిని ధ్యానించి ధ్యానించి యమరుల కైన సాధ్యముకాని మోక్షపదము నంది దివ్యతేజోలీనుఁడై సిద్ధిఁ బొందెను.

ఇట్లు కందుమహర్షి బాల్యమునుండియుఁ దపస్సంపన్నుఁడై నడుమఁ గామమోహితుఁడై కాంతాసుఖముల మఱఁగి కాలమును వ్యయించియుఁ బశ్చాత్తప్తుఁడై నిరుపమనిష్ఠాగరిష్ఠత మరల మహోగ్రతప మొనరించి బ్రహ్మాపారమంత్రసిద్ధుఁడై యోగీశ్వరులు గాంచుదివ్యపదవిఁ జూఱగొనెను.

# కణ్వమహర్షి

"పరమార్థ తత్త్వానుభవము నర్జించు
    సమధిక బ్రహ్మవర్చసమువాని
వైవల్యవాంఛానుకలనంబు వివరించు
    వ్యాఘ్రాజినోత్తరీయంబువాని
వెలిచూడ్కి లోలక్ష్య మలరించి బాహిరముగా
    మునుకొన్న శాంభవీముద్రవాని
వేదముల్ మూర్తీభవించు మేఁ దలపించు
    సముచితాధ్యయన ఘోషంబువాని
హుతహుతాశన తేజుఁడై యొప్పువాని
హరిచరణభక్తి ప్రంభావమైనవాని
దయయు ధర్మంబుఁ దానయై తనరువాని"
కణ్వమౌనీంద్రుఁ గొల్తు నస్ఖలితభక్తి.

(కృష్ణకవి శకుంతలాపరిణయము ౨-౨౩)

## కణ్వని మంత్రద్రష్టృత్వము.

కశ్యపప్రజాపతివంశమున జనించినమహనీయులలో మునికులమాన్యుఁడని యనఁదగినకణ్వమహర్షి యొకఁడు. ఈతఁడు బాల్యమునుండియు మహాతపోనిష్ఠలో నుండి యాజన్మబ్రహ్మచారి యై ఋషివర్యుఁడు. ఈతఁడు కొన్నిసామవేదమంత్రములకు ద్రష్టయై కాణ్వశాఖీయు లగువేదవాదులకు మూలపురుషుఁడైన మహాత్ముఁడు.

ఈతఁడు బాల్యమునఁ దనకుఁ దోఁచినసామములకు నిదానము కానరాక వ్యాకులపడుచున్నసమయమున నీతనిసమీప

మున నున్నయొకపిల్లి మెల్లఁగా నొకతుమ్ము తుమ్మెను. ఆతుమ్మునే యాతఁడు నిదానముగాఁ గైకొని సామమంత్రమునకు ద్రష్టయై మహర్షులనున్నవలెఁ గాంచెను. ఇట్లే కణ్వుఁడు పెక్కుసామములకు నిదానముఁ గనిపట్టి జగజ్జేగీయమానుఁ డయ్యెను.

## కణ్వుని యాశ్రమము.

కణ్వముని నిరంతరతపోవృత్తి వేదగోష్ఠి మునిజనసహవాసము ముఖ్యములుగా నెంచుకొని మాలిని యనునదీతీరమున మహాప్రభావనిలయ మగునొకవనమునఁ దనయాశ్రమమును నిర్మించుకొని యందు నివసించెను. ఆతనియాశ్రమవనము దేవేంద్రునిఖాండవవనమునకుఁ గుబేరునిచైత్రరథమునకు సరిపోలుచుఁ గొన్నియెడల వానికి మిన్నగా నిలువ భూలోకమున దీనిని సృష్టించినాఁడా యన్నట్లుండెను. ఆయడవియందలితీఁగలను స్త్రీలు మందమారుతములవలన రాలినపూవు లనుఅక్షతలను అందుండి బయటపడి తుమ్మెదలుచేయుఝంకార మనుఆశీర్వాదముతో అచటికి కరుదెంచినవారికి, అట నున్నవారికి నెల్లప్పుడు నొసంగుచుండుట పరిపాటి. ఆయాశ్రమప్రదేశమున నొత్తుగాఁ బెరిగి మనోహరముగాఁ గానవై చక్కఁగాఁ బుష్పించినయెఱ్ఱగోరంటలు, పూలతో వానిసౌరభముతో నెంతోసంతోషము కలిగించునశోకవృక్షములు- పొన్నచెట్లు మున్నగునవి చక్కఁగాఁ గాచి పండినతీయమామిడి, యరఁటి, మున్నగుఫలజాతివృక్షములు లెక్కకు మిక్కిలియై యట నుండెను. వేయేల! ఆయాశ్రమమే భూలోకస్వర్గము.

కణ్వమహర్షి యాశ్రమమున నిరంతరము పదను క్రమము పఠించు వేదవిదుల వేదనినాదము నింగిముట్టుచుండెను. ఎడతెగక యగ్నిహోత్రమున నాజ్యము సమిధలు కర్మిష్ఠు లగుఋషులు "స్వాహా" యనుశబ్దములతో వేల్చుచునే యుండిరి. అంతే కాదు. ఆయాశాస్త్రములలో నిష్ణాతు లయినఋషీశ్వరులు రచించిన న్యాయాదిక శాస్త్రముల ప్రవచనములవలన విద్వత్సభాసంభాషణఘోష మట నెప్పుడును వినఁబడుచుండెడిది. మఱియు వేదార్థమీమాంసకగోష్ఠీవివాదనాదములు నట వినఁబడుచునే యుండెను. ఇంకను, యజ్ఞప్రయోగప్రవీణు లయినయాజ్ఞికులకును, విహితానుష్ఠానాసక్తు లయినయనుష్ఠాతలకును, అధికతపోనిరతు లయినమహాతపోనిధులకును కణ్వునియాశ్రమము నివాసస్థానమయ్యెను. మఱియు నీయాశ్రమము గంగాతీరమునందలినరనారాయణాదివ్యాశ్రమమువలె జగత్పావనమై యలరారెను.

కణ్వమునియాశ్రమముపొంత శుకపికములు శ్రవణసుఖముగా సామగానములు చదువుచుండెడివి. అవి వినుచుఁ గదలక నిలుచు నేనుఁగులు, ఆయేనుఁగులతొండములచల్లనినీడను జల్లని గాలికొఱకై చేరి సుఖముగా సింహములు నుండెడివి. అచటి ఋషివరులు భూతబలులుగాఁ బెట్టునీవారాన్నపిండములుతినుటకై చేరవచ్చి పరస్పరస్నేహముతో నెలుకలు పిల్లులు వంతులు పంచుకొని కుడుచుచుండెడివి.

ఇట్టిపవిత్రాశ్రమమునఁ గణ్వమహర్షి యేకైకధర్మస్వరూపుఁడని జగమునందలిసమస్తజనులు తన్నుఁ బ్రశంసించుచుండఁగా

జగదారాధ్యుఁడై, దయామయుఁడై, యూర్ధ్వరేతుఁడై, మహామహుఁడై విలసిల్లుచుండెను. సహస్రసంఖ్యాకు లగుశిష్యు లాతనిఁ జేరి శుశ్రూషాపరత భయభక్తియుక్తులై యుండఁ గణ్వమహర్షి కులపతియై వారలకుఁ దోడునీడగాఁ గన్నతండ్రిగాఁ బరమహితుఁడుగా వర్తించుచు నెల్లరిమానసములను వశమొనరించుకొని నాల్లరకు నారాధ్యదైవ మయ్యెను.

### కణ్వమహర్షి కారుణికత్వము.

అఖండబ్రహ్మచర్యవ్రతుఁడు, జ్ఞానసంపన్నుఁడు, యోగారూఢుఁడు, మునిగణసేవితుఁడు నగుకణ్వమహర్షి యపారభూతదయాపరుఁడై యుండెను. అచట నివసించునాతనిశిష్యగణమే కాకుండ వనమందలి పశుపక్షిక్రిమికీటములు సైత మామహనీయుని దయావిశేషమునకుఁ బాత్రములై యుండెను. ఆప్రాంతములకు వచ్చినరాజర్షి బ్రహ్మర్షి మునిపుంగవు లెల్లరును గణ్వునియాశ్రమమును దర్శించి యాతనిపాదరజోలేశమును గన్నుల కద్దుకొని యాతనిని సన్నుతించి యాతనిసన్నుతు లంది యరుగుచుండిరి.

### కణ్వమహర్షి శకుంతలం గాంచి పెంచుట.

ఒకనాఁడు కణ్వమహర్షి యుదయవేళ మాలినీనదీస్నానమునకై బయలుదేఱి వెడలుచుండఁగా మార్గమధ్యమున నొక్కబాలికారోదన మాతనికి వినఁబడెను. ఆధ్వని ననుసరించి కణ్వుఁడు వెదకఁగా నట నొకచోట, తామరపాకుపాన్పై యుం దొకబాలిక చేతులు కాళ్లు కదుపుచు నేడ్చుచుండుటఁ గాంచెను. కరుణారసభరితమైనయామహనీయునిహృదయము వెంటనే ద్రవించి

పోయెను. చలిచీమపైనైన జాలిపడునా కరుణాసముద్రుముని కాబాలికపై ననుకంప జనింప యోగదృష్టిని బరికించి యామెజన్మాది వృత్తాంత మంతయుఁ దెలిసికొనెను. ఇంతలో నశరీరవాణి “మునీంద్రా! ఈమె మేనకావిశ్వామిత్రుల కుదయించిన బాలారత్నము. నీ వీబాలికభయమును బాపి పెంచుము. ‘భయత్రాతా తండ్రి’ యనునుడివలన నీ వీమెకుఁ దండ్రి వగుదువు. ఈమెకు జనించుపుత్రుఁడు చక్రవర్తి యగును. విశ్వామిత్రతపఃప్రభావమునఁ గ్రవ్యాదగోచరము కాక శకుంతరక్షితయై నవనలినపలాశతల్పమునఁ బొరలు నీమె శకుంతల యనుపేరఁ బరగుఁగాక యని పలికెను.

ఇది విని కణ్వమహర్షి యానందించి యంగీకరింప నాబాలికపై నాతనికిఁ బుత్త్రికామోహ ముదయించెను. వెంటనే యతఁ డాబాలికను దనపొదిఁగిటఁ బొదివికొనెను. అంతేకాదు :

“పుట్టుబ్రహ్మచారి పుత్రమిత్రకళత్ర
యోగభోగరహితుఁ డూర్ధ్వరేతుఁ
డహహా! దైవఘటన మాపిన్నపాప మే
నలమికొనుచు ముద్దులాడఁ దొడఁగె.

(కృష్ణకవి శకుంతలాపరిణయము ౩. ౧౫౬)

కణ్వమహర్షి యాబాలికను దీసికొనిపోయి తనపర్ణశాలయందు లలితకుశశయ్యపయిఁ బరుండఁబెట్టి తానే తల్లియుఁ దండ్రియు దాదియునై పెంచఁదొడఁగెను. ఆహా! విధిచైదములు విచిత్రములుకదా! ఆలుబిడ్డ లెఱుఁగని యమ్మహాఋషిని శకుంతలకు దాదిని జేసినవిధి యింక నేమి చేయఁదలంచునో?

## శకుంతలావివాహము

కాలక్రమమున శకుంతల యల్లారుముద్దుగాఁ బెరుగుచుఁ గణ్వమహర్షిని దండ్రిగాఁ జూచుకొనుచు నాతనివలన విద్యావినయవివేకాది సుగుణసంపదల నెన్నిటినో యలవఱుచుకొని యవనీతలమున కవతరించినతరుణశశిరేఖవలె దినదినప్రవర్ధమాన యగుచుండెను.

కాలప్రవాహమున కెట్టియాతంకములు కలుగఁబోవు. పసిపాపల బాలురఁగా బాలుర యువకులఁగా యువకుల వృద్ధులఁగాఁ గాలపురుషుఁడు మార్చివేయుచు జరామరణములఁ గూర్చుచు లోకము నేలుచుండెను. మూర్ఖమానవులు కాలప్రభావ మెఱుఁగక యేదశ కాదశయే శాశ్వతమనుకొని క్రీడాపరులై యిహపరములకు రెండిటికి దవ్వగుచుందురు.

కాలక్రమమున శకుంతల యువతియై నవలావణ్య విలాసహాసముల నొప్పారెను. సఖీజనముతో నామె యుద్యానవనములఁ బెంచుట, తండ్రి దేవపూజకు వలయుపుష్పపత్త్రాదులఁ దెచ్చుట, ఆశ్రమమృగముల నాదరించుట మున్నగుపనులు నిత్యకృత్యములుగాఁ బెరిగెను.

ఒకప్పుడు కణ్వుఁడు నిజాశ్రమప్రదేశమున లేనిసమయమున దుష్యంతమహారాజు వేటకై వచ్చి వేటాడి డస్సి కణ్వమహర్షిని జూచి పోవుద మని కణ్వాశ్రమమున కేతెంచెను. అప్పుడాతనికి శకుంతల లోచనగోచర కాఁగా నామె సౌందర్యమున కచ్చెరువంది యామె ఋషికన్య యైనచోఁ దన కామెపై

నట్లు వలపు కలుగుట సంభవింపదనియు నామె క్షత్రియకన్యయై యుండవలయుననియు నిశ్చయించుకొనెను. తదనంతర మామె వృత్తాంతముఁ దెలిసికొని యామెను బెట్టవట్ట నుంకించెను. శకుంతలయు నవమన్మథుఁ డగునారాజేంద్రుని మక్కువఁ దగిలెను. ఆతఁడు గాంధర్వవిధిని వివాహమయి సంగమసౌఖ్య మిమ్మని యామెను వేగిరపెట్టెను. శకుంతలయుఁ దనకుఁ బుట్టఁబోవుపట్టి యువరాజు కావలయు నని కోరెను. దుష్యంతుఁ డందుల కంగీకరించి గాంధర్వవిధి నామెఁ బరిణయమై యిష్టోపభోగము లందు నామెకు గర్భము నిలిపెను. పిదప, దుష్యంతుఁడు తనప్రధాన వర్గమును గణ్వమునిపాలికిఁ బుత్తెంచి యామెను దీసికొనిపోయి పట్టమహిషిం జేసికొందు నని చెప్పి యామె నూఱడించి నిజనగరమునకు వెడలిపోయెను.

### కణ్వుఁడు శకుంతలను వరమిచ్చుట

శకుంతలయు జరిగినదానిని విని కణ్వమహర్షి యేమనునో యేమినింద వచ్చునో యని భయపడుచుండెను. ఇంతలోఁ గణ్వమహర్షి విచ్చేసి తనకెదురు వచ్చి నమస్కరించినకూఁతుం జూచి లలిత శృంగారభావమున లజ్జావనతవదనయు, అతిభీతచిత్తయు నైనశకుంతలసంగతి దివ్యదృష్టిని దెలిసికొని యవి యంతయు విధివిలసితముగాఁ దలపోసి శకుంతల నూఱడించి యిట్లని పలికెను.

"తల్లి! నీకులగోత్రసౌందర్యములకుఁ
దగినపతిఁ గంటి దానికిఁ దగఁగ గర్భ
మయ్యె నీదుగర్భమునవాఁ డఖిలభువన
వహనమహనీయుఁ డగుచక్రవర్తిసుతుఁడు." (భాగ. ఆది. ౪-౬౨.)

నీధర్మచరితమునకు మెచ్చితిని. నీవు కోరినవర మిచ్చెదను వేఁడు"మని పలికెను. అంత నామె మిక్కిలి సంతసించి "తండ్రీ! నీదయకన్న నాకు వలసిన దేమున్నది? నాచిత్త మెప్పుడును ధర్మమునందే తగిలియుండునట్లు, నాకుఁ బుట్టునట్టిపట్టి దీర్ఘాయురారోగ్యైశ్వర్యబలసమన్వితుఁడు, వంశకర్త యగునట్లను గ్రహింపు" మని కోరెను. కణ్వుఁ డావర మనుగ్రహించి యామెకు యథాకాలవిధుల గర్భసంస్కారరక్షణములు చేయించి యుండ మూఁడేండ్లకా మె యొక సుపుత్త్రుని గాంచెను.

కణ్వమహర్షి యాబాలునికి భరతుఁ డనునామకరణము చేసి జాతకర్మక్రియాకలాపముల నెల్ల నొనరింప నాబాలుఁడు శుక్లపక్షచంద్రునివలెఁ బెరుఁగుచుఁ గరతలాలంకృత చక్రుఁడు, చక్రవర్తిలక్షణలక్షితుఁడు, సింహసంహననుఁడు, దీర్ఘబాహుఁడు, అనంతజవసత్త్వసంపన్నుఁడునై పెరుగుచుండెను.

భరతుఁడు వనములోనిక్రూరమృగముల నెల్లఁ దనబలమునఁ జేసి దమియించుచుండుటఁ జూచి ఋషు లాతనికి సర్వదమనుఁ డని పేరిడిరి.

## కణ్వుఁడు శకుంతలను బుత్త్రుని బంపివేయుట.

కణ్వమహర్షి భరతునియుదారతేజోరూపవిక్రమగుణములకు సంతోషించి యాతఁ డఖిలభువనయౌవరాజ్యాభిషేకమునకు సమర్థుఁ డగుసమయ మరుదెంచిన దని యెంచి యాలోచించి యొకనాఁడు శకుంతలతో నిట్లనెను. తల్లీ!

"ఎట్టిసాధ్వులకును బుట్టినయింటను
బెద్దకాల మునికి తద్ద తగదు

పతులకడన యునికి సతులకు ధర్మువు
సతుల కేడుగడయుఁ బతుల చూవె.

(భార. ఆది ౮-౬౬.)

కావున, నిన్ను దుష్యంతుపాలికిఁ బంపుదునని యనఁగానే దుష్యంతు ప్రణయవశంవద యగుశకుంతలకు మహానందమయ్యెను.

ఇది విని కణ్వమహర్షి షడ్రసోపేత మగువిందు కావించి యాశ్రమవాసులకు సంతర్పణము కావించి మనుమనిఁ గూఁతు నలంకరించుటకుఁ బ్రియంవదాదులఁ బిలిచి ప్రయాణసన్నాహము చేసెను. అప్పుడు సాలంకృత యగుశకుంతలను భూషణభూషితుఁడగుమనుమనిఁ గాంచి వారిమ్రొక్కు లంది యాశీర్వదించి వియోగభరమునఁ గన్నులనీరు గ్రమ్మ నెట్లో వారించుకొని శిష్యసమూహముఖ్యులవెంట వారిని దుష్యంతునింటికిఁ బంపివేసెను.

తదనంతరము, తొలుత దుష్యంతుఁడు నిరాకరించియుఁ బిదప నాకాశభాషితమున శకుంతలఁ జేరఁదీసి పట్టమహిషి నొనర్చి భరతునికి యౌవరాజ్యాభిషేకముఁ గావించినసంగతి విని కణ్వమహర్షి బ్రహ్మానంద మందెను. ఇఁక, నాతఁడు మమకారబంధములను బటాపంచలు చేసి యోగనిష్ఠుఁడై దివ్యతపస్వి యయ్యెను.

## కాణ్వధర్మశాస్త్రము.

కణ్వమహర్షి మహాధర్మోపదేశకుఁడుగా విశ్వవిఖ్యాతి నార్జించెను. ధర్మప్రవక్తలలో నొక్కఁడుగా నీతనిని ఆపస్తంబాదులు పేర్కొనిరి. ఆహ్నికశ్రాద్ధధర్మసందర్భమున స్మృతిచంద్రికలోఁ గణ్వధర్మశాస్త్రమునుండి కొన్ని యుదాహరణములు కలవు.

ఇట్లే గౌతమయాజ్ఞవల్క్యస్మృతిభాష్యకారులు కణ్వుని ధర్మశాస్త్రమునుండి మరికొన్ని వాక్యము లుదాహరించియున్నారు : "అధ్వరే వేదేతిహాసపురాణానీతిధ్యాయన్ బ్రాహ్మణ తీర్థే గోష్ఠయోః సలోమదేశమున్మృజేత్" (స్మృతిచంద్రిక) "సంవత్సరేణ పతతి పతితేన సమాచరన్, యానాశనాసనై ర్నిత్య మిత్యాహుర్బ్రహ్మవాదినః" (హరదత్తుని గౌతమధర్మశాస్త్రవ్యాఖ్య.) మున్నగునవి కాణ్వధర్మశాస్త్రమునందలివి.

మహాతపస్వి, బ్రహ్మనిష్ఠుడు, ధర్మప్రవక్త, మహాత్ముడైన కణ్వమహాముని మనకు నిత్యస్మరణీయుడు.

# కర్దముఁడు

బ్రహ్మ సర్వదేవతలను గంధర్వాప్సరోగణములను సిద్ధకిన్నరకింపురుషమనుష్యాదులను సృష్టించి యనంతరము తపోయోగవిద్యాసమాధియుక్తుఁడును, ఋషివేషధరుఁడును, హృషీకాత్ముఁడును నై యాతఁడు ఋషిగణములఁ బుట్టించెను. వెంటనే యాతఁడు సమాధియోగైశ్వర్యతపోవిద్యావిరక్తియుక్తమగు తనశరీరము నుండి ఆఁయాయంశలు వారెల్లరకు నిచ్చి ప్రజాసృష్టి యొనరింప వారిని నియమించెను.

### బ్రహ్మనియోగము.

కృతయుగమున నొకప్పుడు బ్రహ్మ తపోవిద్యానవద్యుఁడై యోగీశ్వరుఁడైన కర్దముని బిలిచి వివాహమాడి సంతానమును బడసి సృష్టికార్యమునఁ దనకు సాయము కమ్మని కోరుకొనెను. కర్దముఁ డాతనిమాట కాదనఁజాలక యట్లే యని యాతనిఁ బంపివేసెను.

### కర్దముని తపస్సు.

పిదప ధైర్యస్థైర్యవిరాజితుఁ డగుకర్దముఁడు సరస్వతీనదీతీరమున కేఁగి యట నొకయాశ్రమమును నిర్మించుకొని యందుండి మహాదీక్షతోఁ బదివేలసంవత్సరములు తప మొనరించెను. అనంతర మొకనాఁ డాతఁడు జపసమాధినుండి యేకాగ్రచిత్తుఁడై వరదుఁడు ప్రసన్నుఁడు మనోరథవరదానశీలుఁడు రమేశుఁడు నగు

హరిఁ బూజించిన నాతఁడు కరుణాళువై ప్రత్యక్ష మయ్యెను. శంఖచక్రగదాపద్మహస్తుఁడు, పీతాంబరధరుఁడు, శబ్దబ్రహ్మశరీర వంతుఁడు, సదాత్మకుఁడు, జ్ఞానైకవేద్యుఁడు, వైనతేయవాహనుఁడు నయినహరిని గనుఁగొని కర్దముఁడు సాష్టాంగదండప్రణామము లాచరించి యమితానందుఁడై యిట్లని స్తుతించెను.

"అబ్జాక్షా! యోగీశ్వరేశ్వరులు నీదర్శనముఁ గోరి కడ ముట్టఁ గందురు. కాని, నాభాగ్యమున నీపాదారవిందదర్శనముఁ గంటిని. భవవార్ధిఁ గడగంటిని. దేవా! నీమాయవలన మోహితులై మేధ నశింప సంసారసముద్రమునుండి వెలువడఁజాలక నీపాద పద్మములను భజింపఁజాలక తుచ్ఛులై నరకమునఁ గూలువారి నేమందును? తండ్రీ! అట్టికోరికలు గలవారిని నిందించు నేనును గృహమేధధేనువు, అశేషమూల, త్రివర్గకారణ, సమానశీల యగు భార్యను బరిణయమాడఁ దలఁచి కల్పవృక్షసదృశము లైన నీపాదారవిందముల సేవించితిని. ఐనను, ఒక్కవిశేషము కలదు. కాలాత్మకుఁడ వైన నీయభిమతము సిద్ధింపఁజేయుటకే కాని కాముకుఁడనై వివాహ మాడఁగోరుట లేదు. దేవా! నీమాయచే నిర్మితమై కాలవేగముతోఁ గూడి యక్షరమైన బ్రహ్మమునందుఁ గాలచక్రము సకలజీవనికరములయాయువు మ్రింగివేయఁజాలును గాని కామభూతము సోఁకినపశుప్రాయు లగుమానవుల పిడిచి సంసారదుఃఖములను బోఁగొట్టు నీచరణముల నాశ్రయించి నీగుణకథన మనునమృతముఁ ద్రావుచు బ్రహ్మజ్ఞానమత్తులైన భగవద్భక్తులయాయువును మాత్రము హరింపఁజాలదు. సర్వేశ! నీవు సృష్టి

స్థితిలయకారకుఁడవు. విశ్వేశ్వరుఁడవు. శబ్దాదివిషయసుఖకర మగు నీరూపము నా కిట్లు విస్తరింపఁజేయుట నన్ననుగ్రహించుటకే కాని, నీకొఱకుఁగాదు. నీమాయచే లోకతంత్రము నడపించుచు నాకోరిక దీర్ప నిట్లు విచ్చేసితివి. నీకివే నానమస్కారములు.

హరి కర్దమునకు వరమిచ్చుట.

ఈపలుకులు విని విష్ణుమూర్తి "మునివరా! ఏకాగ్రతతో నీవు నన్ను భజించితివో యాకోరిక నీకు సిద్ధించుఁగాక! బ్రహ్మపుత్రుఁడును, సమ్రాట్టును, నగుస్వాయంభువమనువు బ్రహ్మావర్తదేశముఁ బాలించుచున్నాఁడు. ఆమహాత్ముఁ డపరదివసమున భార్యాసహితుఁడై, భర్తృకామ యగుతనూజాయుతుఁడునై నీకడకు వచ్చి యనురూపవయశ్శీలసంకల్పగుణాకర యగుకూఁతు నిచ్చి నీకుఁ బరిణయముచేయును. ఆమనుకన్యయం దతిసౌందర్యయుతలైన నవకన్యలు నీ కుదయింతురు. వారియందు మునీంద్రులు పుత్రులం బడయుదురు. నీవు నాశాసనమును బాలించి సర్వకర్మములు నాయం దర్పించి ఏకాంతికుఁడవు, భూతభయరహితుఁడవు, జ్ఞానివి నై నాయందే జగములు కల వనియు నీయందు నేను గల ననియు నెఱిఁగి నన్ను సేవించుచుండుము. అట్లుండి చరమకాలమున నన్ను నీవు పొందఁగలవు. మఱియు, నాకళాంశమున నీభార్యయందుఁ బుత్రుఁడనై జనించి నీకుఁ దత్త్వసంహితి నుపన్యసింతు" నని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

కర్దమునివివాహము.

కర్దముఁ డాపిమ్మట బిందుసరోవరతీరమున కేఁగి తప మొనరించుచుండెను. అపుడు బంగరురథ మెక్కి శతరూప యను

భార్యతోడను దేవహూతియను పుత్రికతోడను స్వాయంభువుండు విచ్చేసి కర్దమమహర్షి దివ్యాశ్రమమును బ్రవేశించి దూరమునం గర్దమహర్షిని గాంచెను. కర్దమమహర్షి బ్రహ్మచర్యవ్రతమును మహాతపోమూలమున దివ్యతేజస్వియై యుండెను. ఆతనిశరీరము కృశించినను ఆతఁడు హరికథాపూరితుఁడగుటచేఁ గృశీభూతుఁడు కాక జటావల్కలాజినలక్ష్మితోఁ బద్మదళములవంటివిశాలనేత్రము లొప్పుచుండ సానపెట్టనిదివ్యరత్నమువలె నాతఁడు మెఱయు చుండెను. స్వాయంభు వాకర్దముని సమీపించి నమస్కరించి స్తుతించి తనవృత్తాంతమును గర్దమునిదక్క సన్న్యాని వరింప నను తనతనయవృత్తాంతమును దెలిపి యామెను వివాహ మాడు మని కోరెను.

కర్దముఁ డంగీకరించి "అయ్యా! ఈమెను వివాహ మాడుట నా కంగీకారమే కాని యొక్కసమయము కలదు. ఈమెకు బిడ్డలు పుట్టునటుకు నే నీమెతోడనే యుందును. ఆపిదప నేను సన్న్యసించెద"నని పలికెను. స్వాయంభువు భార్యాపుత్రికల కీవార్తఁ దెలిపి వా రంగీకరింపఁ దాను నంగీకరించి విధ్యుక్త ప్రకారమున దేవహూతి నిచ్చి కర్దమునికి వివాహము చేసెను. శతరూప బారిబర్హ సంజ్ఞకము లై నవివాహోచితదివ్యాంబరా భరణములను దంపతుల కొసంగెను. ఆపిమ్మట శతరూపా స్వాయంభువులు పుత్రికను విడువలేక కౌఁగిలించుకొని చుబుకము పుడుకుచుఁ జెక్కిలి ముద్దుగొని శిరము మూర్కొని ప్రేమాతి శయమునఁ గన్నీరు మున్నీరై కాఱ, "తల్లీ! పోయి వచ్చెద"

మని చెప్పి కూఁతు నల్లున కొప్పగించి కర్దమునిచే నామంత్రితులై రథ మెక్కి తమ దేశమునకు వెడలిపోయిరి.

### దేవహూతీ కర్దముల సంసారయాత్ర.

పిదప, దేవహూతి పతిభక్తి కలిగి భవునికి భవాని పరిచర్య చేయువిధమునఁ గర్దమునికిఁ బరిచర్య చేయుచుండెను. అతఁడే తనకు సమస్తము నని యెఱిఁగి యాతనిచిత్తవృత్తిని బట్టి యాతని కనుసన్నల మెలఁగుచు, పదపద్మములఁ గొలుచుచు, దినదినము భక్తితాత్పర్యస్నేహములు రెట్టింపఁ బతిశుశ్రూష చేయుచుండెను. అందుచే నామె యనూనతేజోవిరాజితయు, కామక్రోధాది గుణవిరహితయు, నయి శరీరశుద్ధి పొంది శౌచలక్ష్మి యన నొప్పుచు, చతురసౌహార్దస్నేహములు కలిగి పతియే దైవముగా భావించి మృదుమధురవచనముల నాతనిమనస్సును రంజింపఁ జేయుచుండెను.

ఇట్లుండ, దైవయోగము నెవను దప్పింపఁ సమర్థుఁడైన కర్దముఁడు తన సేవలోఁ గృశించినశరీరము గలదేవహూతిపతి భక్తికిఁ బరిచర్యకు మెచ్చి దయాసముద్రుఁడై యామెతో ని ట్లనెను. "తరుణీ! దివ్యభోగములు, సమస్తశుభములు నాసేవ వలన నీకుఁ లభింపఁగలవు. నీకు దివ్యదృష్టి నిచ్చెదను. దానివలన నీకు సమస్తము గోచరించును. క్షణమాత్రమున నశించు తుచ్ఛ భోగములు మన కేల? మహారాజాధిరాజులైన చక్రవర్తులైనవారును నెఱుఁగనిదివ్యభోగములు నీపాతివ్రత్యనిష్ఠవలన సిద్ధించును. నీవు వాని ననుభవింపు" మని పలుక నామె యిట్లనెను.

"దేవా! అమోఘయోగమాయావిభవుఁడ వగు నీ కెందు సమర్థత లేదు? అనుపమదివ్యభోగములు నీశక్తిని సమకూరు నని నే నెఱుఁగుదును. నాకు సమస్తాభరణమాల్యానులేపనమందిరారామాదుల నెల్ల ననుగ్రహించి శరీరసౌందర్యవర్ధకసమస్తభోజనములు సమకూర్చి యాపిదప నీతనుసౌఖ్య మొసఁగు" మని కోరెను.

### కర్దమునియోగబలము

కర్దముఁ డంత యోగమాయబలంబున వెంటనే యనేక దివ్యభవనములతోఁ గూడి, అనేకదివ్యవస్తుసంచయముతో నొప్పి, లలితోద్యానవనయుతమై, దివ్యసుందర నగరముల నొప్పునొకదివ్యవిమానరాజము నాతఁడు సృష్టించెను. అది యామె భౌతికనేత్రములకుఁ గానరాకపోవు టెఱిఁగి కర్దముఁ డా బిందుసరోవరమున స్నానము చేయు మనియు నప్పుడు దివ్యదృష్టి కలిగి యన్నియుఁ గాననగు ననియు భార్యకుఁ దెలిపెను. ఆమె యట్లు చేయ సమకట్టి యానీటిలో దిగునరి కందు రుచిరసూక్ష్మాంశుకధారిణులు, కిశోరవయఃపరిపాకశోభితలు, ఉత్పలగంధులు నగుకన్యాసహస్రములు కాననై యామె కభ్యంజనాదులు తీర్చి షడ్రసాన్నభక్ష్యములఁ దనిపి కనకపాత్రికలఁ గర్పూరనీరాజనము లిచ్చి యాసనమున నునిచి యద్దము చేతి కిచ్చిరి. ఆమె యచ్చెరువడి తన్నుఁ జూచుకొని యది యంతయు భర్తయోగవిభవ మని యుప్పొంగి భర్తఁ దలఁచెను. కర్దముఁ

డటఁ గాసన్నై ఆకన్యలతో దేవహూతితో విమానము నెక్కెను.

అనంతర మావిమానము దేవతోద్యానములకు సమస్త భూభాగదివిభాగసమస్తదివ్యప్రదేశములకు వాయువేగమునఁ గొనిపోయి వారల నానందాబ్ధి నోలలాడించెను. మోక్షదాయకుఁడు, తీర్థపాదుఁడు నగుపుండరీకాక్షునిఁ గొలిచినవారికిఁ బొందరాని పదార్థములు కలవే?

అనంతరము వారు నిజనివాసమునకుఁ జనుదెంచి సమస్త భోగము లనుభవించిరి. శతవత్సరములు వార లిట్లు క్రీడించిన పిదప నొకనాఁడు కర్దముఁడు తనవీర్యమును నవవిధముల భార్య గర్భమున నిలిపెను. దేవహూతి గర్భము ధరించి కాలక్రమమునఁ దొమ్మండ్రుకూఁతుండ్రను గనెను.

కర్దముఁడు వివాహకాలమునందలిసమయమును స్మరించి తాను సన్న్యసింపఁ దలఁచెను. దేవహూతి దీనవదనయై పుత్రికలకుఁ బెండ్లిండ్లయి వార లత్తవారిండ్ల కేఁగు నటులను, ఒక సుపుత్రుఁడు జనించి తన్నుద్ధరించునటులను సన్న్యసింప వల దని ప్రార్థించెను. కర్దముఁ డంగీకరించి విష్ణుమూర్తిని నియమవ్రతముల సేవింపు మనియు నాతఁ డామెగర్భమున నర్భకుఁడై పుట్టఁగలఁడనియుఁ దెలిపెను. ఆమె యానందించి హరిపరతంత్రయై దివ్యదీక్షఁ దేజరిల్లఁ జొచ్చెను.

ఇట్లుండఁ గొంతకాలమునకుఁ గర్దమవీర్యమున దేవహూతి మరల గర్భము ధరించి విష్ణుమూర్తినే సుతునిగాఁ గనెను.

అపుడు దివ్యదుందుభులు దేవతూర్యములు మ్రోఁగి పుష్పవర్ష ములు కురిసి శుభములు సూచించెను. మరీచిప్రముఖులై న మునిజనములతోఁ గూడి బ్రహ్మదేవుఁ డచటికి విచ్చేసి యీ పుట్టినబిడ్డఁడు దేవదేవుఁ డని దేవహూతీకర్దములకుఁ దెలిపి యీతఁడు సాంఖ్యతత్త్వమును లోకములఁ జాటి యెల్లర నుద్ధ రింపఁ గలఁ డని తెలిపి కర్దమునిపుత్రికలను ఋషివరుల కిచ్చి పెండ్లి చేయు మని చెప్పి వెడలిపోయెను.

బ్రహ్మ చెప్పినప్రకారము కర్దముఁడు మరీచిమహర్షి కిఁ గళను, అత్రి కనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకుఁ గ్రియను, భృగు వునకు ఖ్యాతిని, వసిష్ఠున కరుంధతిని, అధర్వునకు శాంతిని నొసంగి నిజకులాచారము ననుసరించి దివ్యవైభవముతో వివా హములు చేసివైచెను. పిదపఁ దొమ్మ్మ ద్రమకూఁతుండ్రను దొమ్మండ్రల్లుండ్రకు నొప్పఁ జెప్పి సకలసత్కారములతో వారి వారిని వారివారియిండ్లకుఁ బంపివేసి దేవహూతీకర్దములు సుతుఁ డగుకపిలుని గనిపెట్టుకొని యింట నుండిరి.

### కర్దముఁడు మోక్షమునందుట

కర్దముఁడు కొంతకాలమునకు దేవోత్తముఁ డగువిష్ణుఁడు తనమందిరమున నవతరించి వసించియుండుట తన చిత్తమున నెఱింగి వివిక్తస్థలమునకుఁ జని యచటఁ గపిలునకు వందన మాచ రించి యిట్లు పలికెను. “దేవాదిదేవా! ఆదివిష్ణుఁడ వగునీవు నాయింటఁ బుట్టితివి. సంసారచక్రమునఁ బడి తిరుగుచు గ్రా

ష్యుల మయినమావర్తనములను గణింపక తొల్లి నీ వానతిచ్చి నట్లే నాయింటఁ బుట్టితివి. నీవు నాకుఁ బుట్టుటచే నేను ఋణత్రయము నీఁగఁగంటిని. నీపాదారవిందములు నాడెందమునఁ జేర్చి సుఖములఁ బోఁద్రోలి యేకాంతికుఁడ నగుదును." కపిలుఁడది విని "మునీంద్రా! నావచనము తప్పక నీ కిట్లు జనించితిని. తత్త్వజ్ఞానము సకలమునులకుఁ దెలిపెదను. నీవు సన్న్యస్తచిత్తుఁడవై మోహముఁ బాసి భక్తిచే మోక్షము నందుము. పరమేశుఁడను పరంజ్యోతిని నగునన్ను మనమున నిలిపి మోక్షము నందెద"వని బోధించెను.

కర్దముఁడు కపిల దేవునికిఁ బ్రదక్షిణము చేసి నమస్కరించి యిలు వెడలి మునిగణసేవిత మగువనమునకుఁ జని మౌనమున నిస్సంగుఁడై, ఆత్మైకశరణతత్పరుఁడై పరబ్రహ్మమునఁ జిత్తము నిలిపి సర్వసముఁడై సర్వము వాసుదేవమయముగాఁ దెలిసి భక్తియోగమున భాగవతగతి నందెను. ఇట్లు కర్దమప్రజాపతి దేవదేవుని కరుణచే మోక్షలక్ష్మిని జూఱగొని యాచంద్రార్కవిఖ్యాతి నార్జించెను.

# గర్గుఁడు

సీ. తప్తకాంచనవర్ణ తతజటాజూటుండు
బహువేదవేదాంగపారగుండు
గానపూర్ణుఁడు శరత్కాలాంబుజాతనేత్రుండు
శరదిందుసన్నిభసాదుముఖుఁడు
బ్రహ్మతేజుండు ధూర్జటిమూర్తిశిష్యుండు
బహుశిష్యసందోహపరిష్కృతుండు
రమణీయసాహిత్యసరస్వతీకంఠుండు
హరిశుద్ధభక్తుండు పరమయోగి
సకలసిద్ధాంతశాస్త్రవిశారదుండు
మాధవపదాంబుజాసక్తమానసుండు
సర్వజ్ఞుఁడును సిద్ధేశుండు సర్వదర్శి”
గర్గఋషిఁ గొల్వ నగు నపవర్గసుఖము.

(బ్రహ్మవైవర్తపురాణము. కృష్ణజన్మఖండము, ౨ అ.)

*గర్గుఁడు బాల్యమునుండియు శివునిఁ గొలిచి యాతని కటాక్షము గడించి యాతనినే గురువుగా వరించి సకలవిద్యలు నేర్చెను. ఆతఁడు మూర్తి గైకొన్న తేజస్సమూహమువలెఁ గరుడుగట్టిన శ్రుతిసారముపగిది దశదిశలు వెలుఁగఁజేయుచుఁ దన్నాశ్రయించినవారి కెల్లరకు సంసారతాపత్రయములఁ బోఁగొట్టుచు విరాజిల్లుచుండెను.

---

*గర్గుఁడు బ్రహ్మమానసపుత్రులలో నొకఁడు. అంగిరసుఁ డితనితండ్రి కొడుకని కల్పద్రుమకోశము.

"గర్గుఁడు సకలారాధిత
భర్గుఁడు దూరీకృతారివర్గుఁడు మునిసం
సర్గుఁడు కలిత శ్రేయో
మార్గుఁడు" అనఁ గీర్తిఁ గని యాతఁడు

అనేకవేలు శిష్యులు వచ్చి తన్నాశ్రయింపఁగా వారికి వేదశాస్త్రములు చెప్పుకొనుచు మహామహుఁడై యుండెను.

ఇట్లుండ హైహయవంశీయు లగుక్షత్రియులు, సమస్త యాదవులు, మఱికొందఱో క్షత్రియవంశజులు తమకుఁ గులగురువుగ నుండుము అని వచ్చి గర్గు నర్థించిరి. గర్గుఁ డంగీకరించి యా యావంశజుల కెల్లరకును గులగురువై వారిక్షేమముఁ గోరుచు వారిచే మన్ననలందుచుండెను.

## గర్గుఁడు కృష్ణబలరాములకు జాతకర్మాదు లొనరించుట

దేవకీవసుదేవులచే రహస్యముగా నియుక్తుఁడై గర్గమహర్షి శిష్యసమేతుఁడై వ్రేపల్లెకుఁ జని నందునిమందిరమున కరిగెను. అపుడు యశోద శ్రీకృష్ణునకుఁ బాలిచ్చుచు నొకకనకాసనమునఁ గూర్చుండి యుండెను. సశిష్యుఁ డగుమహర్షిని జూచి యశోద యమితానంద మంది వారి కర్ఘ్యపాద్యాదులను, ఆసనములను సమకూర్చి తనచిన్నబిడ్డనిచే నాతనికి మ్రొక్కించి తాను వందనశతము లర్పించి యిట్లని పలికెను. "ఓఋషివర్యా! చెప్పఁదగుచోఁ దమనామధేయముఁ జెప్పి నన్నుఁ గటాక్షింపుము. నీవు నరరూపము ధరించిననారాయణుఁడవో శ్రీశుకుఁడవో యని నే ననుకొనుచున్నాను.

"భవదమోఘాంఘ్రి రేణుసంస్పర్శనమున
జన్మకోట్యార్జితాఘంబు సంక్షయించె
సంయమీంద్ర! నాపుట్టువు సఫలమయ్యె
ధన్య నతిమాన్య నధిక సౌజన్య నైతి.

భవదంఘ్రిజము సోఁకిన
నవనీతల మెల్లఁ బవిత్ర మగుఁ దత్క్షణమే
భవదీయాగమనముచే
భువి మద్దేహంబు తీర్థభూతం బయ్యెన్.

శ్రుతులయం దెవ్వ రధిక విశ్రుతి వహించి
గట్టిశ్రుతిసారభూతమహాజనంబు
లందు నిన్నొక్కరుని గంటి నరిది నాదు
పూర్వపుణ్యమహోదయంబున మహాత్మ!"

(బ్రహ్మకైవర్తపురాణము. కృష్ణజన్మఖండము.)

మహాత్మా! బ్రాహ్మణాశీర్వచనము పూర్ణస్వస్త్యయనము కావున, నీవును శిష్యులును నాయీచిన్నికుమారుని దీర్ఘాయురుపేతునిగా నాశీర్వదింపుఁ" డని ప్రార్థించెను. గర్గుఁడు "తల్లీ! నేను గర్గుఁ డను ఋషిని. వసుదేవునిపురోహితుఁడను. నీ కేకాంతముగా సర్వవిషయములు చెప్పెద" ననెను. ఇంతలో నందుఁడు విచ్చేసి సశిష్యుఁ డగుఋషివరునకు సాష్టాంగనమస్కారము లొనరించి సన్మానించెను. పిదప నందుని యశోదను రహస్యముగఁ బిలిచి వారితో గర్గమహర్షి యిట్లనెను: "మీచిన్నకుమారుఁడు వసుదేవునిపుత్త్రుఁడు. రోహిణీపుత్త్రుఁ డీతని కన్న. కంసభయమున నితనిఁ దెచ్చి వసుదేవుఁడు రహస్యభంగి నిట నుంచి నీకుఁ బుట్టిన పుత్త్రి నెత్తుకొని మధురాపురి కేఁగెను.

ఇపుడు వసుదేవుఁడు నన్నీబాలునికి విధివిధానముగ అన్నప్రాశన, జాతకర్మనామకర్మాదు లొనరింపఁ బంపినాఁడు. ఈబాలుఁడు పరబ్రహ్మము. ఈరూపమున దుష్టసంహారార్థము శిష్టసంరక్షణార్థము నుద్భవించినాఁడు. రాధేశ్వరుఁడు, భార్గవీకాంతుఁడు, నలినాక్షుఁడు, నరనారాయణులు, కపిలాదికనారాయణాంశజాతులందఱు నొకరాశియై మూర్తీభవించి యీబాలుఁ డయిరి. ఈతఁడు పుట్టఁగనే దేవకీవసుదేవులకు నిజరూపముఁ జూపియున్నాఁడు. ఈతనికిఁ బ్రతియుగమున వర్ణభేదము, నామభేదము నుండును. కృతయుగమున శ్వేతవర్ణుఁడై త్రేతాయుగమున రక్తవర్ణుఁడై ద్వాపరమునఁ బీతవర్ణుఁడై యుండును. ఇపుడు కృష్ణవర్ణముఁ దాల్చుటచేఁ గృష్ణుఁ డనఁ బరగు. మఱియు నోనందమహోపలారా! కకారము బ్రహ్మవాచకము, ఋకార మనంతవాచకము, షకారము శంకరవాచకము, ణకారము ధర్మవాచకము, అకారము విష్ణువాచకము, విసర్గము నరనారాయణార్థవాచకము. మఱియు, కృషి యనునది నిర్వాణవచనము. ణకారము మోక్షవాచకము, అకారము విమలాత్మధాతృవచనము. ఇంకను, కృషి నిశ్శేషవాచకపరము, ణకారము భక్తివాచకము, అకారము ధాతృవచనము. ఇంతేకాదు. కృషి కర్మ నిర్మూలవచనము. ణకారము దాస్యవాచకము, అకారము ప్రాప్తివచనము. ఇన్నివిధములఁ గృష్ణనామము సర్వశక్తియుతము. ఈనామము నుచ్చరించుట వలనిఫల మనంతము.

వల్లవేంద్రా! ఈబాలునకు శ్రీకృష్ణుఁడు, పీతాంబరుఁడు, కంసధ్వంసి, విష్టరశ్రవుఁడు, దేవకీనందనుఁడు, శ్రీమంతుఁడు,

యశోదానందనుఁడు, హరి, సనాతనుఁడు, అచ్యుతుఁడు, విష్ణుఁడు, సర్వేశ్వరుఁడు, సర్వరూపధరుఁడు, సర్వాధారుఁడు, సర్వగతి, సర్వకారణకారణుఁడు, పరిపూర్ణతముఁడు, పరబ్రహ్మ, గోవిందుఁడు, గరుడధ్వజుఁడు, రాధాబంధుఁడు, రాధికాంతరాత్మ, రాధికాజీవనుఁడు మున్నగుశుభనామములు వేదములందు వినఁబడును. ఈనామములు సర్వమంగళప్రదములు. సర్వపాపప్రణాశకములు, జన్మమృత్యుజరావ్యాధినివారణములు.

మఱి నీజ్యేష్ఠపుత్రునినామము లెఱింగించెద. వినుము. గర్భసంకర్షణమున నాతనికి సంకర్షణుఁ డనిపేరు. వేదములం దీతని కంతు లేకపోవుటచే అనంతుఁడు. బలవిశేషమున బలదేవుఁ డనియు, హలధారణమున హలియనియు, నీలచేలధారి యగుటను నీలాంబరుఁ డనియు, ముసలమును ధరించువాఁ డగుట ముసలి యనియు, నీతనికిఁ బేళ్లు. రౌహిణేయుఁడు, రేవతీనాథుఁడు మున్నగు నామములు నీతనికిఁ గలవు."

పిదప, గర్గుఁడు రాధాకృష్ణులు గోలోకవాసులగు శ్రీదామ రాధిక లనియు నారే యిప్పు డిటు జనించి రనియుఁ జెప్పి కృష్ణుఁ డాజన్మమునఁ జేయఁబోవుసమస్తకార్యములను బూస గ్రుచ్చినట్లు తనదివ్యదృష్టిచేఁ దెలిసికొని వారికి వినిపించెను. పిదప బలరామకృష్ణులకు నిర్వర్తింపవలసినజాతకర్మములకు శుభముహూర్తమును నిశ్చయించి రహస్యమందిరము నుండి బాహ్యమందిరమునకు వచ్చి గర్గుఁడు సుఖాసీనుఁ డయ్యెను.

గర్గమహర్షి రాక విని నందవ్రజమునఁ గలగోపగోపికలు బాలకబాలికాసహితముగా గర్గుని దర్శనము చేసికొనుటకు నందమందిరమునకు వచ్చిరి. వచ్చి వారు:

"సలలితబ్రహ్మతేజంబున బ్రకాశము
ధ్యానస్థభావ మూపంగ నలరువాని
వెలుపొప్పఁ గాంచనసింహాసనంబునందు
యోగముద్ర ధరించి యున్నవాని
జ్ఞానదృష్టిచే నెల్ల భూతభవ్య
నిత్యదర్శకుఁడై తెలియువాని
సత్యసంధుఁడై సంద సదనపరిచ్ఛందం
బంధిలంబుగ విలోకించువాని
సిద్ధమంత్రప్రభావసిద్ధికలనఁ
గాంక్షితో మని గోరెందుఁ గాంచువాని
నఖిలశిష్యగణాన్వితుం డైనవాని
గర్గు నజితాఖిలాంతస్వాంతుఁ గనిరి.

అనినప వా రెల్లరు నాతనికి సమస్కరించి యాతనిదీవనలంకొని తమతమగృహముల నరిగిరి.

సందుఁడు గర్గమహర్షి యేర్పఱచిన శుభముహూర్తమున సకల సమస్తరాజబంధుమిత్రులను విప్రులను బిలిపించి సమస్త వైభవోపేతముగా శ్రీకృష్ణునకు నామకరణాన్నప్రాశనాదులు చేయించి సర్వసత్కారపరంపరలచే నెల్లరను సంతోషపఱిచెను.

గర్గుఁడు శ్రీకృష్ణుని స్తుతించుట

ఒకనాఁడు గర్గమహర్షి శ్రీకృష్ణు నేకాంతమునఁ గాంచుకొని పోయి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి హర్షపులకలు వొడమ భక్తిసమాశ్రితమ్మకదరుఁడై నిటలమున నంజలి ఘటించి బాహ్యాభ్యంతరములయం దమ్మహనీయమూర్తినే యవలోకించుచు నిట్లు స్తుతించెను. "శ్రీకృష్ణా! జగదీశా! శ్రితజనమం

దారా! నీపదములయందు నిశ్చలమైనభక్తిని నీదాస్యమును నాకు నిత్యమొసంగుము. అంతకుమించి ధనధాన్యసంపదలు నాకేమియు వలదు. నాకు సాలోక్యసామీప్యముక్తులే వలదు. నాకు వలసినది నీదివ్యపాదార్చనము. ఈశ్వరుఁడు నిన్ను భజించియే సర్వజ్ఞుఁడై మృత్యుంజయుఁడై విలసిల్లెను. బ్రహ్మదేవుఁడు నీపాదపద్మములను భజించియే సృష్టికర్త యయ్యెను. ధర్ముఁడు నీపాదములు గొల్చియే కర్మసాక్షియై యఖిలలోకసంరక్షకుఁ డయ్యెను. శేషుఁడు నీపాదసేవ చేసి ధర మోవఁ గలిగెను.” అని పెక్కు-భంగుల స్తుతించుగర్గునిఁ గని కృష్ణుఁడు భక్తవత్సలుఁడై “ఋషీంద్రా! నీకోరినట్లే నీమన మెల్లప్పుడు నాపాదపద్మములందే లగ్న మగుఁగాక” యని కటాక్షించి ప్రసాద మొసంగెను.

పిదప గర్గుఁడు కృష్ణునికడను నందయశోదలకడను సెలవు గైకొని శిష్యసహితుఁడై స్వీయాశ్రమపదమును బ్రవేశించి సుఖముండెను.

## గర్గుఁడు రామకృష్ణుల కుపనయనముఁ జేయుట

కొంతకాలమునకు గర్గమహర్షి తపము చాలించి కంసవధానంతరము శ్రీకృష్ణబలరాముల కుపనయనము చేయింప సమకట్టి దేవకీవసుదేవులకడకు సశిష్యుఁడై విచ్చేసెను. దేవకీవసుదేవులాతని నెంతయుఁ బూజించి యర్ఘ్యపాద్యాదులు, మధుపర్కము, కామధేనువుమున్నగువాని నొసంగిరి. గర్గుఁ డానందించి రామకృష్ణుల కుపనయనకాలము సమీపించుటచే నది నిర్వర్తింప విచ్చేసితి ననియు ముహూర్తము చెప్పి యాకాలమునకు సమస్తపదా

ర్థములు సిద్ధము చేయు మని వసుదేవునికిఁ జెప్పెను. తదనంతరము కృష్ణుఁడు స్మరించినంతమాత్రమున సర్వదేవతలు ఋషిపుంగవులు బంధుమిత్రులు నెల్లరు విచ్చేసిరి. గర్గుఁడు వసిష్ఠభరద్వాజాదిఋషిపుంగవుల యనుమతిఁ గొని బలరామకృష్ణుల నుపనయనసంస్కారము నిర్వర్తించి వారిని సాందీపని యను నుత్తమవిప్రునికి శిష్యుల నొనరించెను. ఉపనయనమహోత్సవము నిర్విఘ్నముగా నెఱవేఱినపిదప గర్గమహర్షి శిష్యసహితుఁడై సంభావన లంది నిజాశ్రమమున కేఁగి తపోధర్మము నిర్వర్తింపఁ దొడఁగెను.

### గర్గమహర్షి కార్తవీర్యార్జునుని మేలు కోరుట

హైహయవంశీయులు తమ కులగురు వగుగర్గమహర్షిని మిక్కిలి మన్నించి దైవముగాఁ జూచెడివారు. కార్తవీర్యార్జునుఁడు రాజ్యమునకు వచ్చినపిదప నాతనికి గొప్పవైరాగ్యము జనించెను. వనమున కరిగి తప మాచరించి యధ్యాత్మయోగసిద్ధి పొందెద నని యాతఁడు నిశ్చయించుకొనెను.

కార్తవీర్యుని నిశ్చయ మెఱిఁగినగర్గమహర్షి యాతఁ డేవిధమునఁ జెప్పినను రాజ్యము చేయనొల్లఁ డని తెలిసి యాతని క్షేమముఁ గోరి యిట్లుపలికెను. "ఓయీ! నీనిశ్చయముపట్ల నీకుఁ జలనము లేనిచో హరియవతారము, యోగతత్పరుఁడు నిర్జరమునిసేవితుఁడు నగుదత్తాత్రేయమహర్షిని విడువక సేవింపుము. ఆతఁడు నీకు సమస్తవరములు ప్రసాదింపఁగలసమర్థుఁడు. ఆతని నాశ్రయించియే తొల్లి రాజ్యభ్రష్టుఁడైన యింద్రుఁడు

తిరిగి స్వారాజ్యము నందఁగనెను." అని యింద్రునివృత్తాంత మంతయుఁ బూసగ్రుచ్చినట్లు గర్గుఁ డాతనికిఁ జెప్పెను. గర్గుని యీయుపదేశమును వినియే కార్తవీర్యుఁడు దత్తాత్రేయవర ప్రసాద మందఁగనెను.

దిగ్విజయియైన కార్తవీర్యార్జునుఁ డొకఁడు తెలియఁగని గర్వమున జమదగ్ని హోమధేనువును బలాత్కారముగాఁ గొనిరా సైన్యములఁ బంపుచుండెను గర్గమహర్షి యాతనిని వారించెను. కాని, యాతనికిఁ గీడుమూడుకాల మాసన్న మయియుండుటచే గర్గవచనములు వినక కార్తవీర్యార్జునుఁడు తుదను పరశురామునిచేతిలో మృతుఁ డయ్యెను. గర్గమహర్షి యాతనికిఁ గులగురువై మేలుకోరి చెప్పినమాట వినకపోయిన నెంతవాఁడైన నెంతవాఁడైన నగుఁగదా యనియెల్లరు ననుకొనిరి.

### గర్గునకుఁ గాలయవనుఁడు కలిగినవిధము

ఒకప్పుడు గర్గమహర్షి యాదవులలో నుండఁగా నొక యాదవుఁడు మిడిసిపాటున నాతనిఁ బరిహసించెను. గర్గుఁ డది సహింపఁజాలక "మూర్ఖులారా! మీమేలు కోరి మీకడ నున్న నన్నుఁ దెలిసికొనలేక పరిహసించుచుంటిరా?" యని యడిగెను. అందుల కాయాదవుఁడు "నీవు మాకు గురువవై యుండియుఁ బలుమాఱు జరాసంధాదులవలన మాకు బాధకలుగ నిచ్చుచుంటివి. నీవు స్త్రీవి కాని పురుషుఁడవు కా"వని మరల నిందించెను. యాదవు లెల్లరు నది విని నవ్విరి. అప్పు డాగర్గుఁడు

నారిగర్వమును హరించు కాలయవనుఁడు తనవలన జన్మించు ననియు నాతనివలన వారికి బహుబాధలు కలుగుననియు శపించెను. యాదవులు భయపడి యాతనిపాదములపైఁబడి క్షమింపఁ గోరిరి. అతఁడు దయదలఁచి కృష్ణుఁడుపాయాంతరమున నాతనిఁ జంపి వారికి మేలుకూర్చునని పలికి తనదారిఁ బోయెను. ఈసంగతి విని యాదవులపై శత్రుత్వము వహించినయొక యవనరాజు గర్గుని సేవించి యాతనిఁ దనయాలయమందలో నుంచి పూజించుచుండెను. ఆకాలమున నొక యప్సరస గర్గునికిఁ గాననై యాతనిమనసు హరించెను. గర్గుఁడు తాను యాదవుల కిచ్చిన శాపమును బురస్కరించుకొని తనకుఁ బరిచర్యచేయునాయప్సరస కొకపుత్రుని ననుగ్రహించెను. పిదప గర్గుఁడు నిజాశ్రమమునకు నప్సరస నిజలోకమునకుఁ బోయిరి. ఆయప్సరసకుఁ గల్గిన పుత్రుని యవనరాజు తనపుత్రునిగాఁ బెంచుకొని రాజ్యమొసంగెను. అతఁడే కాలయవనుఁ డనఁ బరగి నారదప్రేరితుఁడై యాదవులద్వారకానగరమును ముట్టడించి వారి ననేకవిధముల బాధించి తుదకుఁ గృష్ణుని మాయోపాయమునకు గుఱియై ముచికుందునికోపమున భస్మీభూతుఁ డయ్యెను.

### గర్గసంహిత

గర్గమహర్షి మహాధర్మప్రతిపాదకుఁడుగా ధర్మశాస్త్రముల వలనఁ దెలియుచున్నది. మహాధర్మప్రవక్తగా వృద్ధయాజ్ఞవల్క్యమున గర్గప్రశంస కలదు. గర్గునిధర్మసంహితకే గార్గ్య*

*గర్గుఁడు వేఱు గార్గ్యుఁడు వేఱు నని నిత్యాచారప్రదీప మనుధర్మశాస్త్రగ్రంథమునఁగలదు. కాని ఇది పొరపాటు. ఇరువురు నొకటే యని కాణేగా రభిప్రాయపడిరి.

మని పేరు. మఱియు, మితాక్షరము, స్మృతిచంద్రిక, గర్గసంహితనుండి యనేకశ్లోకము లుదాహరించియున్నవి.

"పతితాః స్త్రియస్త్యాజ్యా భర్తృవధప్రతిజ్ఞాయాం చ" మున్నగువాక్యములు గర్గసంహితనుండి విశ్వరూపుఁడు పేర్కొని యుండెను. ఇంతేకాక, గర్గమహర్షి యొకఖగోళశాస్త్రగ్రంథకర్తగా అపరాదిత్యుఁడు అపరార్క-యాజ్ఞవల్క్యవ్యాఖ్యానమునఁ బేర్కొనియున్నాఁడు. *ఈవిషయములన్నిటివలన గర్గమహర్షి కిఁ గలబహుశాస్త్రవేత్తృత్వము తేటతెల్లమగుచున్నది.

"గర్గుఁడు పరివేష్టితముని
పటుఁడు సంపాదితాపవర్గుఁడు భవనై
పుణుఁడు పరతత్త్వకళా
మార్గుఁడు" రక్షించుఁగాక! మమ్మెల్లప్రదుడున్.

(విష్ణుపురాణము. ౨. ౧౨౨)

---

*ఋతవంతుఁ డను ఋషి తనకుఁ గలిగినకుమారుఁడు దుశ్శీలుఁడై తనకవమానముఁ గొనితెచ్చుటకుఁ గారణ మేమని గర్గమహర్షి నడిగెను. గర్గుఁ డాతని నక్షత్రముఁ దెలిసికొని యది రేవతి యని రేవతీనక్షత్రమున నాతఁడు జనించుటచే నక్షత్రదోషమున నట్లయ్యెనని చెప్పినట్లు మార్కండేయపురాణమునఁగలదు. దీనివలన గర్గుఁడు జ్యోతిశ్శాస్త్రమునను దిట్టయని తెలియుచున్నది.

"గర్గ ఉవాచ : చతుష్షష్టాంగ మదదత్ కాలజ్ఞానం మమాద్భుతమ్,
సరస్వత్యాస్తటే తుష్టో (శివః) మనోయజ్ఞేన పాండవ."

అని వ్యాసభారతానుశాసనికపర్వమునఁ గలదు. దీనినిబట్టి గర్గమహర్షి చతుష్షష్టాంగ జ్యోతిషజ్ఞుని యని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

# గౌరముఖుఁడు

గౌరముఖుఁడు శమీకమహాముని శిష్యరత్నము. బాల్యము నుండియు శమీకముని నాశ్రయించి యాతఁడు సమస్త వేదశాస్త్రములు నభ్యసించి తపోధ్యానపరాయణుఁ డయ్యెను. తండ్రిమెడలో మృతసర్పమును బడవైచి పోయినాఁ డని శమీకపుత్రుఁ డగు శృంగి పరీక్షితుని శపించినపిదప శమీకుఁ డావృత్తాంత మెఱిఁగి విచారించి పరీక్షితున కావర్తమానము దెలిపి రమ్మని గౌరముఖుని బంపెను. గౌరముఖుఁడు పరీక్షిత్తున కావార్తఁ దెలిపి తక్షకవిషాగ్ని పాలుగాకమున్నే మోక్షసామ్రాజ్యమును బొందఁగను నుపాయ మూహించుకొమ్మని చెప్పి వచ్చి వేసెను.

### గౌరముఖుని పుణ్యాశ్రమము

కాలక్రమమున గురుసపర్యచే బ్రహ్మవిద్యానిధియై గురు ననుమతిని వేఱొక యాశ్రమమును నిర్మించుకొని తనకడఁ జేరిన మునికుమారులను శిష్యులుగా నంగీకరించి తపోజీవనమున గౌరముఖుఁడు దివ్యతేజోనిధియయ్యెను.

గౌరముఖుని పుణ్యాశ్రమము మోక్షలక్ష్మికిఁ బుట్టిన యిల్లైన సుధాసముద్రమువలె నుండెను. ఆయాశ్రమవనముల మునికుమారులు వచ్చి గురువులుచేయు యజ్ఞయాగములకు సమిధలు కావలయునని కోరఁగనే చెట్లమీఁదనుండి శాఖామృగ

ములు సమిధ లందిచ్చును. చల్లని చెట్టునీడలఁ గూర్చుండి బ్రహ్మచారులు వేదములందలి పనసలు చెప్పకొనుచుండఁగా నెటనైన వారు మొదలు మఱచిన నందలి చిలుకవటువు లందిచ్చును. అచటి యుద్గాతలతోఁగూడి చక్కని స్వరములతోఁ గోయిలలు దేవతాహ్వానము లొనరించును. అచటి మునిపత్నులు లెమ్మఁ జూచి బెదరి తల్లులవెనుకఁ జేరులేడిపిల్లలకు లేఁత తృణకణము లందొత్తురు. ఆమునిపత్నులు బిరాడెలతో బృందావనములకు నీరుపోయునప్పుడు భూదేవి వారి యడుగులకు మడుఁగు లొత్తుచున్నదో యన్నట్లు వారి పాదములందలి గ్రేవ్రేళ్ల కాంతులు ముందు ప్రసరించుచుండును.

అచ్చటి వృక్షములయాకులు పానపాత్రములకుఁ బనికి రాకుండఁ బోదు మనుభయమున ముదురుటకు వెనుదీయును. తమసౌరభము కోసివచ్చునని దేవతాపూజాసమయము వచ్చువఱకు నందలిపూలు వికసింపనే వికసింపవు. అచటి చెట్ల కొమ్మలకు ఋషిపత్నులు కట్టిన మడిచీరలు చిరిఁగిపోవు నను భయమున నవి యాఱి ఋషిపత్నులు విప్పకొనిపోవువఱకుఁ జెట్లు కదలనే కదలవు.

అందలి మునీశ్వరులు నిష్కామకర్మములే చేయుచుఁ బ్రత్యక్షాగ్నులవలె, జగత్ప్రాణిమిత్రులై, తేజోభరితులై, సదాశివతనులై విహరింతురు. అందలిమును లందఱకును గౌరముఖమహర్షి పెద్ద, గురువు, దైవము.

గౌరముఖుఁ డొకచల్లనిచెట్టునీడను దనహృదయము మను మడిలో మొలచి నలువైపుల విస్తరించిన కారుణ్య లతల విధ

మునఁ గెంజడలు మనోహరములై యుండ, సత్త్వగుణమే మొడలెల్ల దట్టముగా నావరించి యున్నట్లు దేహమంతయుఁ దెల్లని విభూతి కానవచ్చుచుండ, నిరంతరము పురశ్చరణ చేసి మంత్రదేవతను మెప్పించి యామె కంఠహారమును బహూకృతిగాఁ గైకొన్నట్లొప్పు రుద్రాక్షమాలికాభరణము మెఱయుచుండ, మిక్కుట మగు తపమునఁ గోటికిఁ బడగెత్తినట్లు ప్రక్క బద్ధకౌపీన మగుదండము నొప్ప, సకలపుణ్యతీర్థములు సంగ్రహించి సూక్ష్మరూపము వహించి వచ్చిన బ్రహ్మాండమురీతిఁ గమండలువు దండ నుండ, శిష్యులకుఁ బరతత్త్వము బోధ చేయుచుండెను.

### దుర్జయుఁడనుమహారాజు ససైన్యుఁడై వచ్చుట

ఆసమయమున దుర్జయుఁ డనుమహారాజు సైన్యసమేతుఁడై యావనమున వేఁటాడ వచ్చి వివిధజంతువుల వేఁటాడి యలసి మునిసందర్శనము చేసికొని పోదమని యాశ్రమదేశమునకు వచ్చెను. సైన్యపరివారములను దూరమున నిలిపి దుర్జయుఁడు ముందుకు వచ్చి గౌరముఖునికి సాష్టాంగవందనములు చేసి నిలిచెను.

గౌరముఖుఁ డాతని నెంతయు నాదరించి యర్ఘ్యపాద్యాదు లొసఁగి నాఁటికిఁ దనయాశ్రమమున నిలిచి స్నానపానముల సేద దేఱి పోవలసినదని కోరెను. దుర్జయుఁ డసూయపడి యామునియొక్కడ ససైన్యుఁ డగు తనకు విందు చేయఁగలుగుటెక్కడ యని యాతనిపస దెలిసికొని పరాభవింత మనుకొని యట్లే యనెను.

## గౌరముఖునకు విష్ణువు మణి నిచ్చుట

గౌరముఖుఁడు తాను గంగ కేఁగి స్నానము చేసి వచ్చెదను విడిసియుండుమని రాజుతోఁ జెప్పి గంగానది కేఁగి యట శ్రీహరి నిట్లు ప్రార్థించెను.

“జలరూపాయ చరాచరాత్మక జగత్సంస్థాయ లక్ష్మీమహీ
లలనేశాయ కరాళకాళియఫణాలాస్యాయ దేవోత్తమా
య లయోత్పత్తి వివర్జితాయ సుజనాయత్తాంతరంగాయ కే
వల కారుణ్య కటాక్ష వీక్షణ పరీవాహాయ తుభ్యం నమః.

(వరాహ పురాణము. ప. ౧౦౬.)

దేవా! ఓంకారము నీవ. భూర్భువస్స్వరాదిలోకములు నీవ. విశ్వప్రపంచము నీవ. నీవలననే ఋగ్యజుస్సామాథర్వణములు మున్నగు సమస్తము జనించె. నన్నుఁ గృపఁజూచి సైన్యసమేతుఁ డగురాజున కాతిథ్య మీఁగల సామర్థ్యమి”మ్మని కోరెను. దయాసముద్రుఁ డగు శ్రీహరి ప్రత్యక్షమై గౌరముఖుని దీవించి యొక రత్నమిచ్చి దానివలన నన్నియు సమకూరునని చెప్పి యదృశ్యుఁ డయ్యెను.

గౌరముఖుఁ డామణినిఁ గైకొని పూజించి యాశ్రమమునకు వచ్చుసరి కది యొక గొప్ప పట్టణమయ్యెను. అందుఁ గని విని యెఱుఁగనంత మనోహరములైన భవనములు మహాభోగములతో నలరారెను. గౌరముఖుఁడు రాజును సైనికులను ఆభవనముల విడియుఁ డనికోరెను. మగధయుఁ డాశ్చర్యమంది సైనికులతో నాయా మందిరముల నాక్రమించెను.

పిదప గౌరముఖుఁడు మణిని దలఁచినంతనే సంపెఁగ నూనెలు, గంధానులేపనములు, దివ్యాంబరాభరణములు, నీరాజనభాజనములు, రత్నకంబళ్లు మున్నగు సమస్తవస్తుసంచయములు గొని వేలకు వేలుగా నప్సరసలవలె సుందరీమణు లగు యువతు లవతరించి యరుదెంచి సమస్తజనులకు సమస్తవిధములైన స్నానపానకృత్యములు శరవేగమున నిర్వర్తించిరి. తదనంతరము చీఁకటిపడినవెనుకఁ బ్రతివానికి నొకదివ్యపర్యంకము, ప్రతివానికి వలపులు గులుకు నొక్కచిగురుబోణి యమరెను. దుర్జయుఁడు, నాతనిపరివారములోఁ బ్రతివ్యక్తి నారేయెల్ల సరససంభాషణములతోడను, యిష్టోపభోగములతోడను బ్రహ్మానందమంది నిద్రించిరి.

మఱునాఁ డుదయమున లేచి కాలకృత్యముల నెఱవేర్చి దుర్జయుఁడు గౌరముఖమహర్షి కడకు వచ్చి నమస్కరించి నిలిచినంతనే యాసమస్తసౌధాదికములు నంతర్హితము లై పోయెను.

### దుర్జయుఁడు మణికొఱకు యుద్ధము చేయుట.

తరువాత దుర్జయుఁడు సైన్యపరివారసమేతుఁ డై గౌరముఖునికడ సెలవుఁ గైకొని తన పట్టణమున కేఁగ నాశ్రమము బయటికి వచ్చెను. అపు డాతని కాఋషిమణిని గొనిపోవ మహాకాంక్ష జనించెను. వెంటనే యాతఁడు తన మంత్రిని బిలిచి ఋషికడ కేఁగి యేమడిగిన నది యిచ్చెదను, ఆమణిని మాకిమ్మని నామాటగా నడిగి రమ్మని పంపెను. మంత్రి గౌరముఖునికడ కేఁగి నయమున భయమున మణి నడిగెను. ఈయ

నిచో ముని కనేకబాధలు కలుగు నని హెచ్చరించెను. అంత గౌరముఖుఁడు :

"దుష్టచరిత్రు లైననృపతుల్ ధర యేలుటకంటెఁ గల్గునే
కష్టము శిష్టలోకము సుఖస్థితి నుండదు గాన నిట్టి ష
ష్టాష్టక మెట్టుపుట్టె నకటా వికటాలపితంబు లేటికిన్
భ్రష్ట! పోకాలి పో" ... ...

యన్మని పలికిన మంత్రి భయపడి పోయి దుర్జయునితో జరిగినసంగతి విన్నవించెను.

దుర్జయుఁడు కోపించి నీలుఁ డను సేనాపతిఁ బిలిచి సైన్యముతో నేఁగి మునికడనుండి రత్నమును బలవంతముగాఁ గొని తెమ్మని పంపెను. నీలుఁడు బయలుదేఱి వెళ్లి మున్యాశ్రమము సమీపింపఁగనే రత్నము వలన నిర్యత్నముగ ననేకవేలసైనికు లుద్భవించి నీలుని నీలునిసైన్యమును క్షణములో నశింపఁజేసెను. ఇది విని దుర్జయుఁడే సమస్తసైన్యములను దీసికొని స్వయముగా యుద్ధమునకు బయలుదేఱి వచ్చి రత్నసంభవసైన్యములను జెల్లా చెదరు చేయుచు ఘోరయుద్ధ మొనరించుచుండెను.

అపుడు గౌరముఖ మహర్షి తనయిలవేలుపు నాత్మరక్షకుఁడు నగు విష్ణుమూర్తిని దలఁపఁగా నాతని యాజ్ఞ వలన విష్ణు చక్రము విచ్చేసి క్షణమాత్రములో దుర్జయుని నాతని సమస్త సైన్యములను నాశనముచేసి తిరిగి విష్ణుమూర్తిని జేరెను. విష్ణు వచటికి విచ్చేసి గౌరముఖునితో "మునీశ్వరా! నిమిషమాత్రములో నాచక్ర మిచట శత్రువుల నుఱుమాడినకారణమున నీప్రదేశము నైమిష

మనఁ బరఁగు. నే నిచట యజ్ఞపురుషుఁడనై నివసింతును.” అని చెప్పి యంతర్హితుం డయ్యెను. గౌరముఖుం డానందించి శిష్య సమేతుండై యథారీతి దపమాచరించుచుండెను.

### గౌరముఖుండు మార్కండేయుని బోధనఁ గాంచుట

ఇట్లుండ కొంతకాలమైనపిదప గౌరముఖమహర్షి విష్ణు పూజానిమిత్తము తపఃఫలదకల్పభూజ మనందగు ప్రభాస మను సోమతీర్థరాజమున కేఁగి యటఁగల కృష్ణమూర్తిని బూజించు చుండఁగా నొకనాఁడు మార్కండేయమహర్షి యచటికి విచ్చే సెను. గౌరముఖుం డాతని కెదు రేఁగి సాష్టాంగనమస్కారము లొనరించి తనయాశ్రమమునకుఁ దెచ్చి దర్భాసనమునఁ గూర్చుండఁ జేసి నానావిధములగు నతిథిపూజలు చేసి ముకుళిత హస్తుండై ముందట నిలిచి “మహామహా! నన్నిట్లు కటాక్షించి విచ్చేసినపని యేమో” మని యడిగెను. మార్కండేయుఁ డానందించి “ఋషీంద్రా! మీవంటి ఋషివరులను గాంచుటయే మాకార్యము. నీకేమైన సందేహము లున్న నడుగుము. వానిం దీర్చి పోవుదునని దయతోఁ బలికెను. గౌరముఖుఁడు నమస్కరించి “అయ్యా! వేదవేద్యులు పితరులు కల రందురు. వా రెవరు? ఎట్టివారు? దయతోఁ దెలుపు” మని కోరెను.

మార్కండేయుఁ డిట్లు సమాధానమిచ్చెను. “ఆర్యా! విశ్వమునకు విష్ణువు తండ్రి. అతనివలన బ్రహ్మ జనించెను. బ్రహ్మ యేడుగురు ఋషుల సృజించి వారిఁ గని తన్నుఁ బూజింపుఁ డని కోరెను. వారటుచేయక ఆత్మలోఁ బరమాత్ముఁ

గనుచుండిరి. బ్రహ్మ వారిపైఁ గోపించి మీ బ్రహ్మ విజ్ఞానగర్వము పదటిపాలగుఁగాక యని శపించెను. ఆయేడుగురు ఋషులు వంశకరులగు తనయులఁ గాంచి విమానస్థులై స్వర్గమునకుఁ బోయిరి. వారి తనయులు వారికి శ్రాద్ధమూలమునఁ దృప్తిఁ గూర్చుచుండిరి. ఇట్లు సుపుత్రమూలమున నాయేడ్వురు స్వర్గమున సుఖముండిరి. వీరిలో అమూర్తులు మువ్వురు. సమూర్తులు నలుగురు. వీరు దేవతలకుఁ బితరులై యాదేవతలు పూజించు నాలుయుగములు సనాతనలోకమున వసించి పిదప బ్రహ్మవాదులై జనించి తమపూర్వసాంఖ్యయోగమునఁ గొంత కాలము వర్తించి పునరావృత్తిరహిత మగు యోగసిద్ధిం గని యోగబలమున సకలయోగులను యోగాభివృద్ధిఁ గాంచుచుందురు. అందుచే వారికి శ్రాద్ధము లొనరించుచుండవలయును. ఇది ప్రథమ పితృసర్గము. మఱి యనేకవిధములఁ బితరులు సప్తలోకముల నిలిచియుందురు. భూలోకవాసు లగుజనులు భువర్లోకవాసు లగుపితరులను బూజింతురు. భువర్లోకవాసులు మరీచ్యాదు లైన సువర్లోకవాసులు కల్పవాసిసంజ్ఞు లైన మహాలోకవాసులు సనకాదు లైనజనలోకవాసు లగుపితరులను గొలుతురు. జనలోకవాసులు వైరాజు లైనతపోలోకవాసులు సత్యలోకవాసులగు పితృగణములను సేవించెదరు.

వసుసాధ్య రుద్రాదిత్యాశ్విమరుదృషులు, వారికూఁతుండ్రకుఁబుట్టినవారు, వసిష్ఠ బ్రహ్మపితరులైన అగ్నిష్వాత్తాదులు బ్రహ్మక్షత్రవైశ్యులకు సమానపూజనీయులు. భట్టారకా! ఎట్టి

వారికైనను బితృసర్గము సమస్తము వివరించుట సాధ్యముకాదు. కాన, నేను సంక్షేపముగాఁ జెప్పితిని.

ఆయాపితృదేవతల నెప్పుడెప్పుడు పూజింపవలెనన్న— వ్యతీపాతము, అయనము, విషువత్తు, చంద్ర సూర్యగ్రహణములు, సంక్రమణము మున్నగు పుణ్యవేళలందు, నక్షత్రగ్రహపీడాసమయములందు, చెడ్డకలలు వచ్చినపుడు, నూతనధాన్యములు వచ్చినపుడు, విశిష్ట ద్రవ్య పాత్ర లాభంబులు కలిగినపుడు, గంగాదిమహాతీర్థముల కేఁగినయపుడు యథాశక్తి శ్రాద్ధకర్మలు చేయవలెను. ధనము లేని వారు తిలతర్పణము లిచ్చిన శ్రాద్ధఫలము వారికి లభించును. అదియు సాధ్యముకానివారు ఆవునకొకపూఁటకు సరిపడు గడ్డి నొసఁగినచో శ్రాద్ధఫలము సిద్ధించును. అదియుఁ జేయలేనివారు వనమున కేఁగి సూర్యాది లోకపాలురు సాక్షులుగాఁ జేతులు పైకెత్తి బిగ్గఱగాఁ దమ యసమర్థతం దెలుపు కొన్నఁ బితృదేవతలు తృప్తులగుదురు.

యోగి, యతి, శిష్యుఁడు, సోమయాజి, ఋత్విజుఁడు, సోదరపుత్రుఁడు, అల్లుఁడు, మేనమామ మున్నగువారు పైతృకకర్మకు యోగ్యులు. నపుంసకుఁడు, దొంగ, నిందితుఁడు, రోగి, గ్రామయాచకుఁడు మున్నగువా రిందుల 'కనర్హులు''.

పిదప, మార్కండేయుఁడు గౌరముఖునకు గౌరముఖుఁడొనర్చిన పితృదేవతాపూజాఫలముగా గత నూఱుజన్మముల వృత్తాంతముఁ దెలియఁ జేసెను. అపుడు గౌరముఖుఁడు బ్రహ్మచే శాపమునందిన మరీచ్యాదిమానసపుత్రు లేడ్వురలో

భృగుఁ డౌనఁ డనియు, ఆభృగునివంశము వాఁడే గౌరముఖుఁ డనియుఁ దెలిసికొనెను. అనంతరము మార్కండేయుఁ డాతని నాశీర్వదించి త్వరలోనే విష్ణుమూర్తిలో నైక్యమై ముక్తిఁ గను నుపాయముఁ దెలిపి వెడలిపోయెను.

## గౌరముఖుని సాయుజ్యప్రాప్తి

గౌరముఖుఁ డధికానందమునఁ బితృదేవతాపూజ లనేక సంవత్సరము లొనరించి ప్రభాసతీర్థవాసుఁ డగు శ్రీహరినే మనమునఁ దలఁచుచు మహాతప మొనరించెను. పిదప నొకనాఁడు గౌరముఖుఁడు :

"జలజగర్భుని చదువుల చెఱ వీడ్కొలు మంథానవసుధరఘరంధరుండు
విషధి మునింగిన విశ్వంభరకుఁ దేవ సుమనోవిపక్షుచక్షోవిదారి
కుంభినీ నభములు కొలిచిన కొలగోల పార్థివరుధిరతర్పణ పరుండు
లంకాధిపతితలలకు గండకత్తెర రేవతీహృదయరాజీవహేళి
త్రిపురవనితల యీలువు తెక్కలీఁడు ఖురఘురట్టవిఘట్టితక్షోణితలుఁడు
చింతితఫలప్రదాత రక్షించుఁగాతె! న న్ననుచు భక్తి రెట్టింప సన్నుతింప.
(వరాహపురాణము ౫. ౫౬.)

దయామయుఁడు, భక్తవత్సలుఁడు నైన శ్రీహరి కోటిసూర్య దివ్య ప్రభతో నాతనియెదుటఁ బ్రత్యక్షమయ్యెను. వెంటనే గౌరముఖుఁడు యోగబలమున శ్రీహరిలో నైక్యమై పోయెను. శ్రీహరి భక్తాగ్రగణ్యు నట్లు తనలోఁ గలుపుకొని దివ్యతేజమున నదృశ్యుఁ డయ్యెను.

# జాబాలి

సామవేదోపనిషత్తులలో జాబాల మనునొకయుపనిషత్తు కలదు. ఈ యుపనిషత్తును బ్రతిపాదించిన మహానుభావుఁడే జాబాలి. జాబాలినిబట్టి దీనికి జాబాల్యుపనిషత్తనియుఁ బేరు. మఱియు నీతఁ డుపస్మృతికర్తలలో నొకఁడు. దశరథుని క్షేమముఁ గోరిన యాతనిగురువులలో నీతఁ డొకఁడు.

## జననము

మహానదులయు, మహాపురుషులయు జన్మవృత్తాంతములు చిత్రములుగా నుండును. జబాల యనువిప్రస్త్రీకి దేవతావరప్రసాదమునఁ గన్యాత్వదశయందే యీతఁడు జన్మించెను. తల్లి పేరునుబట్టి యీతనికి జాబాలి యనునామకరణ మయ్యెను.

జబాల తనకుమారుని యుక్తవయసు రాఁగానే హారిద్రుమతుఁ డనుగురువున కొప్పగించెను. ఆగురువును గొంతకాల మాతనిచేఁ దన శుశ్రూషఁ గొనుచుకొని పిదప నాతనికి బ్రహ్మవిద్యాబోధ కర్హునిఁ జేయు నుపనయనము నొనరింపఁ దలఁచి యాతని కులగోత్రనామములు నడిగెను. ఆతఁడు తనకుఁ దెలియదని చెప్పెను. పోయి మీయమ్మ నడిగి తెలిసికొని రమ్మని గురువు పంపెను. జాబాలి తల్లి నడుగ నామె తనకుఁ బతియే లేనిసంగతిఁ దెలిపి తనపేరు సత్యకాముఁ డనుజాబాలి యని చెప్పు మనెను. జాబాలి గురువుకడ కేఁగి తల్లి చెప్పినరీతినే చెప్పెను. గురువు దివ్యదృష్టి నాతని జననకథఁ దెలిసికొని యాతని

కుపనయన మొనరించి గాయత్రీమంత్రోపదేశముఁ జేసెను. బ్రహ్మ విద్యాబోధ కర్హత గడించునంతనుఁ దన గోవులను మేఁపుచుండు మని గురువు జాబాలి కాదేశించెను.

జాబాలి దేవతలవలన బ్రహ్మజ్ఞాన మందుట.

జాబాలి గురుధేనువులఁ దోలుకొని వనమున కేఁగి యట సత్యసంధుఁడై గోసేవఁ జేయుచు గురుభక్తితత్పరుఁడై యుండెను. కొంతకాలమున కాగోవులు సహస్రసంఖ్యాకములై జాబాలిరక్షణమునఁ బుష్టియుఁ దుష్టియు నందెను. ఈతని సత్య నిష్ఠకును, గురుభక్తికిని, గోపూజాపరతకు దేవత లీతనిని మెచ్చుకొని యీతనికి మహోపకృతిఁ జేయఁ దలఁచిరి.

ఒకనాఁడు వాయుదేవుఁ డొకవృషభమున నావేశించి జాబాలితో ని ట్లనెను: "ఆర్యా! నీవు నమ్మమితదయతోఁ గాపాడుటవలన మేము సహస్రసంఖ్యాకుల మైతిమి. మ మ్మిఁక మాటి గురుగృహమునకుఁ దోలుకొని వెళ్లుము. మేము నీకుఁ జేసెన యుపకృతి నొనరింతుము. మీగురువు నిన్నుఁ గని సంతోషించు" నని చెప్పెను. జాబాలి యట్లే యని గోవులను మరలించుకొని గురుగృహమున కేఁగుచుండెను.

దారిలో వాయుదేవుఁ డావేశించినవృషభ మాతనికి బ్రహ్మజ్ఞానప్రబోధక మగునొకదివ్యమంత్రపాదమును దెలిపెను. మఱియొకవృషభము నావేశించి యగ్నియు, నింకొకవృషభము నావేశించి సూర్యుఁడు, మద్గుయ మనుపక్షియు నాతనికి మిగిలిన మంత్రపాదములు బోధింపఁగా నాతఁడు బ్రహ్మజ్ఞానసంపన్నుఁడై దివ్యతేజస్వి యయ్యెను.

## గు రూ ప దే శ ము.

జాబాలి యింటికి వచ్చునరికె హారిద్రుమతుఁ డానందించి గోవులను స్వీకరించి "వత్సా! నీవు దివ్యతేజస్వి వైతివి. నీ ముఖమువలననే నీవు బ్రహ్మజ్ఞాని వైతి వని స్పష్ట మైనది. కావున, నీకు బోధింపఁగల దేమియు లేదు. నీవు యథేచ్ఛ మేఁగి యాశ్రమమును నిర్మించుకొని దివ్యజీవితమును గడపు" మని పలికెను. అందులకు జాబాలి యి ట్లనెను: "గురుదేవా! నీ కటాక్షమున దేవతలు ప్రచ్ఛన్ను లై నాకు బ్రహ్మజ్ఞాన ముపదేశించిరి. కాని, గురుముఖమున నేర్వని బ్రహ్మజ్ఞానము శాశ్వతము గా నిలఁబడదు. కావున, నీముఖమున నేను బ్రహ్మజ్ఞానముఁ బడసినచో నది నిశ్చలము, శాశ్వతము నగును. కావున న న్నను గ్రహించి యుద్బోధింపు" మని కోరెను. గురు వాతని నిగర్వతకును, గురుభక్తికిని సంతోషించి యుక్తకాలమున నాతనికి బ్రహ్మజ్ఞానము నుపదేశించి పంపివేసెను.

## జా బా ల్యు ప ని ష త్తు

తరువాత జాబాలి చిత్రకూటపర్వతప్రాంతమున నొక యాశ్రమమును నిర్మించుకొని యందు జపతపస్స్వాధ్యాయప్రవచన పరుఁ డై యుండి కాలక్రమమున సుబ్రహ్మణ్యస్వామి నారాధించి పరతత్త్వరహస్యముల నెన్నిటినో గ్రహించి యాతనిదయకుఁ బాత్రుఁ డయ్యెను. పిదప నొకనాఁడు పిప్పలాదమహర్షి కుమారుఁ డగు నొకమహర్షి నిచ్చేసి జాబాలి నాశ్రయించి బ్రహ్మజ్ఞాన సంశయములఁ దీర్పు మని కోరెను. పరమజ్ఞానార్థుఁ డగు

పైప్పలాదికి జాబాలిమహర్షి సర్వమును బోధించెను. ఈబ్రహ్మజ్ఞానబోధకమే జాబాల్యుపనిషత్తు.

[1] పైప్పలాది యనుమహర్షి భగవత్స్వరూపి యగుజాబాలిమహర్షిం జూచి యిట్లు పలికెను. "భగవానుండా! పరమతత్త్వరహస్యమును నాకుం జెప్ప వేండెదను. తత్త్వ మేది? జీవుం డెవండు? పశు వేది? ఈశానుం డెవ్వండు? మోక్షోపాయ మేది?"

జాబాలి:—[2]మంచిప్రశ్న మడిగితివి. నేను దెలిసికొన్న రీతినే నీకుం జెప్పెదను.

పైప్పలాది:—[3]నీ వెవరివలనం దెలిసికొంటివి? అని మరల నడిగెను.

జాబాలి:—[4]నేను సుబ్రహ్మణ్యస్వామివలనం దెలిసికొంటి నని మరలం జెప్పెను.

పైప్పలాది:—[5]సుబ్రహ్మణ్యస్వామి యెవరివలనం దెలిసికొనెను?

జాబాలి:—[6]ఆతం డీశానునివలనం దెలిసికొనెను.

---

1 మూలము: "ఓమ్. అథ హైనం భగవంతం జాబాలిం పైప్పలాదిః పప్రచ్ఛ. భగవన్మే బ్రూహి పరమతత్త్వరహస్యం. కిం తత్త్వం? కో జీవః? కః పశుః? క ఈశానః? కో మోక్షోపాయ? ఇతి స తం హోవాచ."

2 మూలము: "సాధుపృష్టం. సర్వం నివేదయామి యథాజ్ఞాత మితి."

3 "పునస్స తమువాచ. కుత స్త్వయా జ్ఞాత మితి."

4 "పునస్స త మువాచ. షడాననా దితి."

5 "పునస్స త మువాచ. తే నాథ కుతో జ్ఞాత మితి."

6 "పునస్స త మువాచ. తే నేశానా దితి."

పైప్పలాది:—[7]ఈశానుని వలన నెట్లు తెలిసికొనెను?

జాబాలి:—[8]ఈశానోపాసనము.

పైప్పలాది:—[9]భగవంతుఁడా? నాకు దయతో నది యెల్లఁ దెలుపుము.

జాబాలి:—[10]అట్లే. నీ వడిగిన సకల తత్త్వములను నివేదింతును. పశుపతి యగు నీశ్వరుఁ డహంకారముచే వ్యాపింపఁ బడయున్నప్పుడు సంసారియై జీవుఁ డగుచున్నాఁడు. అతఁడే పశువు. సర్వజ్ఞుఁడు, సృష్టిస్థితిలయతిరోభావానుగ్రహము లను పంచకృత్యములు గలవాఁడు సర్వేశ్వరుఁడు నగు నీశ్వరుఁడే పశుపతి. జీవులు పశువులు, జీవులకుఁ బతియగుటఁబట్టి పశుపతి యగుచున్నాఁడు."

పైప్పలాది:—[11]జీవులు పశువులెట్లగును? వానికీశ్వరుఁ డెట్లు పతి యగును?

---

7 "పున స్స త ముహాచ. అథ కస్మా త్తేన జ్ఞాత మితి."

8 "పున స్స త ముహాచ. ఈశానోపాసనాదితి."

9 "పున స్స త ముహాచ. భగవన్ కృపయామే రహస్యం సర్వం నివేద యేతి."

10 "స తేన పృష్ట స్సర్వం నివేదయామాస తత్త్వం.
పశుపతి రహంకారావిష్ట స్సంసారిజీవ స్స ఏవ పశుః. సర్వజ్ఞ పంచకృత్య సంపన్న స్సర్వేశ్వర ఈశః పశుపతిః. కే పశవ ఇతి పునస్స త ముహాచ.
జీవాః పశవ ఉక్తాః. తత్పతి త్వా త్పశుపతి స్స పున స్తం హోవాచ."

11 "కథం జీవాః పశవ ఇతి కథం తత్పతిరితి సతముహాచ."

జాబాలి:—[12]గడ్డితినుచు వివేకములేక పరులచేఁ గృషి మున్నగు కర్మములందుఁ బ్రేరేపింపఁబడి సర్వకష్టములు సహించు తనయజమానిచేఁ బశువులెట్లు కట్టఁబడునో యట్లే జీవులు సర్వేశ్వరునిచేఁ గట్టువడుటచేఁ బశువులనఁ బడును. వాని యజమాని వలె సర్వజ్ఞుఁడైనయీశ్వరుఁడు జీవులకుఁ బతి. కావునఁ బశుపతి.

పైప్పలాది:—[13]ఇట్టి జ్ఞాన మెట్లు కలుగు నని మరల నడిగెను.

జాబాలి:—[14]విభూతిధారణమువలననే.

పైప్పలాది:—[15]విభూతి యెట్లేయేతావుల ధరింపవలయును?

జాబాలి:—[16]సద్యోజాతాది పంచబ్రహ్మమంత్రములచేత భస్మమును గ్రహించి 'అగ్నిరితి భస్మ' అనుమంత్రముచే నాభస్మము నభిమంత్రించి 'మానస్తోకే తనయే' అనుమంత్రమున

---

12 "యథా తృణాశినో వివేకహీనాః పరప్రేష్యాః కృష్యాది కర్మసు నియుక్తాః సకలదుఃఖసహాః స్వస్వామి బధ్యమానా గవాదయః పశవః యథా తత్స్వామిన ఇవ సర్వజ్ఞ ఈశః పశుపతిః."

13 "తద్ జ్ఞానం కేనోపాయేన జాయతే పున స్స త మువాచ."

14 విభూతి ధారణాదేవ."

15 తత్ప్రకారం. కథమితి కుత్ర కుత్ర ధార్యమ్."

16 "సద్యో జాతాది పంచబ్రహ్మ మంత్రైః భస్మసంగృహ్య 'అగ్నిరితి భస్మ' ఇత్యనే నాభి మంత్ర్య 'మానస్తోక' ఇతి సముద్ధృత్య జలేన సంసృజ్య శిరోలలాటవక్షస్కంధేష్వితి తిసృభిస్త్రియాయుషై స్త్ర్యంబకై స్తిర్య క్తిస్రోరేఖాః ప్రకుర్వీత వ్రత మేత చ్ఛాంభవం సర్వేషు వేదేషు వేదవేదాభిరుక్తం భవతి. తత్సమాచరే న్ముముక్షు ర్న పున ర్భవాయ!

జలమునఁ గలిపి, శిరస్సు, లలాటము, వక్షము, భుజములు వీని యందు 'త్ర్యాయుషం జమదగ్నేః, త్ర్యంబకం యజామహే' అను మంత్రముల చేత అడ్డముగా మూఁడు రేఖ లేర్పడునట్లు ధరింప వలయును. ఇది శాంభవవ్రతము. వేదవాదు లందఱు నిట్లు వేదములలోఁ జెప్పియున్నారు. దీనిని జక్కఁగా ననుష్ఠించినవాఁడు పునర్జన్మము నందఁడు. [17] శుభస్మధారణమునకుఁ బ్రమాణము సనత్కుమారులు చెప్పిరి.

[18] త్రిపుండ్రధారణము యొక్క మూఁడు రేఖలు లలాటము మొదలు కనుబొమల మధ్యవఱకు నుండవలయును.

[19] వీనిలో మొదటిరేఖ గార్హపత్యాగ్ని, అకారము, రజోగుణము, భూలోకము, స్వాత్మ, క్రియాశక్తి, ఋగ్వేదము, ప్రాతస్సవనము, బ్రహ్మ అధిదేవత.

[20] రెండవరేఖ దక్షిణాగ్ని, ఉకారము, సత్వగుణము, ఆకాశము, భువర్లోకము, అంతరాత్మ, ఇచ్ఛాశక్తి, యజుర్వేదము, మధ్యాహ్నసవనము, విష్ణువు అధిదేవత.

---

17. "అథ సనత్కుమారం ప్రమాణం వదతి."

18. "త్రిపుండ్ర ధారణస్య త్రిధా రేఖా ఆలలాటా దాచక్షుషో రా భ్రువో ర్మధ్యతశ్చ."

19. యాఽస్య ప్రథమరేఖా సా గార్హపత్య శ్చాకారో రజో భూర్లోక స్స్వాత్మా క్రియాశక్తి ఋగ్వేదః ప్రాతస్సవనం ప్రజాపతి ర్దేవో దేవతేతి."

20. "యాఽస్య ద్వితీయా రేఖా సా దక్షిణాగ్ని రుకారస్సత్వ మంతరిక్ష మంతరాత్మా చేచ్ఛాశక్తి ర్యజుర్వేదో మాధ్యం దినం సవనం విష్ణు ర్దేవో దేవతేతి."

[21]మూఁడవ రేఖ ఆహవనీయాగ్ని, మకారము, తమోగుణము, స్వర్గలోకము, పరమాత్మ, జ్ఞానశక్తి, సామవేదము, సాయంసవనము, మహాదేవుఁడు అధిదేవత.

[22]ఇట్లు త్రిపుండ్రమును దెలిసికొన్న విద్వాంసుఁడు బ్రహ్మచారి, గృహస్థుఁడు, వానప్రస్థుఁడు, సన్న్యాసి – వీరిలో నెవఁడైనను, విభూతి ధారణము చేసినయెడల మహాపాతకముల నుండియు, ఉపపాతకములనుండియు విముక్తి గలుగును. త్రిపుండ్ర ధారణము చేయువాఁడు సకలవేదాధ్యయనము చేసినవాఁ డగుచున్నాఁడు; సకలదేవతలను ధ్యానించినవాఁ డగుచున్నాఁడు; సమస్తతీర్థములయందు స్నానము చేసినవాఁ డగుచున్నాఁడు; సకలరుద్రమంత్రములను జపించినవాఁ డగుచున్నాఁడు. వాఁడు మరల జన్మించుట కాని, జన్మదుఃఖము ననుభవించుట కాని యుండదు.”

### జాబాలి శ్రీరాముని రాజ్యము చేయు మనుట

తొల్లి సీతారామలక్ష్మణులు చిత్రకూటాద్రిఁ జేరినతరువాత భరత శత్రుఘ్నులు వసిష్ఠాదులతో నచటికి విచ్చేసిరి.

---

21. “యాఽస్య తృతీయరేఖా సా ఆవహనీయో మకారస్తమో ద్యౌర్లోకః పరమాత్మ జ్ఞానశక్తి స్సామవేద స్తృతీయసవనం మహాదేవో దేవతేతి.”

22. “త్రిపుండ్రం భస్మనా కరోతి యో విద్వాన్ బ్రహ్మచారీ గృహీ వానప్రస్థో యతిర్వా స మహాపాతకోపపాతకేభ్యః పూతో భవతి. స సర్వా న్వేదా నధీతో భవతి. స సర్వాన్ దేవాన్ ధ్యాతో భవతి. స సర్వేషు తీర్థేషు స్నాతో భవతి. సకలరుద్రమంత్రజాపీ భవతి. న స పునరావర్తతే. న స పునరావర్తత ఇతి. ఓం సత్య మిత్యుపనిషత్.”

భరతుఁడు రాముని పాదములపైఁ బడి తిరిగి యయోధ్యకు వచ్చి రాజ్యముస్వీకరించి తన్నుఁ బ్రజలను రక్షింపు మని కోరెను. అపుడు రాముఁ డాతని నోదార్చి యింటికేఁగి రాజ్యము చేయుచుండుమనియుఁ బదునాలుగేండ్లయినపిదప వచ్చెదననియుఁ జెప్పెను.

ఆసమయమున నట నున్న జాబాలిమహర్షి శ్రీరాముని చిత్తశుద్ధి పరీక్ష చేయుటకును, ఏమాత్రము వీలైనను రాముఁ డయోధ్య కేఁగి రాజ్యము స్వీకరించుట లోకశ్రేయ మగునని చెప్పిచూచుటకును శ్రీరామునితో నిట్లనెను: "రామా! బుద్ధిమంతుఁడవు, ధైర్యశాలివి, నీవే యిట్లు సామాన్యునివలె మాటాడుచున్నా వేల? ఈ జగమున నెవని కెవరు? తలిదండ్రు లన నెవరు? వారియాజ్ఞ పాలించుట యెట్టిది? ఒకనరుఁ డొకగ్రామము నుండి మఱియొక గ్రామమున కేఁగుచు దారిలో నొక చెట్టు నీడను క్షణముసేపు నిలిచి మరలఁ బయనమై పోవునట్లు భూమిపై జీవులు సంసారయాత్ర సాగించెదరు. చెట్టునీడలవలె నాశ్రయ మొసంగిన జననీజనకులఁ గూర్చి ప్రతి చూపుట సజ్జనలక్షణము కాదు. చక్కఁగా రాజ్యము చేసి ప్రజాసుఖముఁ గూర్చుటకు బదులు నీవు దుర్మార్గమును బట్టినావు. వెఱ్ఱివై చెడిపోక అయోధ్య కేఁగి హాయిగా రాజ్యసుఖము లనుభవింపుము. నీతండ్రి నీకు బీజమాత్ర సంబంధియే. అంతకు మించి నీకు నాతనికి సంబంధము లేదు. ఆతనిగతి యతనిది. నీగతి నీది. ప్రత్యక్షసుఖముల ననుభవింపక చచ్చినవానిఁ గూర్చి చింతిల్లుచు ననేక కష్టములకుఁ

బొల్పడుచున్నావు. శ్రాద్ధాదులందుఁ జనిపోయినవారి నుద్దే శించి యింకొకరికి కన్నము పెట్టుదురు. ఇది యెంత తెలివి తక్కువ పని?

కాన, నీవు పరోక్షసుఖ మనుకొను పితృపాలన మను చేతకానిమాట మాని ప్రత్యక్షసుఖకర మగు రాజ్యమును స్వీకరింపుము.”

రాముఁ డందుపై జాబాలితో ని ట్లనెను: “అయ్యా! నీవు చెప్పినది హితమువలెఁ దోఁచునే కాని యది హితము కాదు. ఆమార్గము దుఃఖప్రదము. సత్పురుషు లెన్నఁడు గౌర వములను, రాజ్యములను స్వీకరింపరు. ఎవఁ డెంత యోగ్యుఁడో వానియాచారమును బట్టియే తెలియును. వైదికక్రియలు మాని విశ్వసంకరకర మైన నీ చార్వాకమతము నే నంగీకరింపఁజాలను. వనవాస నియమ ప్రతిజ్ఞను మాని నేను నీవు చెప్పినట్లు వర్తింతు నేని నే నొరులకు ధర్మము బోధించుపాకుఁ గోల్పోవుదును. ధర్మరీతి నేను విడువక యొరులను ధర్మముగా నడువుఁ డని నేను బోధించిన నామాట వినువా రెవరు? ‘యథారాజా తథాప్రజా’ కదా!

సత్యమే పరమధర్మము. సత్యమే స్వర్గహేతువు. సత్య మునే లక్ష్మి యాశ్రయించును. సత్యవంతున కైహికాముష్మిక సుఖములు సమకురును. నేను సత్యవాక్పాలనమే పితృాజ్ఞాపాల నమే నియమముగాఁ గలవాఁడను.

కర్తవ్యమేదియో అకర్తవ్యమేదియో నే నెఱుఁగుదును. నాకుఁ గృత్రిమబుద్ధి లేదు. కావున, శ్రద్ధాయుక్తుఁడనై శుద్ధ

మిత్రుఁడనై వనవాస మొనరించుచు, పితరులకు దేవతలకుఁ దృప్తి గూర్చుచు జనకునివాక్యము గావించి జీవయాత్ర గడపెదను. నీకంటె శ్రేష్ఠులైన ఋషులు చెప్పిన వైదిక మార్గమునే నే ననుసరించెదను. నీవు చెప్పిన యవైదిక మార్గము దుష్టము. దానిని నే నిరసించెదను.”

ఆమాటలు విని జాబాలి రామునికి నమస్కరించి “రామా! నేను నాస్తికుఁడను గాను. ఆస్తికుఁడనై నాస్తిక మతముల ఖండించుచుందును. కాని. ఈతరుణమునఁ గార్యసిద్ధికై నాస్తిక్యబుద్ధి గలట్లు నటించి నీ హృదయ మెఱుఁగఁగంటిని. నీవు నగరమున కేఁగి రాజ్యము స్వీకరించిన నెల్లరు సంతసింతు రని యిట్లంటిని” అని పలికెను.

అపుడు రాముఁ డింకను బ్రసన్నుఁడు కాకుండుటఁ గని వసిష్ఠమహర్షి యాతనితో ని ట్లనెను: “రామా! జాబాలి మహర్షి యిహపరములు కల వని వైదికమార్గమును నమ్మిన వాఁడే. అతనివంటి యాస్తికుఁడు లేఁడు. నాయూహ మెఱిఁగి తన ధర్మమును దాను నిర్వర్తించుటకే యట్లు నీతోఁ బలికినాఁ” డని చెప్పఁగా రాముఁడు జాబాలికి నమస్కరించి యాతనియెడఁ బ్రసన్నుఁడయ్యెను. జాబాలియు రాముని బూజించి వీడ్కొనియెను.

ఈవిధముగా జాబాలిమహర్షి జగద్విఖ్యాత చరిత్రుఁడు, పూజనీయుఁడు నయ్యెను.

---

శ్రీ సత్యదూంబా ముద్రణాలయము, కాకినాడ.

# శ్రీ వేంకటేశ్వరగ్రంథావళి

| | | | |
|---|---|---|---|
| 1. | అష్టావక్రచరిత్రము | (పద్యకావ్యము) | రు. 1-8-0 |
| 2. | అష్టావక్రసంహిత | ,, | 1-0-0 |
| 3. | అంశోత్రపహారము | ,, | 0-8-0 |
| 4. | అహల్యాగౌతమము | ,, | 2-0-0 |
| 5. | అరుంధతీవసిష్ఠము | ,, | 1-0-0 |
| 6. | కుందమాల | (నాటకము) | 2-0-0 |
| 7. | అభిషేకము | ,, | 2-0-0 |
| 8. | వేణీసంహారము | ,, | 3-0-0 |
| 9. | యజ్ఞఫలము | ,, | 2-0-0 |
| 10. | రత్నత్రయము | (వచనము) | 1-0-0 |
| 11. | శ్రీమహర్షి జీవితకథామృతము మొదటిభాగము | ,, | 2-0-0 |
| 12. | ,, రెండవభాగము | ,, | 2-0-0 |

బి. వి. అండు సన్సు,

రామారావుపేట : : కాకినాడ.